గురువారం
26•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 181
• పేజీలు : 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

రాష్ట్రంలోని ప్రతిమూలకూ

ఆర్టీసీ కార్గో సర్వీస్

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏండ్లకు పెంపు

ఉత్తర్వులపై సీఎం కేసీఆర్ సంతకం • 49,733 మంది ఉద్యోగులకు ప్రయోజనం



ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏండ్లకు పెంచినందుకు బుధవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఆర్టీసీ అధికారులు. చిత్రంలో రవాణాశాఖమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు

- ప్రభుత్వపరంగా ప్రతి సరుకు రవాణా ఆర్టీసీతోనే
- హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లో స్టాక్ పాయింట్లు
- అన్నిచోట్లా సరుకు రవాణాకు వ్యూహం సిద్ధంచేయండి
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశాలు
- సమస్యల పరిష్కారానికి 202 మందితో సంక్షేమబోర్డు
- బోర్డు కూర్పు, పని విధానాన్ని ఖరారుచేసిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆర్టీసీలో కార్గో, పార్సిల్ సేవలను విస్తృతపరిచేందుకు వ్యూహం సిద్ధంచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు రవాణా సదుపాయం కల్పించినట్లుగానే అన్నిచోట్లకూ సరుకు రవాణాచేయాలని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 ఏండ్ల నుంచి 60 ఏండ్లకు పెంచుతూ.. అందుకు సంబంధించిన ఉత్తర్వులపై సంతకంచేశారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ముఖ్యమంత్రి.. ఈ బోర్డు కూర్పు, పని విధానాన్ని ఖరారుచేశారు. తెలంగాణ ఆర్టీసీపై ప్రగతిభవన్‌లో బుధవారం సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, ఈడీలు పాల్గొన్నారు. ఆర్టీసీని లాభాలబాట పట్టించడం, సరుకు రవాణా విభాగాన్ని పటిష్ఠంచేయడం, కార్మికులకు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై సీఎం సమీక్షించారు. ఆయా అంశాలపై పలు నిర్ణయాలు ప్రకటిస్తూ అధికారులకు సూచనలుచేశారు.

సరుకు రవాణాకు సర్కారు చేయూత

ఇకనుంచి ప్రభుత్వపరంగా జరిగే ప్రతి సరుకు రవాణాను ఆర్టీసీ ద్వారానే చేపడుతామని సీఎం కేసీఆర్ తెలిపారు. 'ఆర్టీసీ బస్సులు ప్రతిరోజు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాలను చుట్టి వస్తున్నాయి. లక్షలమందికి రవాణా సదుపాయం కల్పిస్తున్నాయి. అదే మాదిరిగా ఎక్కడినుంచి ఎక్కడికైనా, ఏ మారుమూల ప్రాంతానికైనా సరుకు రవాణాను కచ్చితంగా 'ఆర్టీసీ కార్గో, పార్సిల్ సర్వీసు' ద్వారానేచేస్తాం. దీనికి సంబంధించి అన్ని శాఖలకు ఆదేశాలిస్తాం. బతుకమ్మ చీరెలు, విద్యాసంస్థలకు పుస్తకాలు, డిపోల నుంచి బ్రాందీ షాపులకు మద్యం, దవాఖానలకు మందులు.. ఇలా ప్రభుత్వపరంగా ప్రతి సరుకు రవాణా ఇకపై ఆర్టీసీ ద్వారానే జరిగేట్లు చూస్తాం. ప్రజలు తమ సరుకులను రవాణాచేయడానికి ఇప్పటిదాకా ప్రైవేటు ట్రాన్స్‌పోర్టులను వినియోగిస్తున్నారు. ఇకపై

మిగతా 2వ పేజీలో

• ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బుధవారం క్రిస్మస్ సందర్భంగా వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చికి ప్రార్థనల కోసం పెద్దసంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవులు

ఎస్సారెస్పీ కింద

యాసంగి శోభ

ప్రాజెక్ట్ చరిత్రలో తొలిసారి పూర్తిఆయకట్టుకు నీటివిడుదల

ఎల్ఎండీ ఎగువవరకు ఎస్సారెస్పీనుంచి..
దిగువన ఆయకట్టుకు కాళేశ్వరం జలాలు
ఆన్ ఆఫ్ పద్ధతిలో ఏడు తడుల కింద నీటివిడుదల
13.49 లక్షల ఎకరాల్లో యాసంగి సాగుకు సిద్ధం

ఎస్సారెస్పీ జలాశయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ మెండోరా:

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగికి సాగు నీరు విడుదలయింది. ప్రాజెక్టు చరిత్రలో మొదటిసారి యాసంగిలో పూర్తి ఆయకట్టుకు నీరందిస్తున్నారు. దీంతో సుమారు 13.49 లక్షల ఎకరాలకు ఈసారి యాసంగి శోభ రానున్నది. ప్రాజెక్టు కింద ప్రధానమైన కాకతీయ, సరస్వతి, లక్ష్మీ కాల్వలకు అధికారులు బుధవారం నీటిని విడుదల చేశారు. మొదటి, రెండోఫేజ్‌ల కింద సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వరకు ఆన్ ఆఫ్ పద్ధతిలో ఏడుతడులుగా నీరందించనున్నారు. ఎల్ఎండీ ఎగువన ఉన్న 4.62 లక్షల

మిగతా 6వ పేజీలో

భూగర్భ జలమట్టాలు పెంచేందుకు

అటల్ భూజల యోజన

ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ.. ఏడు రాష్ట్రాల్లో అమలు

జల్‌జీవన్ మిషన్‌తో ఇండ్లకు నల్లాలద్వారా తాగునీరు • నీటి పథకాలకు వచ్చే ఐదేండ్లలో రూ.3.5 లక్షల కోట్లు
తక్కువ నీటిని వినియోగించే పంటలు సాగుచేయాలి • ప్రతి గ్రామం జలనిధిని ఏర్పాటుచేసుకోవాలి: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:

ఏడు రాష్ట్రాల్లో భూగర్భ జలాలను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన 'అటల్ భూజల యోజన'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ నీటిని వినియోగించే పంటలను, సాగు పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. నీటి వనరుల సంరక్షణకు ఇది దోహదపడుతుందని చెప్పారు. మహారాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల్లోని 78 జిల్లాల పరిధిలో ఉన్న 8,300కు పైగా గ్రామాల్లో భూగర్భ జలాలను మెరుగుపరిచేందుకు 'అటల్ భూజల్ యోజన' ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయం అత్యధికంగా భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉన్నదని, పురాతన సాగుపద్ధతులవల్ల నీరు వృథా అవుతున్నదని మోదీ చెప్పారు. చెరకు వంటి పంటలకు నీరు అధికంగా అవసరమవుతుందని, అలాంటి పంటలను సాగుచేసే ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటాయని పేర్కొన్నారు. దీన్ని మెరుగుపరిచేందుకు వాననీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, అలాగే వారిని సూక్ష్మసాగు విధానాల (మైక్రో ఇరిగేషన్) వైపు మళ్లించాల్సిన అవసరం ఉన్నదని ప్రధాని మోదీ చెప్పారు. ప్రతి గ్రామం నీటి కార్యాచరణ ప్రణాళికను, జలనిధిని ఏర్పాటుచేసుకోవాలని, సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల నిధులను కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు తక్కువగా ఉన్న గ్రామాలు జలబడ్జెట్‌ను సిద్ధంచేసుకోవాలని, అందుకనుగుణంగా రైతులు

మిగతా 5వ పేజీలో



బుధవారం ఢిల్లీలో అటల్ భూజల యోజన ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ

ఆకాశ వీధిలో అద్భుతం

నేడు సూర్యగ్రహణం
ఉంగరం ఆకారంలో కనిపించనున్న సూర్యుడు
హైదరాబాద్‌లో ఉదయం 9.30 గంటల సమయంలో పూర్తిస్థాయిలో వీక్షించే అవకాశం

5

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)			
ఫారంధర	100.00	లిటైల్ లైవ్	122.00
డ్రెస్‌డ్	177.00	స్కిన్‌లెస్	201.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)			
హైదరాబాద్	440.00	రంగారెడ్డి	440.00
మెదక్	440.00	కరీంనగర్	443.00
వరంగల్	443.00	డజన్‌ధర	69.00

ఫ్లయింగ్ 2020

నయాసాల్.. నయా జోష్

- కొత్త సంవత్సర వేడుకలకు విదేశీ ప్రయాణాలు
- 40 శాతం అదనంగా బుకింగ్‌లు
- దుబాయ్ బుకింగ్‌లు ఫుల్
- గోవాకూ పోటెత్తనున్న యువత

శిరందాస్ ప్రవీణ్‌కుమార్,
హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

నయాసాల్‌ను.. నయాజోష్‌తో ఆహ్వానించాలని యువత క్రేజీగా సిద్ధమవుతున్నది. ఎవరికి వారు వారి వారి స్థాయిల్లో కొత్త సంవత్సరం వేడుకలకు ఏర్పాట్లుచేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో.. శివార్లలో పార్టీలకు రిసార్టులు పూర్తిగా బుక్ అయ్యాయి. ఈసారి ఎక్కువమంది విదేశాల్లో న్యూఇయర్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు తయారవుతున్నారు. లేదంటే.. గోవా, ఢిల్లీ, ముంబై నగరాలకు పయనమవుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి విదేశీయానానికి వెళ్లేవారి సంఖ్య సగటున 30 నుంచి 40శాతం పెరిగింది. అంతర్జాతీయ విమానయాన ప్రయాణికుల సంఖ్య 30 శాతం పెరిగిందని.. అదే సమయంలో డొమెస్టిక్ ప్రయాణికుల సంఖ్య కూడా 35 శాతం వరకు పెరిగిందని హైదరాబాద్ విమాన సంస్థలు పేర్కొన్నాయి. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 మధ్యన కొలంబోకు 20-25 శాతం, బ్యాంకాక్‌కు 30-35 శాతం ప్రయాణికులు పెరిగారని

మిగతా 6వ పేజీలో

బుధవారం క్రిస్మస్ సందర్భంగా ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ డీ రాజేశ్వరరావు

ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు బైబిల్ గ్రంథాన్ని, క్రిస్మస్ కేక్‌ను అందజేస్తున్న మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్‌లూక్

అబిడ్స్‌లోని సెయింట్ జోసఫ్ క్యాథెడ్రల్ చర్చిలో మేరీమాత విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళ

క్రిస్మస్ సందర్భంగా సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరి చర్చిలో క్రిస్టియన్ల సందడి

బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, యునైటెడ్ ముస్లిం ఫోరం నాయకులు

ఎన్నార్సీ, సీఏఏను వ్యతిరేకించాలి

- ఎన్పీఆర్‌ను నిలిపివేయాలి
- సీఎం కేసీఆర్‌ను కోరిన ముస్లిం నేతలు
- రేపు నిజామాబాద్‌లో భారీ బహిరంగసభ
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే కుట్రలో భాగమైన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్ (ఎన్నార్సీ)ని వ్యతిరేకించాలని మజ్లిస్ పార్టీతోపాటు వివిధ ముస్లిం సంఘాల ప్రతినిధులు సీఎం కే చంద్రశేఖర్‌రావును కోరారు. కేరళ, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాల తరహాలో నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) అమలును నిలుపుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. ఎన్పీఆర్ అనేది ఎన్నార్సీ వైపు తొలి అడుగులాంటిదన్నారు. ఎన్నార్సీ, సీఏఏ అమలుపై ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, యునైటెడ్ ముస్లిం ఫోరం నేతలు బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి చర్చించారు. ఈ చర్చలో హోంమంత్రి మహమూద్ అలీ కూడా పాల్గొన్నారు. మత వివక్షతో కూడిన సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని వారు సీఎంకు విజ్ఞప్తిచేశారు. వాటిని రాష్ట్రంలో అమలుచేయకూడదని సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం సమర్పించారు. కేరళలో ఎన్నార్సీని నిలిపివేయాలని అక్కడి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ నిర్ణయం తీసుకున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందే పశ్చిమబెంగాల్ రాష్ట్రం దీనిని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఆర్డర్ కాపీని సీఎం కేసీఆర్‌కు అందజేశారు. భేటీ అనంతరం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో తమ చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని చెప్పారు. తాము చెప్పిన విషయాలను సీఎం శ్రద్ధగా విన్నారని, తాము కోరిన విధంగా అనుకూల నిర్ణయమే తీసుకుంటారని ఆశిస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నార్సీని అమలుచేయడంలో భాగంగానే ఎన్పీఆర్‌కు పచ్చజెండా ఊపారన్నారు. పౌరసత్వ చట్ట సవరణ, ఎన్నార్సీకి వ్యతిరేకంగా శుక్రవారం నిజామాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్టు ఒవైసీ వెల్లడించారు. ఈ సభకు అన్ని పార్టీలను ఆహ్వానించాలని సీఎం కేసీఆర్ సూచించారని, ఈ మేరకు నిజామాబాద్ సభకు టీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలను ఆహ్వానిస్తామని చెప్పారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని ప్రకటించారు.

ప్రతిమూలకూ ఆర్టీసీ కార్గో సర్వీస్

మొదటిపేజీ తరువాయి...

ఆర్టీసీలోనే తమ సరుకును రవాణాచేసేలా ప్రోత్సహించాలి. నగరాలు, పట్టణాల నుంచి మారుమూల ప్రాంతాలకు సరుకు రవాణాచేయడానికి అనుగుణమైన ఏర్పాట్లు చేయాలి. ఆర్టీసీ బస్సుపోని ఊరంటూ లేదు. ప్రతి మారుమూల ప్రాంతానికీ పోతుంది. ఆర్టీసీ సురక్షితం అనే పేరున్నందున సరుకు రవాణా విభాగాన్ని కూడా పటిష్ఠపరిస్తే ప్రజలు తమ సరుకుల రవాణాకు కచ్చితంగా ఆర్టీసీని ఆశ్రయిస్తారు. రాష్ట్ర పరిధిలోనే కాకుండా తెలంగాణ ప్రజలు ఎక్కువగా నివసించే ముంబై, భివాండీ, షోలాపూర్, నాగ్‌పూర్, జగ్దల్‌పూర్ తదితర ప్రాంతాలకూ సరుకు రవాణాచేయాలి. సరుకు ఎగుమతి, దిగుమతికోసం హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేయాలి. సరుకు రవాణా ఎక్కువచేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటంతోపాటు ఆర్టీసీ కూడా లాభాల బాట పడుతుంది. తద్వారా ఉద్యోగులకు బోనస్ కూడా ఇచ్చుకొనే పరిస్థితి వస్తుంది. సరుకు రవాణా విషయంలో ఎలా వ్యవహరించాలనే దానిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి. సరుకు రవాణాకు అనుగుణంగా బస్సులను సిద్ధంచేయాలి' అని సీఎం కేసీఆర్ అన్నారు.

ఉద్యోగుల సంక్షేమ బోర్డు ఏర్పాటు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఎప్పటికప్పుడు ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కొనడానికి ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగుల సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. బోర్డు కూర్పుపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రతి డిపో, ప్రధాన కార్యాలయం నుంచి ఇద్దరు ఉద్యోగులు చొప్పున మొత్తం 202 మంది మండలిలో సభ్యులుగా ఉంటారు. ఇందులో 94 మంది బీసీలు, 38 మంది ఎస్సీలు, 26 మంది ఎస్టీలు, 44 మంది ఓసీలు ఉంటారు. మొత్తం సభ్యుల్లో మహిళా ఉద్యోగులు 73 మంది ఉంటారు. బోర్డు సమావేశం డిపో పరిధిలో వారానికి ఒకసారి, రీజియన్ పరిధిలో నెలకు ఒకసారి, కార్పొరేషన్ పరిధిలో మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలి. ఈ సమావేశాల్లో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను పరిష్కరిస్తారు. ఆర్టీసీని కాపాడేందుకు, లాభాల బాట పట్టించడానికి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తారు. ఉద్యోగులు కూడా తగిన స్ఫూర్తి, చిత్తశుద్ధితో తమ బాధ్యతలు నిర్వర్తించేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. రాబోయే పదిరోజుల పాటు ఆర్టీసీ ఈడీలు, ఉన్నతాధికారులు డిపోలవారీగా సమావేశాలు నిర్వహించి, ఎక్కడికక్కడ తగిన వ్యూహం రూపొందించాలన్నారు. హైదరాబాద్‌లోని వివిధ డిపోల నుంచి నేరుగా చెన్నై, నాగపూర్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని సీఎం తెలిపారు. వివాహాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులు ఇచ్చే విషయంలో సరళమైన విధానం అనుసరించాలని సీఎం సూచించారు.

బుధవారం ప్రగతిభవన్‌లో ఆర్టీసీపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ, ఈడీలు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు.. వయసులవారీగా

హోదా	0-25	26-30	31-35	36-40	41-45	46-50	51-55	56-58	మొత్తం
అధికారులు	0	0	17	12	42	46	112	64	293
సూపర్‌వైజర్లు	0	37	98	55	68	125	366	238	987
డ్రైవర్లు	1	60	983	3556	4813	4105	3508	1606	18432
కండక్టర్లు	115	526	3615	3411	4955	3491	3095	1009	20217
గ్యారేజీ స్టాఫ్	13	186	482	1110	828	920	1549	657	5745
ఇతరులు	41	83	147	126	168	404	2115	975	4059
మొత్తం	**170**	**892**	**5342**	**8070**	**10874**	**9091**	**10764**	**4558**	**49733**

60 ఏండ్లకు పదవీ విరమణ

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 60 ఏండ్లకు పెంచుతూ సీఎం కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సీఎం కేసీఆర్ బుధవారం సంతకంచేశారు. దీనితో ఆర్టీసీలో పనిచేస్తున్న 49,733 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతున్నది. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న 103 మంది ఉద్యోగుల జీవితాల్లో ఇది పెద్ద ప్రయోజనమనే చెప్పవచ్చు. ఈ నెలలో పదవీ విరమణ వయస్సు పెంచితే బాగుండునని ఊపిరి బిగపట్టుకొని చూసిన ఆర్టీసీ చిరుద్యోగులకు సీఎం కేసీఆర్ క్రిస్మస్ సందర్భంగా భారీ కానుక ప్రకటించారు. 2019లో పదవీ విరమణ చేయాల్సిన అన్ని విభాగాల సిబ్బంది 659 మంది ఉండగా ఇప్పటివరకు 556 మంది రిటైర్ అయ్యారు. మిగిలిన 103 మందికి పెరిగిన పదవీ విరమణ వయస్సు అమలుకానున్నది. వచ్చే ఏడాదిలో 1,956 మంది ఉద్యోగులకు, 2021లో 2,075 మందికి ప్రయోజనం కలుగనున్నది. ఇందులో డ్రైవర్లు, కండక్టర్లకే అధిక ప్రయోజనం అందనున్నది. ఈ ఏడాది చివరి రోజుల్లో పదవీ విరమణకు ఉన్నవారిలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బందే ఎక్కువగా ఉన్నారు. 2020లో 36 మంది అధికారులు, 100 మంది సూపర్ వైజర్లు, 710 మంది డ్రైవర్లు, 422 మంది కండక్టర్లు, 284 మంది గ్యారేజీ సిబ్బంది,404 ఇతర సిబ్బంది ఉన్నారు. పదవీ విరమణ వయస్సు పెంపుతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమయింది. మియాపూర్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న సుధాకర్ అనే ఉద్యోగి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపట్ల సంతోషం వ్యక్తంచేశారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.47 గంటలకు

సూర్యాస్తమయం: 5.41 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం అమావాస్య ఉదయం 10.44 వరకు, తదుపరి పుష్యమాసం, శుక్లపక్షం పాడ్యమి, నక్షత్రం: మూల సాయంత్రం 4.51 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: ఉదయం 10.24 నుంచి మధ్యాహ్నం 12.01 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.35 నుంచి 2.56 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.46 నుంచి సాయంత్రం 4.14 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.13 నుంచి సాయంత్రం 4.51 వరకు, తిరిగి అర్ధరాత్రి 2.43 నుంచి తె.జా. 4.23 వరకు.





సరూర్‌నగర్ మైదానంలో సార్వజనికోత్సవంలో ప్రార్థన చేస్తున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సైయెంట్ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సంఘ్ కార్యకర్తలు

సమాజ హితమే సంఘ్ లక్ష్యం

- సంఘ్ సేవకులు కోరుకునేది దేశ విజయమే
- సార్వజనికోత్సవంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్
- విలువలతోనే మంచి సమాజం
- పద్మశ్రీ అవార్డు గ్రహీత బీవీఆర్ మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమాజంలో పరివర్తన ద్వారానే దేశం ప్రగతిపథంలో నడుస్తున్నదని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ చెప్పారు. ఆర్ఎస్ఎస్ కూడా సమాజంలో పరివర్తన కోసమే పనిచేస్తున్నదన్నారు. సంఘ్ కార్యకర్తలు ఎప్పుడూ సమాజం కోసమే కృషిచేస్తారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ శాఖలను విస్తరించడంలో భాగంగా మూడురోజుల శిక్షణా కార్యక్రమాన్ని హైదరాబాద్ శివారు మంగళ్‌పల్లిలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేశారు. అందులో భాగంగా బుధవారం సరూర్‌నగర్ మైదానంలో ఏర్పాటుచేసిన ఆర్ఎస్ఎస్ విజయ సంకల్ప శిబిరం సార్వజనికోత్సవం సభలో మోహన్ భాగవత్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, క్రమశిక్షణతో కూడిన అభివృద్ధి విషయంలో ప్రపంచానికి మార్గదర్శనం చేసేలా భారత్ ఉండాలని ఆకాంక్షించారు. సంఘ్ సేవకులు దేశ విజయం కోరుకుంటారని, దేశ ప్రజల ఆకాంక్ష ధర్మ విజయమని, రాజ్యాలు, వైభవాలు, మోక్షం కోరుకోనివాళ్లు ధర్మ విజయం సాధిస్తారని చెప్పారు. ధర్మ విజయంలో అందరి విజయం ఉంటుందన్నారు. విజయం మూడు రకాలుగా ఉంటుందని తెలిపారు. అందరినీ దుఃఖంలో ఉంచడం ద్వారా తాను విజయం సాధించాలని కొందరు కోరుకుంటారని, వీళ్లు నీతి నియమాలు పాటించరన్నారు. విధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటారని, ఇలాంటివారి విజయాన్ని అసుర విజయం అంటారని చెప్పారు. కొంతమంది స్వార్థం కోసం, రాజ్యకాంక్ష కోసం ఇతరులను భయపెట్టి పైకి వస్తారని, ఇలాంటివారు దేశానికి ప్రమాదకరమన్నారు. ఇంకొందరు దునియా మొత్తం తన వద్దే ఉండాలని కోరుకుంటారని, వారి స్వార్థం కోసం ప్రజలను కొట్లాటల్లోకి నెడుతారని, ఇది హిందూ సమాజంలో నిషిద్ధమని వెల్లడించారు. ధర్మ విజయం కోరుకొనేవారు తన కోసం ఏమీచేసుకోరని, తన కష్టంతో ఇతరులను సుఖంగా ఉంచేందుకు పోరాడుతారని పేర్కొన్నారు. ఇలాంటి పోరాటాలు ఆర్ఎస్ఎస్ చేస్తున్నదని చెప్పారు. నిస్వార్థంగా పనిచేసేవారే సంఘ్‌కు కావాలని, సంఘటిత్ హిందూ సమాజ్ కోసం సంఘ్ కార్యకర్తలు పోరాడుతారని తెలిపారు.

పిల్లలకు తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలి

విలువలతోనే మంచి సమాజాన్ని నిర్మించగలమని పద్మశ్రీ అవార్డు గ్రహీత, సైయెంట్ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. మంచి, చెడుల విషయంలో తల్లిదండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలో స్త్రీలకు గొప్పస్థానం ఉన్నదని చెప్పారు. మహిళలపై అరాచకాలు బాధాకరమన్నారు. టెక్నాలజీ, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, వంటి రంగాల్లో సమాజంలో ఆర్ఎస్ఎస్ ఎంతో మార్పు తెస్తున్నదని, టెక్నాలజీలో నైపుణ్యం రావాలంటే మంచి విద్య అవసరమని అన్నారు. కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, పార్టీ నేతలు ఆచారి, డీకే అరుణ, ఎంపీలు, రాష్ట్రం నలుమూలల నుంచి స్వయం సహాయక సేవకులు, ఏబీవీపీ, కిసాన్‌సంఘ్ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఆర్టీసీలో సంబురాలు

- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- పటాకులు కాల్చిన ఉద్యోగులు

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/జనగామ టౌన్: సీఎం కేసీఆర్ తమ పదవీవిరమణ వయస్సును 58 నుంచి 60 ఏండ్లకు పెంచడంతో ఆర్టీసీ ఉద్యోగులు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు. డిపోల ఎదుట పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే ఆర్టీసీ లాభాల బాట పడుతుందనే నమ్మకం మరింత పెరిగిందని పలువురు కార్మికులు పేర్కొన్నారు. తమకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్నారని, ఇలాంటి సీఎం దేశంలో ఎక్కడా లేరని హర్షం వ్యక్తం చేశారు. డిపో వెల్ఫేర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కరీంనగర్-1, 2 డిపోల ఎదుట ఉద్యోగులు పటాకులు కాల్చారు. అనంతరం మిఠాయిలు తినిపించుకున్నారు. జనగామ డిపో వద్ద సంబురాలు అంబరాన్నంటాయి. డీఎం ధరంసింగ్‌తో కలిసి ఉద్యోగులు మిఠాయిలు తినిపించుకొని, పటాకులు కాల్చారు. మెదక్ డిపోలో ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటా నికి క్షీరాభిషేకం నిర్వహించారు.



పదవీవిరమణ వయస్సును పెంచడంపై హర్షం వ్యక్తంచేస్తూ బుధవారం రాత్రి సూర్యాపేట ఆర్టీసీ డిపోలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న సంస్థ ఉద్యోగులు

జనగామ డిపో ఎదుట పటాకులు కాలుస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, డీఎం ధరంసింగ్

మెదక్ డిపోలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

లోకం పోకడ

పార్టీ తెగిన గాలిపటం అవుతుందని భయమట!

మూడింతలు పెరిగిన సైబర్‌నేరాలు!

- ఓఎల్ఎక్స్ యాప్‌ల ద్వారానే మోసాలెక్కువ
- అప్రమత్తమవుతున్నా భారీగానే కేసుల నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సాధారణ నేరాలు తగ్గుముఖం పడుతుండగా సైబర్‌నేరాలు హైదరాబాద్‌లో పెరుగుతున్నాయి. గత ఏడాదికంటే ఈసారి మూడురెట్లు ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. గత ఏడాదికి భిన్నంగా ఈ ఏడాది కేసుల నమోదు ప్రక్రియను నిర్వహించడంతో సంఖ్య పెరిగింది. ఆర్థికనష్టాలకు సంబంధించి గతంలో రూ. 50 వేల కంటే ఎక్కువగా ఉన్న ఫిర్యాదులపై కేసులు నమోదుచేసేవారు. ఈ ఏడాది రూ. 10వేల కంటే ఎక్కువగా ఉన్నా కేసులు నమోదుచేయడంతో డిసెంబర్ 22నాటికి కేసుల సంఖ్య 1,350కి చేరగా, గత ఏడాది కేసుల సంఖ్య 428 మాత్రమే ఉన్నది.

అవగాహన వస్తున్నా.. తగ్గని మోసాలు

సైబర్ నేరాలలో.. ఆర్థిక పరమైన కేసులతో పాటు సోషల్‌మీడియాకు సంబంధించినవి కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఆర్థిక అంశాల్లో ఎక్కువగా ఓఎల్ఎక్స్ కేసులు నమోదవుతున్నాయి. ఆర్మీ ఉద్యోగులమంటూ అమాయకులకు ఫోన్‌చేస్తూ ముంచేస్తున్న ఘటనలు చాలా ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే మొబైల్ అప్లికేషన్లను ఉపయోగించి ఖాతాదారుల నుంచి డబ్బులు సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. ఓఎల్ఎక్స్, డిజిటల్ లావాదేవీలు నిర్వహించే మొబైల్ అప్లికేషన్లు, ఆయా యాప్‌లకు సంబంధించిన కాల్‌సెంటర్ల పేర్లతో సైబర్‌నేరగాళ్లు ఎక్కువగా మోసాలుచేశారు. ప్రజల్లో అవగాహన వస్తుండటంతో వేలల్లో నష్టపోయేసరికే తేరుకొని పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గత ఏడాది పరిస్థితి భిన్నంగా ఉండేది. సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలను నమ్ముతూ లక్షలు పోగొట్టుకున్న తర్వాత కానీ బాధితులు తేరుకునేవారు కాదు. పోలీసుల అవగాహన కార్యక్రమాలతో ప్రజలలో కొంత చైతన్యం వచ్చింది. సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలను మొదట్లో విన్ని డబ్బు ప్రస్తావన వచ్చేసరికి జాగ్రత్త పడుతున్నారు.

అత్యాశ.. నిర్లక్ష్యం.. అమాయకత్వం

సైబర్‌నేరాల్లో చాలామంది అత్యాశతోనే నేరగాళ్లు చెప్పే మాటలను నమ్ముతున్నారు. లాటరీ డబ్బులు వస్తున్నాయని, ఓఎల్ఎక్స్‌లో తక్కువ ధరకు.. అది కూడా ఆర్మీ వాళ్ల వస్తువు అని చెప్పగానే ఆలోచించకుండా డబ్బు కట్టేస్తున్నారు. మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమై, విదేశాలనుంచి విలువైన బహుమతులు అనగానే నమ్మేస్తున్నారు. డెబిట్ కార్డు బ్లాక్ అవుతుంది, మీరు కార్డు అప్‌డేట్ చేసుకోవాలంటూ నేరగాళ్లు అమాయకులకు వల వేస్తున్నారు. చాలామంది నేరగాళ్లు చెప్పినట్టు చేస్తూ మోసపోతున్నారు. మార్ఫింగ్ ఫొటోలు, అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టి వేధించే కేసులు నమోదవుతున్నాయి. విచారణలో ఆయా కేసుల్లో నిందితులు బాధితులకు తెలిసినవారే ఉంటున్నారు.

కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కోమోరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు సముద్రమట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ఏర్పడిన ఉపరితల ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నది. రాష్ట్రంలో తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, ఈశాన్య దిశల నుంచి చలిగాలులు వీస్తున్నాయి. రాగల మూడ్రోజుల వరకు తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో పెరిగిన ఉష్ణోగ్రతలు

గ్రేటర్ హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినప్పటికీ చలి వణికిస్తున్నది. గాలిలో తేమ పెరగడంతో చలి తీవ్రత అధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హైదరాబాద్ నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 28.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.4 డిగ్రీలు, గాలిలో తేమ 86.4 శాతంగా నమోదైందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు.

చలిలో వణుకుతూ హైదరాబాద్ ఎర్రమంజిల్‌లో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఓ వృద్ధుడు

సీబీఐ డేగకన్ను

- దేశవ్యాప్తంగా మూడేండ్లలో 2,113 కేసులు నమోదు
- ఏటేటా పెరుగుతున్న కన్విక్షన్ రేట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా నమోదుచేస్తున్న కేసులు, శిక్షలు ఖరారవుతున్న శాతాన్ని గమనిస్తే గత మూడేండ్లలో సీబీఐ దూకుడు పెంచినట్టు కనిపిస్తున్నది. సీబీఐ వర్గాల అధికారిక సమాచారం మేరకు దేశవ్యాప్తంగా 2016 నుంచి 2018 వరకు మొత్తం 2,113 కేసులను నమోదుచేసింది. కేసు దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు చేసే అంశాలను గమనిస్తే కొన్ని కేసుల్లో ఏండ్ల తరబడి సమయం తీసుకొంటున్నా.. శిక్షలు ఖరారవుతున్న కేసుల శాతాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు సీబీఐ హైదరాబాద్ యూనిట్‌ను తీసుకొంటే.. మాసబ్‌ట్యాంక్ ఆంధ్రాబ్యాంక్ బ్రాంచి మాజీ మేనేజర్ రామకృష్ణ పరమహంస రూ.1.45 కోట్ల మేర బ్యాంకులను మోసగించిన కేసు 2000లో నమోదైంది. దాదాపు 19 ఏండ్ల పాటు కొనసాగిన సుదీర్ఘ దర్యాప్తు అనంతరం కొన్నిరోజుల క్రితమే రామకృష్ణ పరమహంసతోపాటు మరో ఇద్దరికి మూడేండ్ల కఠిన కారాగార శిక్ష ఖరారైంది. కేసుల నమోదు, సమగ్ర దర్యాప్తునకు ఎక్కువ సమయం తీసుకొంటున్నా శిక్షల ఖరారు శాతం (కన్విక్షన్ రేట్)లో వృద్ధి సాధిస్తున్నది. 2016లో మొత్తం నమోదైన కేసుల్లో 66.8 శాతం కేసుల్లో దోషులకు శిక్షలు ఖరారయ్యాయి. 2017లో అది 66.9 శాతానికి చేరగా.. 2018 అక్టోబర్ 31 వరకు 69.92 శాతంగా నమోదయింది.

బాలుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

చికిత్స నిమిత్తం నిమ్స్‌లో చేరిన బాలుడు హర్షవర్ధన్

హర్షవర్ధన్‌కు మెరుగైన చికిత్స

- సీఎం కేసీఆర్ ఆదేశాలతో బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు
- చికిత్స కోసం అంబులెన్స్‌లో నిమ్స్‌కు తరలింపు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

జగదేవ్‌పూర్: కాలేయం సమస్యతో బాధపడుతున్న బాలుడు హర్షవర్ధన్‌కి ఖర్చుతో సంబంధం లేకుండా మెరుగైన చికిత్స అందించాలని సీఎం కేసీఆర్ సూచించినట్టు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన బాలుడు హర్షవర్ధన్ అనారోగ్య పరిస్థితిపై ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ' పత్రికలో వచ్చిన కథనానికి వెంటనే సీఎం స్పందించారని చెప్పారు. కేసీఆర్ ఆదేశాలతో బుధవారం మునిగడపకు వచ్చిన ప్రతాప్‌రెడ్డి.. హర్షవర్ధన్ కుటుంబసభ్యులను పరామర్శించి.. అతడ్ని మెరుగైన చికిత్స కోసం లక్ష్మారెడ్డి ట్రస్ట్‌కు చెందిన అంబులెన్స్‌లో నిమ్స్‌కు తరలించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. హర్షవర్ధన్ ఆరోగ్యపరిస్థితి పూర్తిగా మెరుగుపడేంత వరకు చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సూచించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలలక్ష్మి, ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు ఇంద్రసేనారెడ్డి, భూమయ్య, సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు ఐలయ్య, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు. నిమ్స్‌లో వైద్యులు సునీల్, శ్రీనివాస్.. హర్షవర్ధన్‌కు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండ రంగారెడ్డి తెలిపారు. బాలుడికి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగారెడ్డి ఆర్థిక సహాయం చేశారు.

పర్యావరణహిత పారిశ్రామీకరణ

- కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు
- జీరో లిక్విడ్ డిశ్చార్జి టెక్నాలజీ వినియోగానికి నిర్ణయం
- ఓఆర్ఆర్ ఆవల 13 ప్రాంతాలకు పరిశ్రమల తరలింపు
- పరిశ్రమలశాఖకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలను ఆకర్షించడమే కాకుండా పర్యావరణహితంగా పారిశ్రామికీకరణ ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిశ్రమలు పర్యావరణ కాలుష్యానికి కారణమనే భావన రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా ప్రయత్నం చేస్తున్నది. పారిశ్రామికీకరణ పర్యావరణహితంగా ఉండేందుకు రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (సీఈటీపీ), జీరో లిక్విడ్ డిశ్చార్జి (జెడ్ఎల్డీ) టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించారు. దాంతోపాటు కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్ ఆవలకు తరలించడానికి 13 ప్రాంతాలను గుర్తించారు. ఫలితంగా తమ ప్రాంతానికి పరిశ్రమలు వస్తున్నాయంటే ప్రజలు ఆందోళన చెందే పరిస్థితి లేకుండా ఉండటానికి పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు చర్యలు తీసుకొంటున్నారు. వీటి బాధ్యతలను టీఎస్ఐఐసీకి అప్పగించారు. పారిశ్రామికీకరణ కొత్త పుంతలు తొక్కాలనే నినాదంతో వీటన్నింటిని చేపడుతున్నారు. టీఎస్ఐపాస్ ద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. ఇప్పటికే 11వేలకు పైగా పరిశ్రమలు వచ్చాయి. వీటిద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంతోపాటు ప్రజల జీవన పమాణాలు పడిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో పరిశ్రమలశాఖ చర్యలు తీసుకొంటున్నది. చౌటుప్పల్‌లో ఇప్పటికే ఫార్మా పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో అక్కడ కాలుష్యం ప్రభావం ఉన్నదని ప్రజలు అనేక ఫిర్యాదులు చేయడంతో పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ సమస్యను అర్థం చేసుకొని.. అక్కడ సీఈటీపీని ఏర్పాటుచేయాలని టీఎస్ ఐఐసీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

జీడిమెట్ల పారిశ్రామికవాడలో నెలకొల్పిన కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

కాలుష్య నివారణకు పకడ్బందీ చర్యలు

నగరంతోపాటు నగరం అవతల ఉన్న అనేక ఫార్మా కంపెనీలు వ్యర్థాలను బోర్ల ద్వారా భూమిలోకి పంపిస్తున్నాయనే ఫిర్యాదులపైన కాలుష్య నియంత్రణ మండలి కఠినంగా స్పందించి భారీ జరిమానాలు విధించింది. కొన్ని కంపెనీలను కూడా మూసివేసింది. ఈ సమస్య భవిష్యత్‌లో ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించింది ఫార్మా సిటీలో జెడ్ఎల్డీ టెక్నాలజీ, సీఈటీపీలను ఏర్పాటు చేయనున్నది. మొదటి దశలో 24 ఎంఎల్‌డీ సామర్థ్యంతో పీపీపీ విధానంలో ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీనికోసం ఇప్పటికే గ్లోబల్ టెండర్లను పిలిచారు. ఎనిమిది అంతర్జాతీయ సంస్థలు సీఈటీపీని ఏర్పాటుచేయడానికి బిడ్లు దాఖలు చేశాయి. కేంద్ర వాణిజ్య, ఫార్మాస్యూటికల్, కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్, పర్యావరణ మంత్రిత్వశాఖలు నిధులు కేటాయించాలని మంత్రి కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ఈ విధానంలో ఫార్మాసిటీ నుంచి వచ్చే వ్యర్థాలను ఘనపదార్థాలుగా మార్చి పర్యావరణానికి హాని కలుగకుండా చేయవచ్చు. 20ఎంఎల్‌డీ సామర్థ్యంతో వరంగల్ టైక్స్‌టైల్ పార్క్‌లో, 400 కేఎల్‌డీ ప్లాంటును ఖమ్మం జిల్లా బూర్గంపాడులోని ఫుడ్‌పార్క్‌లో సీఈటీపీ ఏర్పాటుచేస్తున్నారు. కాలుష్య ప్రభావిత పరిశ్రమలున్న ప్రాంతాల్లో గాలి నాణ్యతను తెలుసుకొనేందుకు బయో ఫిల్టర్స్, బయో స్క్రబ్బర్స్ ఏర్పాటుచేయనున్నారు. నీరు, గాలి నాణ్యత పరీక్షలకు రియల్‌టైం మానిటరింగ్ వ్యవస్థను నెలకొల్పనున్నారు.

అవుటర్ ఆవలకు కాలుష్య పరిశ్రమలు

మూడు దశాబ్దాల క్రితం హైదరాబాద్ నగరం చుట్టుపక్కల పరిశ్రమలను స్థాపించగా.. హైదరాబాద్ క్రమంగా విస్తరించడంతో ఆ పరిశ్రమలు కాస్తా నగరం మధ్యలోకి చేరాయి. నగరంలోని పలు కాలుష్యకారక పరిశ్రమలు తమ కంపెనీ వ్యర్థాలను మురుగుకాలువల్లోకి వదలడంపై నిఘాపెట్టి నోటీసులు జారీచేయడమే కాకుండా భారీ ఎత్తున జరిమానాలు విధించారు. నగరంలో కాలుష్యం పెరిగిపోకుండా ఉండేందుకు నగరంలోని పరిశ్రమలను అవుటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) అవతలకు తరలించాలని నిర్ణయించారు. దీనికోసం ఇప్పటికే 13 ప్రాంతాలను గుర్తించారు. అక్కడ పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చురుకుగా సాగుతున్నాయి. పరిశ్రమలు కొత్తగా ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా ఉండేందుకు అవసరమైనచోట్ల వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంట్లను ఏర్పాటుచేయాలని, కాలుష్యం లేకుండా ఉండటానికి అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని పరిశ్రమలశాఖ, టీఎస్ఐఐసీ అధికారులను మంత్రి కేటీఆర్ ఇప్పటికే ఆదేశించారు. వృథాగా పోయే నీటిని సద్వినియోగం చేసుకొనేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను కూడా ఏర్పాటుచేస్తున్నారు. దండుమల్కాపురంలో ప్రారంభించిన ఎంఎస్ఎంఈ పార్క్‌లో కాలుష్య ప్రభావం లేని పరిశ్రమలను నెలకొల్పేలా చర్యలు తీసుకొంటున్నారు. పరిశ్రమలు ఏర్పాటుచేసే ప్రాంతంలో కచ్చితంగా 30 శాతం స్థలంలో మొక్కలు నాటేలా ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఆయా పరిశ్రమల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను టీఎస్ ఐఐసీకి అప్పగిస్తున్నారు.

'దిశ' కేసులో ఫైనల్ రిపోర్టు సిద్ధం!

- 100 మంది సాక్షులను ప్రవేశపెట్టిన పోలీసులు
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ముగిసిన ప్రాసిక్యూషన్ వాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంచలనం సృష్టించిన 'దిశ' లైంగికదాడి, హత్య కేసులో సైబరాబాద్ పోలీసులు ఫైనల్ రిపోర్ట్ సిద్ధం చేశారు. ఈ నివేదికను మరో మూడురోజుల్లో మహబూబ్‌నగర్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో దాఖలు చేయనున్నారు. ఈ కేసులోని నిందితులు డిసెంబర్ 6న జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందడంతో చార్జిషీట్ స్థానంలో పోలీసులు ఫైనల్ రిపోర్టు పేరుతో కోర్టు ముందు నివేదిక పెట్టనున్నారు. ఈ కేసులో పోలీసులు 30 మందికి పైగా సాక్షుల స్టేట్‌మెంట్లతోపాటు శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానంతో సేకరించిన ఆధారాలను కోర్టుకు అందజేయనున్నారు. ఫోరెన్సిక్, ఎఫ్ఎస్ఎల్ అధికారులు నివేదికలను ఈ ఫైనల్ రిపోర్టులో చేర్చనున్నారు. 'దిశ'కు సంబంధించిన సెల్‌ఫోన్, పవర్‌బ్యాంక్, వాచ్, నిందితుల ఫోన్‌తోపాటు ఇంకా క్రైం సీన్ రీకన్‌స్ట్రక్షన్ నివేదికను ఫైనల్ రిపోర్టులో పొందుపరిచారు. శంషాబాద్, షాద్‌నగర్ పోలీసులు నమోదుచేసిన రెండు ఎఫ్ఐఆర్‌లను కూడా జతపర్చారు. సీసీ కెమెరాల దృశ్యాలను కూడా కోర్టుకు అందించనున్నారు. అనంతరం 30 మంది సాక్షులు, నిందితుల తరపు బంధువులు, విచారణాధికారులు విచారణకు కోర్టుకు హాజరుకానున్నారు. ఇంకా కొన్ని నివేదికలు అందాల్సి ఉండటంతో ఫాస్ట్‌ట్రాక్ విచారణకు ఆలస్యమవుతున్నట్టు తెలుస్తున్నది.

హాజీపూర్ కేసులో త్వరలో తుది తీర్పు!

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ముగిసిన పోలీసు వాదనలు
- త్వరలో తుది తీర్పు వెల్లడయ్యే అవకాశం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన హాజీపూర్ బాలికల హత్య కేసులో ప్రాసిక్యూషన్ వాదనలు ముగిశాయి. బుధవారం జరిగిన విచారణలో పోలీసులు దాదాపు 100 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి వారి స్టేట్‌మెంట్ రికార్డ్ చేయించారు. తదుపరి విచారించేందుకు గురువారం నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని కోర్టుకు తీసుకురానున్నారు. నల్లగొండ అదనపు జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ కొనసాగుతున్నది. ఈ ఏడాది మే 25వ తేదీన తొమ్మిదో తరగతి విద్యార్థిని అదృశ్యం కేసు దర్యాప్తులో హాజీపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని అనుమానితుడిగా గుర్తించారు. అమ్మాయిని బైక్‌పై ఎక్కించుకొని వెళ్లాడని పలువురు గ్రామస్థులు చెప్పడంతో పోలీసులు తీవ్రంగా గాలించి శ్రీనివాస్‌రెడ్డిని అదుపులోకి తీసుకొన్నారు. ఆ అమ్మాయిపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసినట్టు పోలీసుల విచారణలో నిందితుడు చెప్పినట్టు తెలిసింది. ఆ విద్యార్థినిని చంపి బావిలో పడేసినట్టు క్రైం సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని తీసేందుకు బావిలోకి దిగారు. యాదృచ్ఛికంగా హాజీపూర్‌కు చెందిన మరో డిగ్రీ విద్యార్థిని మృతదేహం బయటపడింది. ఈ యువతిని కూడా శ్రీనివాస్‌రెడ్డే హత్యగావించాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. రెండేండ్ల క్రితం అదృశ్యమైన గ్రామానికి చెందిన మరో విద్యార్థినిని కూడా శ్రీనివాస్‌రెడ్డి చంపాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డిని మూడు కేసుల్లో నిందితుడిగా అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. అతడి అరాచకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. మహిళా సంఘాలు, హాజీపూర్ గ్రామస్థులు నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్ స్వయంగా కోర్టు విచారణను పరిశీలించారు. తొలుత ప్రాసిక్యూషన్ వాదనలు ముగియగా.. గురువారం సెక్షన్ 313 సీఆర్పీసీ కింద నిందితుడి తరపు వాదనల కోసం శ్రీనివాస్‌రెడ్డిని నల్లగొండ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. ఇరువైపుల వాదనలు ముగియగానే వీలైనంత త్వరగా తుది తీర్పు వెలువరించే అవకాశం ఉన్నది. మూడు కేసులకు సంబంధించి పోలీసులు మొత్తం 100కుపైగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు కూడా శాస్త్రీయ, సాంకేతికపరమైన ఆధారాలను పకడ్బందీగా ప్రవేశపెట్టారు.

నిందితుడు శ్రీనివాస్‌రెడ్డి

జనవరి 6 నుంచి జేఈఈ మెయిన్

- అదేనెల 31న ఫలితాలు
- ఏర్పాట్లుచేస్తున్న ఎన్టీయే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, పలు కేంద్ర విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం జనవరి ఆరు నుంచి 11వ తేదీ వరకు జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2020 పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలను అదేనెల 31న విడుదల చేయనున్నట్టు జేఈఈ మెయిన్ షెడ్యూల్‌లో ప్రకటించారు. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అడ్మిట్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల మందికిపైగా, తెలంగాణ నుంచి సుమారు 80 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలుస్తున్నది. పరీక్షలు పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. రాష్ట్రంలో హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు.

విద్యా పథకాలకు కేంద్ర నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా అమలవుతున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), టీచర్ ఎడ్యుకేషన్ వంటి పలురకాల విద్యా పథకాలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ నిధులు ఈ ఏడాదిలో తొలుత తెలంగాణ రాష్ట్రానికే వచ్చాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ తెలిపారు. తొలివిడుత కింద రాష్ట్రానికి రూ.382 కోట్లు వచ్చినట్టు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ.. కేంద్రానికి కావాల్సిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ) సమర్పించడంతో ఈ మేరకు నిధులు విడుదల య్యాయని పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర వాటా కింద రూ.301.74 కోట్లు విడుదల కావాల్సి ఉన్నదని తెలిపారు.

బాచుపల్లి పీఎస్‌లో యువతి హంగామా

- బాయ్‌ఫ్రెండ్‌తో పెండ్లి చేయాలంటూ రచ్చ

దుండిగల్: ప్రేమించిన వ్యక్తితో తన పెండ్లి జరిపించాలంటూ ఓ యువతి హంగామా సృష్టించింది. యువకుడి కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించగా అక్కడ కూడా రచ్చ చేసింది. న్యాయం చేస్తామంటూ నచ్చజెప్పి సదరు యువతిని పోలీసులు ఇంటికి పంపించారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన రమేశ్, శకుంతల దంపతులు మణికొండలోని చిత్రపురి హిల్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరి కూతురు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నది. విజయవాడకు చెందిన చెరుకూరి విశ్వనాథరాజు, ఉదయకుమారి కుమారుడు చందూతో ఏడాదిన్నర క్రితం పరిచయం కాస్త ప్రేమగా మారింది. వివాహితుడైన చందూ ఏడాదిగా ఆ యువతితో కాపురం పెట్టాడు. గత ఆరునెలలుగా చందూ తన వద్దకు రావడంలేదంటూ ఆ యువతి బుధవారం సాయంత్రం బాచుపల్లిలోని చందూ కుటుంబం ఉంటున్న ఇంటికి చేరింది. ఆ సమయానికి చందూ ఇంట్లో లేకపోవడంతో అక్కడ హంగామా సృష్టించింది. చందూ తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చందూతో తనకు వివాహం జరిపించాలంటూ పీఎస్‌లో ఉన్న పూలకుండీలు పగులగొడ్తూ తలను గోడకేసి కొట్టుకోవడం.. పెద్దగా అరుస్తూ చనిపోతానంటూ బెదిరింపులకు దిగిడం వంటి చేష్టలతో నానా హంగామా చేసింది. చివరికి న్యాయం చేస్తామని పోలీసులు నచ్చజెప్పడంతో శాంతించింది.

విద్యాసంస్థల్లో ఓటరు దినోత్సవం

- వర్సిటీలకు ఉన్నత విద్యామండలి ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో వచ్చే నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపాలని, ఓటుపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ అన్ని యూనివర్సిటీలకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలు, ఓటింగ్ ప్రాముఖ్యం, విద్యార్థుల పాత్ర గురించి యాజమాన్యాలు విద్యార్థులకు తెలియచేసేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ విషయాన్ని అన్ని అనుబంధ కళాశాలలకు తెలియజేస్తూ వర్సిటీలు లేఖలు రాశాయి.

9 జిల్లాల్లో దవాఖానల అప్‌గ్రేడ్

- ప్రక్రియను ప్రారంభించిన వైద్యశాఖ
- రూ.576 కోట్ల ఖర్చుతో ప్రతిపాదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో దవాఖానలను అప్‌గ్రేడ్‌చేసి వైద్య సేవలను విస్తృతంచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలివిడుతగా తొమ్మిది జిల్లాల పరిధిలోని ఏరియా దవాఖాన, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లను జిల్లాస్థాయి దవాఖానలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అనువైన పరిస్థితులు, వసతుల కల్పనపై రాష్ట్ర వైద్య విధాన పరిషత్ దృష్టి సారించింది. జిల్లాలవారీగా ప్రభుత్వ దవాఖానాల్లో అధునాతన సౌకర్యాలు కల్పించడంతోపాటు వైద్యసేవలను విస్తరించనున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలల వరకు రోగ నిర్ధారణకు అవసరమైన పరికరాలతోపాటు ఎంఆర్ఐ, సీటీస్కాన్, డిజిటల్ రేడియాలజీ, 2డీ ఎకో, అల్ట్రాసౌండ్, ఆటోఅనలైజర్ వంటి అత్యాధునిక పరికరాలను వివిధ దవాఖానాల్లో ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు. వీటితోపాటు కొత్తగా ఏర్పడిన జిల్లాల పరిధిలోని ఏరియా దవాఖానలను జిల్లాస్థాయి దవాఖానలుగా అప్‌గ్రేడ్‌చేసి ప్రజలకు వైద్యసేవలు అందించడానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే జోగుళాంబ గద్వాల, మహబూబాబాద్, నారాయణపేట, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నర్సంపేట (వరంగల్ రూరల్), జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల, ములుగులోని ఏరియా దవాఖానలను జిల్లాస్థాయి దవాఖానలుగా అప్‌గ్రేడ్‌చేసే ప్రక్రియను ప్రారంభించారు. వీటికోసం రూ.576.78 కోట్ల నిధులకు ప్రతిపాదించగా.. ప్రభుత్వం రూ.214.12 కోట్లను ఇప్పటికే అనుమతించింది. శరీరం కాలి చికిత్సకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వనపర్తి, నాగర్‌కర్నూల్, గజ్వేల్ దవాఖానల్లో ప్రత్యేకంగా బర్న్ వార్డులను ఏర్పాటు చేసేందుకు రూ.1.50 కోట్లు కేటాయించారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖాన

వివరాలు సేకరించిన టీవీవీపీ

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 9 జిల్లాల పరిధిలో ఏరియా దవాఖానలు/సీహెచ్‌సీలను జిల్లాస్థాయి దవాఖానలుగాఅప్‌గ్రేడ్ చేసేందుకు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అప్‌గ్రేడ్ చేయాల్సిన దవాఖానల్లో ప్రధానంగా ఎంసీహెచ్ సేవలు, ఇతర స్పెషాలిటీ సేవలు.. జనరల్ మెడిసిన్, డెంటల్, కాటరాక్ట్ సర్జరీలు, జనరల్ సర్జరీ, అనస్థీషియా, ఈఎన్టీ, ఆప్తాల్మాలజీ, రేడియాలజీ, పాథాలజీ విభాగాలను అందుబాటులోకి తెచ్చేందుకు అంచనాలు రూపొందించారు. అప్‌గ్రేడ్ చేయాల్సిన దవాఖానల్లో ప్రస్తుత బెడ్ల సామర్థ్యం, ఆరునెలల్లో ఇన్ పేషెంట్ల సంఖ్య, రెండేండ్లలో ఓపీ, ఐపీ వివరాలు సేకరించారు. అంతేకాకుండా నిర్ణయించిన దవాఖాన ద్వారా సమీప ప్రాంతంలో ఎంతమందికి వైద్యసేవలు అందించగలమన్న దానిపై అంచనాలు రూపొందించారు. నిబంధనల మేరకు జిల్లాస్థాయి దవాఖానకు అనువైన స్థలం, భవన సముదాయం వంటివి ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి. కొత్తగా నిర్మాణం చేయాల్సిన భవనాలకు అంచనాలను సిద్ధంచేశారు.

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన హింసపై ప్రతిఒక్కరూ ఆలోచించాలి. భవిష్యత్తు తరాలకు చెందిన వాటిని ధ్వంసం చేయటం సమంజసం అనిపించుకోదు. వారుచేసిన దాని మంచి, చెడు గురించి ప్రశ్నించుకోవాలి. ఎన్ఆర్సీ, సీఏఏను నిరసించే పేరుతో బస్సులను, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు.

నరేంద్ర మోదీ, ప్రధాని

భౌతిక వస్తువులు తాత్కాలికమైనవి. మానసిక ప్రశాంతతోనే మనిషి సంతోషంగా ఉంటాడు. మేమంతా ఆ మానసిక బలంతోనే ఉన్నాం. టిబెటన్లు సత్యమనే బలాన్ని కలిగి ఉన్నారు. చైనా కమ్యూనిస్టులు ఆయుధ బలంతో ఉన్నారు. కాలక్రమంలో సత్య బలం, ఆయుధ బలం కన్నా బలమైనదని రుజువవుతుంది.

దలైలామా, బౌద్ధమత ఆధ్యాత్మిక నేత



చరిత్రలో నేడు

1872

న్యూయార్క్ చరిత్రలో 4వ అతిపెద్ద 18 సెంటీమీటర్ల మంచువర్షం.

1973

తిరిగి భూమి మీదికి చేరుకున్న సూయజ్-13.

1978

జైలు నుంచి విడుదలైన మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ.

తైవాన్‌లోని అమెరికా తైవాన్ అధ్యయన సంస్థ డైరెక్టర్‌కు అంబాసడర్ ఎట్ లార్జ్ పేర రాయబార హోదా కల్పించాలంటూ అమెరికా ప్రతినిధుల సభలో ఇద్దరు సభ్యులు ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. చైనా, అమెరికా సంబంధాలలో సంక్షోభాన్ని సృష్టించాలని అమెరికా చట్టసభల్లోని కొందరు ప్రయత్నిస్తున్నారు. కానీ తైవాన్‌పై వివాదానికి అమెరికా సిద్ధంగా లేదు. తైవాన్‌లోని ప్రభుత్వం కూడా ఇందుకు సముఖంగా లేదు. వివాదాలు సృష్టించే ఇటువంటి కొందరు రాజకీయ నాయకులను నియంత్రించే శక్తి అమెరికా పాలకవ్యవస్థకు ఉన్నదనే ఆశాభావం కలుగుతున్నది.

గ్లోబల్ టైమ్స్

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గా ఆండ్రూ బైలీని నియమించడం ముందు జాగ్రత్త చర్యగా చెప్పవచ్చు. బ్రస్సెల్స్‌తో బ్రెగ్జిట్‌పై చర్చలు సాగుతున్న నేపథ్యంలో ఇంగ్లండ్ ఆర్థికవ్యవస్థను కాపాడటానికి బైలీ దృఢంగా నిలబడుతారనే అభిప్రాయం ఉన్నది. యూరప్‌లోకెల్లా అతిపెద్ద ఆర్థిక కేంద్రమైన బ్రిటన్ బ్రెగ్జిట్ తర్వాతకాలంలో యురోపియన్ యూనియన్ నిబంధనలను యథావిధిగా అమలుపరిచే పరిస్థితి ఉండకూడదని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. ఈయూ నుంచి బయటికిరావడం ఎంత కష్టదాయకంగా ఉంటే, ఆర్థికవ్యవస్థకు ఉద్దీపన అంతగా అవసరమవుతుంది.

ది గార్డియన్

ఇక ఎన్పీఆర్

జాతీయ పౌర పట్టిక, పౌరసత్వ సవరణ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతుండగానే కేంద్ర ప్రభుత్వం జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)కు తెరలేపింది. దీనికి గాను అవసరమైన నిధులను కూడా విడుదల చేసింది. జాతీయ జనాభా పట్టిక రూపకల్పనను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించి సెప్టెంబర్‌లో ముగిస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఎన్ఆర్సీ, సీఏఏలపై ప్రతిపక్షాలతో పాటు, దేశవ్యాప్తంగా ప్రజా సమూహాల నుంచి వస్తున్న తీవ్ర నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో ఎన్పీఆర్‌కు, ఎన్ఆర్సీకి ఎలాంటి సంబంధం లేదని కేంద్రమంత్రులు చెబుతున్నారు. దేశ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందించేందుకే జాతీయ జనాభా పట్టిక అంటున్నా, ఇప్పటికే ఎదురైన అనుభవాల రీత్యా అనేక భయాలు వెన్నాడుతున్నాయి. జాతీయ పౌర పట్టిక సందర్భంగా ఏర్పడిన గందరగోళం, ఒక్క అస్సాం రాష్ట్రంలోనే లక్షలాది మంది పౌరపట్టికలో చోటులేకుండా పోవటం వంటి పరిణామాల నేపథ్యంలో కొత్తగా జాతీయ జనాభా పట్టిక మరెంత ఉత్పాతాన్ని తెస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవ్వటం సహజం. దీనికి గతంలో ప్రభుత్వపెద్దలే పదేపదే చెప్పిన మాటలే కారణం. 2024 ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా ఎన్ఆర్సీ చేపట్టి తీరుతామని, విదేశీయులను గుర్తించి దేశ సరిహద్దులు దాటిస్తామని చెప్పిన మాటలు ప్రజలెవరూ మర్చిపోలేకపోతున్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో, ఉన్న పరిస్థితిని చక్కదిద్ది, ప్రజల అనుమానాలను, భయాలను తీర్చకుండానే మరో పరీక్ష అన్నట్లుగా కేంద్రం వ్యవహరించటం సముచితం కాదు.

జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) రూపకల్పనలో దేశంలోని సాధారణ నివాసుల వివరాలు సేకరిస్తారు. ఈ నివాసులు భారతీయ పౌరులై ఉండాల్సిన అవసరం లేదు. ఒక ప్రాంతంలో ఆర్నెల్లుగా నివసిస్తున్నవారు, లేదా వచ్చే ఆరు నెలలు, అంతకన్నా ఎక్కువకాలం అక్కడ ఉండదల్చుకున్న ప్రతి ఒక్కరూ ఈ నిర్వచనం పరిధిలోకి వస్తారు. ఇలా దేశంలో నివసిస్తున్నవారెవరైనా ఎన్పీఆర్‌లో నమోదుకు అర్హులు. ఎన్పీఆర్ కోసం పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, వారి తల్లిదండ్రుల జన్మస్థానం వివరాలు తెలియజేయాలి. అది తప్పనిసరి అని నిబంధనలు చెబుతున్నాయి. ఇవన్నీ గతంలో ఉన్న వాటికన్నా కొత్తగా పెట్టిన నిబంధనలు. అంతక్రితం వ్యక్తి పేరు, జెండర్, తల్లిదండ్రుల పేర్లు, కుటుంబ యజమానితో ఉండే సంబంధం, పుట్టిన తేదీ, జాతీయత, చేస్తున్న వృత్తి, చిరునామా వివరాలు మాత్రమే అడిగేవారు. అయితే ఇప్పుడు 14 అంశాలతో కూడిన ఫారాన్ని పూర్తి చేయాలి. ఒకరకంగా ఆధార్‌కార్డుకు అవసరమైన వివరాలతో పాటు మరికొన్ని విస్తృతపర్చి మరోసారి జాతీయ జనాభా పట్టిక కోసం సమర్పించాలి. ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం సంక్షేమ పథకాల లబ్ధి కోసం ఇన్నిసార్లు, పలువిధాలుగా వ్యక్తుల వ్యక్తిగత సమాచార సేకరణ ఎందుకోసం అన్నదే అందిరినీ తొలుస్తున్న ప్రశ్న. దీనికి ప్రభుత్వం దగ్గర సంతృప్తికరమైన సమాధానం లేదు. కాకుంటే, గతంలో యూపీఏ ప్రభుత్వం 2010లో అమలులోకి తెచ్చిన జాతీ య జనాభా పట్టికనే, ఇప్పుడు నవీకరిస్తున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతుండటం గమనార్హం.

చరిత్రలో వివిధ అవసరాల కోసం ప్రజల సంపూర్ణ వివరాలను సేకరించటం ఎప్పటినుంచో ఉన్నది. రాజుల కాలంలో, బ్రిటిష్ వలస పాలన కాలంలో ప్రజలనుంచి పన్నుల వసూలు కోసం నికరమైన లెక్క కోసమే జనాభా గణన చేసినట్లు చరిత్ర చెబుతున్నది. ఆ క్రమంలో మొదటిసారి బ్రిటిష్ హయాంలో 1872లో జనగణన నిర్వహించారు. ఆ లెక్క ప్రకారం ఇప్పుడు చేపడుతున్న జనగణన 16వది అవుతుంది.

చరిత్రలో వివిధ అవసరాల కోసం ప్రజల సంపూర్ణ వివరాలను సేకరించటం ఎప్పటినుంచో ఉన్నది. రాజుల కాలంలో, బ్రిటిష్ వలస పాలన కాలంలో ప్రజలనుంచి పన్నుల వసూలు కోసం నికరమైన లెక్క కోసమే జనాభా గణన చేసినట్లు చరిత్ర చెబుతున్నది. ఆ క్రమంలో మొదటిసారి బ్రిటిష్ హయాంలో 1872లో జనగణన నిర్వహించారు. ఆ లెక్క ప్రకారం ఇప్పుడు చేపడుతున్న జనగణన 16వది అవుతుంది. నివాసుల పూర్తి వివరాలు ఆధారాలతో సహా సేకరించే అవసరం 1999 కార్గిల్ యుద్ధ సమయంలో ఏర్పడింది. కార్గిల్ ప్రాంతంలోకి పాక్ సైనికులు చొరబడి సాధారణ దుస్తుల్లో ఉంటూ దేశంలో విచ్ఛిన్నకర కార్యక్రమాలకు పాల్పడిన దాఖలాలు కనిపించాయి. భారత సైనికులు పాక్ చొరబాటుదారులను ఏరివేస్తూ కార్గిల్ పోరులో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో కార్గిల్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రతిపౌరుని సంపూర్ణ సమాచారంతో జనాభా పట్టిక అవసరమైంది. ప్రతిపౌరునికి గుర్తింపుకార్డు ఇవ్వాలన్న ఆలోచన వచ్చింది. అప్పటి వాజపేయి ప్రభుత్వం నియమించిన కార్గిల్ సమీక్ష కమిటీ కూడా ఈ సూచన చేసింది. అయితే విదేశీ సరిహద్దు రాష్ట్రాల్లో జనాభా పట్టిక చేపట్టాలన్న ఆలోచన దేశానికంతటికీ విస్తరించాలన్న నిర్ణయానికి దారితీసింది. అందుకోసం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించి బహుళ ప్రయోజన గుర్తింపు కార్డు (ఎంఎన్ఐసీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) ప్రాజెక్టులను చేపట్టారు. ఆ తర్వాతకాలంలో ఇది నత్తనడకన నడిచి, యూపీఏ హయాంలో నందన్ నిలేకని చీఫ్‌గా భారత ప్రత్యేక గుర్తింపు వ్యవస్థ (యూఐడీఏఐ) ఏర్పడి ఆధార్‌కార్డుల జారీ ప్రారంభమైంది. ఇలా కాలానుగుణంగా అనేక సందర్భాల్లో ముందుకువచ్చిన జనాభా పట్టిక రూపకల్పన, కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయందాకా వచ్చింది. అయితే జనాభా పట్టికకు 'వివిధ అవసరాలు' అన్న మాటలోని ఆంతర్యంపైనే ప్రస్తుత పరిస్థితుల్లో అనేక అనుమానాలు, భయాలు ఏర్పడ్డాయి. అది మెజారిటీవాద హిందుత్వ ఎజెండా కారాదని దేశ ప్రజలందరి ఆకాంక్ష. దేశంలో హిందు-ముస్లిం ఐక్యతను పెంపొందించకుండా స్వరాజ్యం లేదన్నాడు మహాత్మాగాంధీ. ఆయన ఆశలు వమ్ము చేసే దిశగా పడుతున్న అడుగులు ఇప్పటి విపత్కర పరిస్థితులకు హేతువులన్నది మరువరాదు.

జనగళం

మాతృభాషకు పట్టాభిషేకం

ప్రాథమిక విద్యాబోధన ఆంగ్ల మాధ్యమంలో జరుగాలన్నదానిపై పెద్ద రాద్ధాంతమే జరుగుతున్నది. ఫలానా మీడియాలోనే చదువాలన్న నిర్బంధం మంచిది కాదు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు విడివిడిగా పెట్టి, ఎవరికి నచ్చిన భాషలో వారిని చదివే వెసులుబాటు విద్యార్థులకు కల్పించాలి. అయితే ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలనేది మేధావుల మాట. మాతృభాష బోధన వల్ల పిల్లల మానసిక వికాసం పెరుగుతుందని, మేధోశక్తి వృద్ధి చెందుతుందని యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలు చెబుతున్నాయి. అంతేకాదు, అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్న దేశాలన్నింటిలో మాతృభాషలో విద్యాబోధన జరుగుతుండటం ఆలోచించవలసిన విషయం. ఇంగ్లీష్ నేర్చుకోవడం అంటే అమ్మ భాషను నిర్లక్ష్యం చేయడం కాదు. ఆంగ్లభాష అవసరం అన్నంతమాత్రాన మాతృభాషను విస్మరించడం కాదు. మాతృభాష జీవనాన్ని నేర్పిస్తే, ఆంగ్లభాష బతుకడానికి దారి చూపిస్తుంది అంతే! మాతృభాషను విస్మరించడం అంటే మన సంస్కృతీ సంప్రదాయాలను కూడా విస్మరించడమే అవుతుంది. మాతృభాషకు దూరమైతే మన మూలాలను మర్చిపోయినవాళ్లమవుతాం. మాతృభాషను వదిలేయడం అంటే, వేల సంవత్సరాల విజ్ఞానాన్ని వదిలేసినట్లే అవుతుంది.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

పట్టణాల్లో హడావుడి

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికల తేదీలను ఖరారు చేయటంతో రాజకీయాలు జోరందుకున్నాయి. పోటీ చేయదల్చిన అభ్యర్థులు తమ తమ వార్డులు, కార్పొరేటర్ల రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాకున్నా ప్రచారం మొదలుపెట్టారు. ఇంటింటికీ తిరిగి తమను గెలిపిస్తే చేయబోయే పనుల గురించి హామీలు కురిపిస్తున్నారు. రహస్య సమావేశాలు, కుల, మత సమీకరణలతో లెక్కలు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను ప్రలోభపెట్టకుండా, అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. అసాంఘికశక్తులను కట్టడిచేయాలి. అప్పుడే నిష్పాక్షికంగా ఎన్నికలు జరుగుతాయి. ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి.

- బోనగిరి శ్రీనివాస్ నేత, భువనగిరి

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10. బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన

టంకశాల అశోక్

'దిశ' చట్ట సవరణ అవసరమేమో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల చేసిన 'దిశ' చట్టం పట్ల ఒకవైపు హర్షం వ్యక్తమవుతూనే మరొకవైపు దాని అమలులోని సాధ్యాసాధ్యాల పట్ల సందేహాలు వినవస్తున్నాయి. చట్టంలోని సదుద్దేశాల విషయమైగాని, కేసు విచారణలకు సత్వర గడువు విధించటంపై గాని విమర్శలు ఏమీ లేవు. కానీ ఆ గడువు కేవలం 21 రోజులు కావటాన్ని నిపుణులు, మేధావివర్గాలు, చివరకు మహిళలు కూడా ఆచరణ సాధ్యం కానిదని, పైగా అందువల్ల న్యాయం అనే భావనకు హాని కలుగవచ్చునని అభిప్రాయపడుతున్నారు. ఈ దృష్ట్యా ఆ చట్టానికి సవరణలు చేయవలసిరావచ్చు.

చర్చలోకి వెళ్లేముందు అసలు చట్టంలో ఏమున్నదో చూద్దాం. భారతీయ నేరస్మృతి (1973)లోని సెక్షన్ 173కు 'దిశ' చట్టం చేసిన సవరణ ప్రకారం, తీవ్రమైన స్వభావం గల (characteristic of being heinous in nature) తొమ్మిది సెక్షన్ల కిందకు వచ్చే లైంగికదాడులు మహిళలపై, పిల్లలపై జరిగినట్లు పోలీసుల కు సమాచారం అందినమీదట, అందుకు నిర్ధారించదగిన ఆధారాలు తగినంత (adequate conclusive evidence) ఉన్నపక్షంలో, అప్పటినుంచి ఏడు పనిదినాలలో దర్యాప్తు పూర్తికావాలి. సెక్షన్ 173(1బీ) ప్రకారం అభియోగపత్రం దాఖలుచేసిన తర్వాత, అప్పటినుంచి 14 పనిదినాలలో కోర్టు విచారణ ముగియాలి. భారతీయ నేరస్మృతిలో పేర్కొన్న తీవ్రమైన స్వభావం గల తొమ్మిదిరకాల నేరాలు జరిగినప్పుడు, అందుకు నిర్ధారించదగిన ఆధారాలు తగినన్ని ఉన్నపుడు, ఆ నేరం జరిగిన పరిస్థితులను బట్టి ఇతరులకు ఉదాహరణ కాగల శిక్ష అవసరమైనప్పుడు (circumstances warrant exemplary punishment), అప్పుడు ఆ నేరస్థునికి మరణశిక్ష విధించటం జరుగుతుంది. శిక్ష విధించిన తర్వాత దాని అమలు ఎన్ని రోజుల్లో జరుగాలన్న నిబంధన ఏదీ 'దిశ' చట్టంలో లేకపోయినా, మొత్తం పోలీసు దర్యాప్తు, కోర్టు విచారణ కలిపి 21 పనిదినాల్లో పూర్తికావాలన్నది ఇందులోని నిబంధనలు.

ఇక్కడ ఒకటి చెప్పుకోవాలి. 'దిశ' చట్టాన్ని చేసినపుడు, నేరస్థులకు విచారణ జరిగి మరణశిక్ష 21 రోజుల్లో అమలైపోతుందనే ప్రచారం సాధారణ ప్రజల్లో జరిగింది. ఇది ఈ చట్టాన్ని చదవకపోవటం వల్ల, ఇతరత్రా కూడా చట్టాలు ఏ విధంగా పనిచేస్తాయో తెలియకపోవటం వల్ల కలిగిన అపోహ. కింది కోర్టులు గాని, ప్రత్యేక కోర్టులు గాని విధించే శిక్షలపై ఉన్నత న్యాయస్థానాలకు అప్పీల్ చేసుకునే హక్కు నిందితులకు ఎప్పుడూ ఉంటుంది. అనగా కింది కోర్టులు విధించే శిక్షల నిర్ధారణ, అమలు లేదా రద్దులు, మార్పులు ఉన్నత న్యాయస్థానాలు చేసేపని. అందువల్లనే 'దిశ' చట్టం 21 రోజుల్లో దర్యాప్తు, కోర్టు విచారణల గురించి చెప్పింది గాని శిక్షల అమలు గురించి కాదు. అది సాధ్యం కూడా కాదు. కనుక 'దిశ' చట్టం అప్పీళ్ల గురించి ప్రస్తావించింది. ఏడు సెక్షన్ల కింద శిక్షలపై అప్పీళ్ల పరిష్కారానికి మూడు నెలల గడువు, రెండు సెక్షన్ల కింద శిక్షలపై అప్పీళ్ల పరిష్కారానికి ఆరు నెలల గడువును ఇచ్చింది. తీవ్రమైన నేరాలు (heinous crimes)గా పరిగణించే మొత్తం తొమ్మిది సెక్షన్ల నంబర్లు, ఏ నేరాలు ఏ సెక్షన్ కిందకు వస్తాయనే వివరాలు చట్టంలో ఉన్నాయి గాని, అదంతా ఇక్కడ వివరించటం వీలయ్యేది కాదు.

ఇతర అంశాల్లోకి వెళ్లేముందు, 'దిశ' చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై వ్యక్తమైన అభిప్రాయాలను చూద్దాం. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖాశర్మ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చొరవను ఆహ్వానిస్తూనే, చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై సందేహం ప్రకటించారు. ముఖ్యంగా పోలీసు దర్యాప్తు, కోర్టు విచారణకు కలిపి 21 రోజుల గడువు అన్నది చాలా తక్కువ అన్నది ఆమె అభిప్రాయం. మరికొందరు ప్రముఖుల వ్యాఖ్యలు కూడా ఇదేవిధంగా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో ఒక లైంగికదాడి, హత్య కేసులో దిగువ కోర్టు కేవలం 12 రోజుల్లో విచారణ పూర్తిచేసి మరణశిక్ష విధించింది. దానిపై వచ్చిన అప్పీలును సుప్రీంకోర్టు గత వారం విచారించి ఆ శిక్షను రద్దుచేస్తూ, విచారణ సత్వరం పూర్తికావాలనే ఆతృతలో న్యాయప్రక్రియకు భంగం వాటిల్లరాదని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్ కేసులో గమనించదగినదేమంటే, నిందితునికి సహాయంగా స్వయంగా అక్కడి కోర్టు నియమించిన న్యాయవాదికి డిఫెన్స్ వాదనలు సిద్ధం చేసుకునే సమయమైనా ఇవ్వలేదు. ఇటువంటిది అరుదుగానే జరుగవచ్చుగాక. అయినప్పటికీ 'దిశ' చట్టం తరహాలో మితిమీరిన సత్వర దర్యాప్తు, సత్వర విచారణలు రోజుల సంఖ్యతో సహా గడువులుగా మారినప్పుడు, అదికూడా రేఖాశర్మ ఎత్తిచూపినట్లు అతి తక్కువ గడువు అయినప్పుడు, ఉద్దేశం ఎంత మంచిదైనా పొరపాట్లు దొర్లే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా పోలీసులు జాగ్రత్తతో కూడిన చట్టబద్ధ దర్యాప్తు కన్నా తమ పనిని గడువులోగా ముగించాలనే ఒత్తిడి కింద పనిచేసినప్పుడు. అటువంటి ఒత్తిడులు పేదవర్గాల విషయంలో ఎక్కువ పనిచేస్తాయని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ ఒత్తిడులు పోలీసులపై బయటినుంచి రావచ్చు, లేదా వారు తమకుతాము సృష్టించుకోవచ్చు కూడా. లేదా ప్రలోభపడవచ్చు. ఇతరత్రా మంచి నిబంధనలు ఈ చట్టంలో తగినన్ని ఉన్నాయి.

మొత్తం మీద ఇటీవలి పరిణామాలు ప్రభుత్వాల మీద, న్యాయస్థానాల మీద ఒత్తిడిని సృష్టించటం సంతోషించదగ్గవిషయమే. ఇప్పటికే గల చట్టాలను సక్రమంగా అమలుచేయటం, పోలీసులు కేసులను నమోదు చేసి సరిగా దర్యాప్తు చేయటంలో నిష్పక్షపాతంగా వ్యవహరించటం, నిజాయితీగా ఉండటం, కోర్టులు సత్వర విచారణలు జరుపటం వంటివి జరిగితే ఈ పరిణామాలకు, ప్రజల చైతన్యాలకు, సమాజపు ఒత్తిళ్లకు సార్థకత ఉంటుంది. అదే సమయంలో, ఈ ఒత్తిళ్లను బట్టి సత్వర విచారణల కోసం చట్టాలను మార్చి ఇతర చర్యలు కూడా తీసుకోవటం ఎంత అవసరమో, ఆ క్రమంలో తొందరపాట్లు, తొట్రుపాట్లు లేకుండటం కూడా అంత అవసరం. వాస్తవానికి నిర్భయ చట్టం (2013), నేరస్మృతి సవరణ చట్టం (2018) ప్రకారం దర్యాప్తుకు రెండు నెలలు, కోర్టు విచారణకు మరొక రెండు నెలల గడువులు ఇప్పటికే ఉన్నాయి. ఆ మొత్తం గడువును 'దిశ' చట్టం 21 రోజులకు తగ్గిస్తున్నది. నిర్భయ చట్టంలో అటువంటి గడువులు ఉండికూడా ఆ కేసు నిందితులకు శిక్షలు ఏడేండ్లు గడిచినా అమలుకాలేదు. 'దిశ' చట్టపు గడువును ఈ వెలుగులో కూడా చూడవలసి ఉంటుంది.

యథాతథంగానే దిశ చట్టంలో దర్యాప్తు, శిక్షలకు సంబంధించి మూడు షరతుల వంటివి ఉన్నాయి. ఒకటి, సదరు నేరం తొమ్మిది రకాల సెక్షన్ల పరిధిలోకి (వాటిలో ఏ ఒక్కటైనా సరే) వచ్చేది అయి ఉండాలి. రెండు, నేరానికి తగినన్ని తుదిరూపపు ఆధారాలు అవసరం. మూడు, నేరం జరిగిన పరిస్థితులు ఇతరులకు ఉదాహరణగా నిలవవలసినంతటి శిక్షకు అర్హమైనవి కావాలి. 'దిశ' చట్టం ప్రకారం ఏర్పడనున్న ప్రత్యేక కోర్టులు విధించే మరణశిక్షలు ఈ మూడు షరతులను సంతృప్తిపరచగల విధంగా ఉన్నట్లు అప్పీలు కోర్టులు అంగీకరించాలి. ఈ షరతుల నిర్వచనాలపైన, వాటిని సంతృప్తిపరుచగలగటం పైన సహజంగానే కేసు విచారణల్లో, అప్పీళ్లలో అనేక వాదోపవాదాలుంటాయి. తర్వాత కాలంలో ఎదురుకాగల ఈ పరీక్షలను అట్లుంచి, అంతకన్న ముందే 'దిశ' చట్టానికి రెండు పరీక్షలు ఎదురుకావచ్చు. ఒకటి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 254(2) ప్రకారం ఈ చట్టానికి ఆమోదం తెలుపవలసిన రాష్ట్రపతి ఏ నిర్ణయం తీసుకోవచ్చునన్నది. రెండు, ఈ చట్టాన్ని ఎవరైనా సవాలు చేసిన పక్షంలో, ఇటువంటి సందర్భాల్లో ఇటీవల క్లిష్టమైన వ్యాఖ్యలు చేస్తున్న కోర్టులు ఏమనగలవన్నది.

పోతే ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం గత గురువారం నాడు చిన్నపిల్లల పోక్సో కేసుల సత్వర విచారణ కోసం 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయటాన్ని, మహిళల కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానాల్లో జడ్జీల ఖాళీలను రాష్ట్ర హైకోర్టు యుద్ధప్రాతిపదికన భర్తీ చేయటాన్ని ప్రస్తావించాలి. ఇటువంటి చర్యలు సంచలనాన్ని సృష్టించకుండానే సత్వర దర్యాప్తులకు, కేసు విచారణలకు దోహదం చేస్తాయి. ఇప్పటికే పలువురు చేస్తున్న సూచనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం చట్టాల్లో తగు సవరణలు చేయటం, కేసు వాయిదాలను, అప్పీళ్లను తగ్గించటం, ఈ తరహా నేరాలకు శిక్షాస్మృతిలో శిక్షలను పెంచటం, అన్ని రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పడేట్లు చూడటం వంటివి చేసినట్లయితే ఉపయోగకరమవుతుంది. పిల్లలకు, మహిళలకు, సమాజానికి భద్రతపై భరోసా పెరుగటం, నేరస్వభావం కలవారికి భయం ఏర్పడటం జరిగి, అటువంటి వాతావరణం మధ్య సరైన సత్వర దర్యాప్తునకు పోలీసులపైన, సత్వర విచారణకు, శిక్షల అమలుకు కోర్టుల పైన ఒత్తిడి ఏర్పడుతుంది.

మొత్తం మీద ఇటీవలి పరిణామాలు ప్రభుత్వాల మీద, న్యాయస్థానాల మీద ఒత్తిడిని సృష్టించటం సంతోషించదగ్గవిషయమే. ఇప్పటికే గల చట్టాలను సక్రమంగా అమలుచేయటం, పోలీసులు కేసులను నమోదు చేసి సరిగా దర్యాప్తు చేయటంలో నిష్పక్షపాతంగా వ్యవహరించటం, నిజాయితీగా ఉండటం, కోర్టులు సత్వర విచారణలు జరుపటం వంటివి జరిగితే ఈ పరిణామాలకు, ప్రజల చైతన్యాలకు, సమాజపు ఒత్తిళ్లకు సార్థకత ఉంటుంది.

భారత్‌దే ఈ దశాబ్దం

క్రికెట్

చెగ్గోజు రాజశేఖర్

క్రికెట్.. ఈ మూడక్షరాల పదంలో ఏదో తెలియని మహత్తు దాగుంది. ఏ క్షణాన బ్రిటిష్ వాడు క్రికెట్‌ను భారత్‌కు పరిచయం చేశాడో కానీ అప్పటినుంచి ఇప్పటివరకు దేదీప్యమానంగా విరాజిల్లుతున్నది. అవును తరాలు మారుతున్నా.. ఆటగాళ్లు మారినా ఆట అంతకంతకు వన్నెలద్దుకుంటూనే ఉన్నది. సుదీర్ఘ చరిత కలిగిన క్రికెట్‌లో ఇప్పటిదాకా ఎన్నో అద్భుతాలు చూశాం. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆటలో వచ్చిన మార్పులను చూశాం. ఇక క్రికెట్‌పై చెరగని ముద్ర వేస్తూ కోట్లాదిమంది అభిమాన క్రీడగా మారిన మన దేశంలో ఆటగాళ్లను దేవుళ్లుగా కొలుస్తున్న సందర్భాలు చూశాం. కల్నల్ సీకే నాయుడు, మన్సూర్ అలీఖాన్ పటౌడీ, మహారాజా రంజిత్‌సింగ్ ఇలాంటి గొప్ప గొప్ప క్రికెటర్లతో మొదలైన మన ప్రస్థానం దినదిన ప్రవర్ధమానంగా ఎదిగిందని చెప్పవచ్చు. క్రికెట్ ప్రపంచాన్ని గడగడలాడించిన వెస్టిండీస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ రికార్డు స్థాయిలో 10వ ద్వైపాక్షిక సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న సందర్భంగా ఓసారి మన ప్రదర్శను పరిశీలిస్తే. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా ప్రత్యర్థిని చిత్తుచేయడంలో టీమ్‌ఇండియా ఆరితేరింది. ఆడేది సొంతగడ్డ అయినా స్వదేశమైనా గెలుపే లక్ష్యంగా భారత్ చెలరేగుతున్నది. ప్రత్యర్థికి లక్ష్యం నిర్దేశించడంలోనే కాదు ఎంతటి భారీ లక్ష్యాన్నైనా ఛేదించడంలో తమకు తామే సాటి నిరూపించుకున్న సందర్భాలు కొకొల్లలు. ఇన్నేండ్ల మన క్రికెట్ చరిత్రలో మన ప్రధానాయుధం బ్యాటింగ్ కానీ ఇటీవలికాలంలో బౌలింగ్‌లోనూ మనోళ్లు బాగా రాణిస్తున్నారు. ఒకప్పటి కరీబియన్ భీకర పేసర్లను తలపిస్తూ మహ్మద్ షమీ, ఇషాంత్‌శర్మ, ఉమేశ్ యాదవ్, బుమ్రా, భువనేశ్వర్‌కుమార్ బ్యాట్స్‌మెన్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. స్పిన్నర్లకు పేరుగాంచిన చోట తాము కూడా సత్తాచాటుతామని నిరూపిస్తున్నా రు. ముఖ్యంగా గత దశాబ్ద(2010-2019) కాలంలో టీమ్‌ఇండియా లెక్కకు మిక్కిలి విజయాలను సొంతం చేసుకున్నది. దిగ్గజ క్రికెటర్ల ఘన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంటూ జార్ఖండ్ డైనమైట్ మహేంద్రసింగ్ ధోనీ సారథ్యంలో భారత్ జట్టు మరో మలుపు తీసుకుంది. సౌరవ్ గంగూలీ దూకుడు శైలికి భిన్నంగా మైదానంలో ప్రశాంత చిత్తంతో ప్రత్యర్థిని చిత్తుచేయడంలో తనను మించిన నాయకుడు లేడని మహీ నిరూపించుకున్నాడు. సొంతగడ్డపైనే కాదు విదేశాల్లోనూ జట్టుకు విజయాలను పరిచయం చేసింది ధోనీ సారథ్యంలోనే. సచిన్, గంగూలీ, ద్రవిడ్, లక్ష్మణ్ లాంటి దిగ్గజాల మేళవింపుతో కూడిన జట్టుకు ధోనీ నాయకత్వం వహించాడు. సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా అందరినీ కలుపుకుపోతూ జట్టుకు చిరస్మరణీయ విజయాలందించాడు.

అదే కోవలో ఇప్పుడు విరాట్ కోహ్లీ దూసుకెళుతున్నాడు. ధోనీ నుంచి కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి తాజాగా వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ వరకు కోహ్లీ కెప్టెన్సీ మార్కు కచ్చితంగా కనిపిస్తున్నది. విజయం కోసం విశ్రమించని నైజంతో బరిలోకి దిగే విరాట్.. సహచరుల్లో స్ఫూర్తి నింపుతూ అతితక్కువ సమయంలోనే మేటి నాయకులు స

సీఏఏ మాకు ఆశాకిరణం

- భారత పౌరసత్వం వస్తుందన్న భరోసా లభించింది
- ఔరంగాబాద్‌లో ఉంటున్న సింధి శరణార్థి ఆశాభావం

ఔరంగాబాద్, డిసెంబర్ 25: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) తమకు ఆశాకిరణమని పాకిస్థాన్ నుంచి 1990లో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు వలస వచ్చి నివాసముంటున్న సింధి సామాజికవర్గానికి చెందిన విక్రమ్ తల్రేజా తెలిపారు. ఈ చట్టం వల్ల తనతోపాటు తనలాంటికివారికి త్వరలోనే భారత పౌరసత్వం లభిస్తుందన్న ఆశ కలిగించిందని పేర్కొన్నారు. 2015కు ముందు బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా భారత దేశానికి వచ్చిన హిందువులు, జైనులు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, క్రైస్తవులకు భారత పౌరసత్వం ఇవ్వాలనే ఉద్దేశంతో సీఏఏను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఏఏకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విక్రమ్ తల్రేజా మీడియాతో మాట్లాడుతూ.. '1990లో పాకిస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చాం. కానీ, మేము ఇప్పటికీ పౌరసత్వం కోసం ఎదురు చూస్తున్నాం. సీఏఏ మాకు ఓ ఆశాకిరణం. పాకిస్థాన్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అక్కడ తరచూ అల్లర్లు జరిగాయి. ఆశ్రయం కల్పించాలని మేము భారత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాం. మాకు దీర్ఘకాలిక వీసా ఇచ్చారు' అని వెల్లడించారు. పాకిస్థాన్ నుంచి శరణార్థులుగా వచ్చిన సింధీలు సుమారు 90 మంది నగరంలో ఉంటున్నారని ఆ సామాజిక వర్గానికి చెందిన సభ్యుడు, స్థానిక బీజేపీ నాయకుడు కిషన్‌చంద్ తన్వాని తెలిపారు.



పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థులు (ఫైల్)

సీఏఏ, ఎన్నార్సీని వ్యతిరేకించేవారిని గంటలో తుడిచిపెట్టేస్తాం!

హర్యానా బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

చండీగఢ్: సీఏఏ, ఎన్నార్సీని వ్యతిరేకించేవారిని ఒక్క గంటలో తుడిచిపెట్టేస్తామంటూ హర్యానా బీజేపీ ఎమ్మెల్యే లీలారామ్ గుర్జర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కైథల్ నియోజకవర్గంలో జరిగిన ఒక కార్యక్రమంలో పౌరసత్వ సవరణ చట్టానికి మద్దతుగా ఆయన మాట్లాడుతూ.. నేటి భారతదేశం గాంధీజీ, మాజీ ప్రధాని నెహ్రూలది కాదని ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలది అని పేర్కొన్నారు. 'ఇది జవహర్‌లాల్ నెహ్రూ హిందుస్థాన్ కాదు, ఇది గాంధీ నాటిదీ కాదు. ఇప్పుడున్న హిందుస్థాన్ నరేంద్రమోదీజీది. మహాశయా.. ఒక వేళ ఏదైనా సంకేతం లభిస్తే మాత్రం.. ఒక గంటలోపు తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు. 'సీఏఏను తీసుకురావడం వెనుక ముస్లింలు దేశం విడిచిపోవాలనే కుట్ర దాగి ఉందని ఎవరైనా భావిస్తే సరికాదు, అలాంటి ఉద్దేశం ఏదీ చట్టంలో లేదు. చట్ట వ్యతిరేకంగా ఎవరైతే దేశంలోకి చొరబడ్డారో వారుమాత్రం వెళ్లకతప్పదు' అని ఆయన



లీలారామ్ గుర్జర్

అన్నారు. గత అక్టోబర్‌లో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రణదీప్‌సింగ్ సుర్జేవాలాను ఓడించి కైథల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా లీలారామ్ గుర్జర్ గెలిచారు.

తప్పుడు వివరాలివ్వండి

- ఎన్పీఆర్ కోసం అధికారులు వచ్చినప్పుడు అసలు వివరాలివ్వొద్దు
- ఎన్పీఆర్ వివరాలతోనే ఎన్నార్సీని రూపొందిద్దామనేది మోదీ సర్కార్ యోచన
- ఆ యత్నాలను వ్యతిరేకిద్దాం: అరుంధతిరాయ్ పిలుపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: జాతీయ పౌర జాబితాకు (ఎన్నార్సీకి) జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) సమాచార వనరుగా (డేటాబేస్‌గా) ఉపయోగపడుతుందని, తప్పుడు పేర్లు, చిరునామాలు ఇవ్వడం ద్వారా ఎన్పీఆర్‌ను వ్యతిరేకించాలని ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్ ప్రజలకు సూచించారు. బుధవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశంలోని ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఎన్నార్సీని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. అయితే ఎన్నార్సీతో ఎన్పీర్‌కు ఎలాంటి సంబంధం లేదని, ఎన్పీఆర్ డేటాను ఎన్నార్సీకి ఉపయోగించబోమని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇదివరకే స్పష్టంచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీయూలో జరిగిన నిరసన కార్యక్రమంలో అరుంధతి రాయ్ మాట్లాడుతూ..'ఎన్పీఆర్ ప్రక్రియ కోసం అధికారులు మీ ఇంటికి వస్తారు. మీ పేరు, ఫోన్ నంబర్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వివరాలు అడుగుతారు. ఎన్నార్సీకి ఎన్పీఆర్ డేటాబేస్‌గా ఉపయోగపడుతుంది. దీనికి వ్యతిరేకంగా మనం పోరాడాలి. ఇందుకు ఒక ప్రణాళిక ఉన్నది. ఎన్పీఆర్ కోసం అధికారులు మీ ఇంటికి వచ్చినప్పుడు.. వేరే పేర్లు, చిరునామాలు చెప్పండి. మనమేమీ లాఠీలు, బుల్లెట్లను ఎదుర్కోవడానికి పుట్టలేదు' అని సూచించారు. ప్రధాని మోదీపైనా ఆమె విమర్శలు గుప్పించారు. ఎన్నార్సీపై తమ ప్రభుత్వం ఎన్నడూ చర్చించలేదని, అసోంలో ఎలాంటి నిర్బంధ కేంద్రాలు లేవని ప్రధాని అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. దొరికిపోతానని తెలిసి కూడా ప్రధాని అబద్ధాలు చెప్పారని, తనను ప్రశ్నించని మీడియా తన చేతుల్లో ఉండడమే ఇందుకు కారణమన్నారు. ఎన్నార్సీని, ఎన్పీఆర్‌ను అమలుచేయబోమని ఆయా రాష్ట్రాలు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరసనకారులు పోరాడాలని ఆమె సూచించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్నార్సీపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎన్పీఆర్ ద్వారా సీఏఏ, ఎన్నార్సీ నిబంధనలు అమలుచేసేందుకు మోదీ సర్కారు యత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలపై పోలీసులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వారి ఇండ్లలోకి ప్రవేశించి, దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. సీఏఏ, ఎన్నార్సీ కేవలం ముస్లింలకు మాత్రమే వ్యతిరేకం కాదని, దళితులు, గిరిజనులు, పేదలకు కూడా వ్యతిరేకమని అరుంధతి రాయ్ పేర్కొన్నారు.

అరుంధతి రాయ్

బ్రిటిష్‌పాలనే నయం

ఆంగ్లేయ పాలనలోనూ ఇలాంటి అణచివేత చూడలేదు

- సీఏఏ ఆందోళనలను కేవలం ముస్లింల ఆక్రోశంగా చూడడం సరికాదు
- దేశం, ప్రజాస్వామ్య భవిష్యత్ కోసమే ఈ పోరాటం
- ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ వ్యాఖ్యలు

ఇర్ఫాన్ హబీబ్

అలీగఢ్, డిసెంబర్ 25: పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏకి) వ్యతిరేకంగా ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహావేశాలను కేవలం 'ముస్లింల ఆక్రోశం'గా పరిగణించడం తప్పు అని ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ వ్యాఖ్యానించారు. అంతిమంగా ఇది (సీఏఏ) అందరిపైనా, 'ఆధునిక భారత భావన'పైనా ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. బుధవారం ఆయన పీటీఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిరసనల సందర్భంగా ఆందోళనకారుల మీద పోలీసుల దాష్టీకంపై ఆయన స్పందిస్తూ.. వలస పాలనలో కూడా ఈ విధంగా అసమ్మతిని అణచివేయలేదని విమర్శించారు. 1938లో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏంఎయూ)లో చోటుచేసుకున్న ఒక ఘటనను ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. 'ఏఎంయూలో జరిగిన హింసాత్మక ఘటనలు పోలీసులతో ఘర్షణకు దారితీశాయి. అప్పుడు ఎస్పీగా బ్రిటిష్ వ్యక్తి ఉన్నారు. నిరసన సమయంలో ఆయనను విద్యార్థులు చితకబాదారు. అయినప్పటికీ క్యాంపస్‌లోకి పోలీసులు ప్రవేశించడానికి ఆయన నిరాకరించారు. ఎందుకంటే ఆ క్షణంలో సంయమనం పాటించడం అత్యంత ముఖ్యమని ఆయనకు తెలుసు' అని వివరించారు. ప్రజాస్వామిక సమాజంలో నిరసన తెలిపేందుకు హక్కు ఉన్నదని చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ నిరసనల్లో ముస్లింలే గాక పెద్ద సంఖ్యలో హిందువులు, ఇతర మతాలకు చెందిన వారు కూడా పాల్గొంటున్నారని ఇర్ఫాన్ హబీబ్ గుర్తుచేశారు. ఈ పోరాటం మన దేశం కోసం, ప్రజాస్వామ్య భవిష్యత్ కోసమని పేర్కొన్నారు. మోదీ సర్కారు ఇటీవల ప్రవేశపెట్టిన విధానాలు.. హిందుత్వ ఉద్యమ దీర్ఘకాలిక ప్రాజెక్ట్ ఎజెండాను ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. దేశ విభజన తర్వాత పాకిస్థాన్‌లో చోటుచేసుకున్న పరిణామాలే దురదృష్టవశాత్తూ ఇప్పుడు భారత్‌లోనూ జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. 'మతం అనేది ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతున్నది. పాకిస్థాన్ పాలకుల మాదిరిగానే, ప్రస్తుతం మన దేశంలోని పాలకులకు కూడా బాగా తెలుసు. దానిపైనే వారి అధికారం ఆధారపడి ఉన్నది' అని అన్నారు. ప్రస్తుత ఆందోళనలకు ఉన్న మూలాలపై ఆయన స్పందిస్తూ.. 'గత కొంతకాలంగా ముస్లింలలో ఆగ్రహం నెలకొన్నది. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పలు చట్టాలు, తీసుకున్న విధాన నిర్ణయాలను బట్టి 'హిందుత్వ కార్యకలాపాలు' తీవ్రమవుతున్నాయని ముస్లింలు గ్రహించడంతో గత కొన్ని రోజులుగా వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు' అని వివరించారు. జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహనీయులు అనుసరించిన మానవీయత, బహుళత్వ సమాజ విధానాల కారణంగానే ఆధునిక భారతం ఆవిష్కృతమైనదని, అయితే ప్రస్తుతం భారత భావన అన్నది ప్రమాదంలో పడిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తరప్రదేశ్‌లో విధ్వంసానికి దిగిన ఆందోళనకారులు(ఫైల్)

యూపీలో నిరసనకారులపై ప్రతీకార చర్యలు

- ఆస్తుల జప్తు, స్వాధీనాన్ని ప్రారంభించిన యోగి సర్కార్
- 300 మందికి నోటీసులు జారీ
- రూ.88.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వాస్తులకు నష్టం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ సర్కార్ అన్నంత పని చేసింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి పాల్పడిన వారిపై 'బద్లా (ప్రతీకారం)' తీర్చుకుంటామని సీఎం యోగి ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆందోళన జరిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం, అందుకు కారకులైన వారిని గుర్తించిన ప్రభుత్వం.. ఆందోళనకారుల ఆస్తుల జప్తు ప్రక్రియను ప్రారంభించింది. 300 మందికి పైగా నోటీసులు జారీ చేసింది. పరిహారం ఎందుకు వసూలు చేయకూడదో తెలియజేయాలని పేర్కొంటూ.. గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన రూలింగ్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా నోటీసులు జారీ చేశారు. లక్నో జిల్లాలో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని, మీరట్‌లో 141 మంది పాల్గొన్నారని, రూ.14 లక్షల విలువైన ఆస్తులు జప్తు చేయాల్సి ఉందని జిల్లా కలెక్టర్ అనిల్ చెప్పారు. గోరఖ్‌పూర్‌లో 33 మందికి, సంభాల్ జిల్లాలో రూ.15 లక్షల ఆస్తి నష్టానికి సంబంధించి 26 మందికి, బిజ్నార్‌లో 19.7 లక్షల ఆస్తి నష్టంపై 43 మందికి , రాంపూర్‌లో రూ.14,86,500 నష్టంపై 28 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు.

పవార్ రాజకీయ పాఠాలు నేర్పారు

మెజారిటీ లేకపోయినా మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేయాలో చెప్పారు: ఉద్ధవ్ ఠాక్రే

పుణె, డిసెంబర్ 25: రాజకీయాల గురించి ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్ తనకు చాలా విషయాలు చెప్పారని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. ఉద్ధవ్ తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి సీఎం అయిన విషయం తెలిసిందే. బుధవారం పుణెలోని 'వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్' వార్షిక సమావేశంలో పాల్గొన్న ఉద్ధవ్ మాట్లాడుతూ 'రాజకీయాల్లో ఎలా ఎదగాలి.. మనకు ఎమ్మెల్యే సీట్లు తక్కువగా ఉన్నప్పటికీ మద్దతు ఇచ్చే పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేయాలి.. ఇలా ఎన్నో విషయాల గురించి పవార్ నాకు నేర్పారు' అని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాల కిందట ఇదే వేదిక నుంచి కొందరు మాట్లాడుతూ పవార్ నేర్పిన రాజకీయ పాఠాలు తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారని పరోక్షంగా ప్రధాని మోదీని ఉద్ధవ్ విమర్శించారు. నరేంద్రమోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో వసంత్‌దాదా ఇన్‌స్టిట్యూట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీ రాజకీయాల గురించి పవార్ తనకు ఎన్నో విషయాలు చెప్పారని పేర్కొన్నారు. వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌కు పవార్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

సీఏఏపై త్రిపుర రాజకుమారుడి

పోరుబాట

సామాజిక సంస్థను ఏర్పాటు చేసిన ప్రద్యుత్ కిశోర్

అగర్తల, డిసెంబర్ 25: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్న నేపథ్యంలో త్రిపుర రాజ కుటుంబ వారసుడు, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రద్యుత్ కిశోర్ మాణిక్య దేవ్ బర్మన్ నూతన సామాజిక సంస్థను ఏర్పాటు చేశారు. 'ది ఇండిజీనస్ ప్రొగ్రెసివ్ రీజనల్ అలయన్స్ (టిప్రా)' అనే పేరుతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ రాజకీయాలకు అతీతంగా పని చేస్తుందన్నారు. త్రిపురలోని గిరిజనుల హక్కులను పరిరక్షించడమే ఈ సంస్థ లక్ష్యమన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా జనవరి 8న 'టిప్రా' శాంతియుత ఆందోళన నిర్వహిస్తుందన్నారు. సంస్థలో సభ్యులుగా చేరాలని ప్రజలకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు మంగళవారం 'టిప్రా' పేరుతో 'ఫేస్‌బుక్'లో నూతన ఖాతాను తెరిచారు. 'మా ప్రజల గుర్తింపు, హక్కులను యథాతథంగా కాపాడటమే మా లక్ష్యం. ఈ సంస్థకు బుబగ్రా (రాజు) ప్రద్యుత్ మాణిక్య చైర్మన్‌గా ఉంటారు. ఇది సామాజిక సంస్థ మాత్రమే. రాజకీయ పార్టీ కాదు' అని ఆ ఫేస్‌బుక్ ఖాతా పేర్కొంది. సీఏఏకు వ్యతిరేకంగా జరిగే ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని రాష్ట్రంలోని వివిధ గిరిజన సంఘాల నేతలను ప్రద్యుత్ కిశోర్ దేవ్ బర్మన్ ఆహ్వానించారు. 'పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు చేస్తే రాష్ట్రంలోని గిరిజనులపై ప్రభావం పడుతుంది. చట్టానికి వ్యతిరేకంగా మేం పోరాడతాం' అని తెలిపారు.

ఎన్నార్సీ లేని ఎన్పీఆర్‌కు ఓకే!

- సీఏఏ, ఎన్నార్సీలను దుర్వినియోగపర్చడానికి ద్వారాలు తెరిచారు
- కేంద్ర ప్రభుత్వంపై మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మండిపాటు
- మంగళూరు మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను నిలిపేసిన కర్ణాటక సర్కార్

భోపాల్/బెంగళూరు/వాషింగ్టన్, డిసెంబర్ 25: జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) ప్రసక్తి లేకుండా జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను రాష్ట్రంలో నిర్వహించాలని తమ పార్టీ కోరుకుంటుందని.. అయితే రాజ్యాంగ విరుద్ధమైన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) రాష్ట్రంలో అనుమతించేది లేదని కాంగ్రెస్ నాయకుడు, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ పేర్కొన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ బుధవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో చేపట్టిన నిరసన ర్యాలీకి ఆయన నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఎన్నార్సీతో పాటు ఎన్పీఆర్‌ను కూడా తీసుకురావడంలో మోదీ సర్కారు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. సీఏఏ, ఎన్నార్సీలను దుర్వినియోగపర్చడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారాలు తెరిచిందని ఆరోపించారు. ఎన్పీఆర్‌పై కేంద్రం మంగళవారం చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ మీడియా అడిగిన ఓ ప్రశ్నకు స్పందించిన కమల్‌నాథ్ మాట్లాడుతూ.. 'మేము కూడా ఎన్పీఆర్ అమలును స్వాగతిస్తున్నాం. ఐతే, ఎన్పీఆర్‌తో పాటు ఎన్నార్సీని చేపట్టకూడదు. అయితే, ఇవి రెండింటిని కలిపి వాళ్లు(కేంద్ర ప్రభుత్వం) అమలు చేయాలని చూస్తున్నారు. వారి ఉద్దేశం ఏంటో దీంతో రూడీ అవుతున్నది' అని అన్నారు. 'నా 40 ఏండ్ల పార్లమెంట్ జీవితకాలంలో.. సీఏఏ, ఎన్నార్సీ వంటి రాజ్యాంగ విరుద్ధమైన చట్టాల్ని చూడలేదు. చట్టంలో ఏమి రాసి ఉన్నదోనన్నది ప్రశ్న కాదు. ఏమి రాయలేదన్నదే అసలు ప్రశ్న' అని తెలిపారు. సీఏఏను తమ రాష్ట్రంలో అమలు చేయబోమని పునరుద్ఘాటించారు. మరోవైపు, సీఏఏకు మద్దతునిస్తూ అమెరికాలోని పలు నగరాల్లో భారతీయ అమెరికన్లు ప్రదర్శనలు నిర్వహించారు. సీఏఏ, ఎన్నార్సీపై కొందరు చేస్తున్న దుష్ప్రచారం, అపోహలను తొలగించడానికే ఈ ప్రదర్శనలను చేపట్టామని నిర్వాహకులు తెలిపారు.

సీఏఏకు వ్యతిరేకంగా బుధవారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో సీఎం కమల్‌నాథ్ నేతృత్వంలో నిర్వహించిన భారీ ర్యాలీ

ఎక్స్‌గ్రేషియా నిలుపుదల

సీఏఏను వ్యతిరేకిస్తూ గత గురువారం కర్ణాటకలోని మంగళూరులో చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారడం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో మంగళూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. దీంతో బాధితుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను కర్ణాటక సర్కారు ప్రకటించింది. అయితే ఈ ఎక్స్‌గ్రేషియాను నిలుపుదల చేస్తున్నట్టు బుధవారం కర్ణాటక ప్రభుత్వం మరో ప్రకటన చేసింది. ఘటనపై పోలీసు దర్యాప్తు పూర్తయ్యేంత వరకూ ఈ నిలుపుదల కొనసాగుతుందని సీఎం యడియూరప్ప తెలిపారు. మంగళూరులో గత గురువారం జరిగిన అల్లర్ల వెనుక కుట్ర దాగి ఉన్నదని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

కర్ణాటకలో సిద్ధమైన నిర్బంధ శిబిరం

సీఏఏకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఓవైపు నిరసనలు కొనసాగుతున్నప్పటికీ.. కర్ణాటకలో నిర్బంధ శిబిరం ఏర్పాటైంది. రాష్ట్రంలోని అక్రమ వలసదారుల కోసం ఉద్దేశించిన ఈ శిబిరాన్ని బెంగళూరుకు సమీపంలోని సొందెకొప్ప గ్రామంలో నిర్మించారు. ఇందులో పలు గదులు, వంట గది, మూత్రశాలలు ఉన్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఒకరు తెలిపారు. అయితే 'నిర్బంధ శిబిరం'గా పేర్కొనడాన్ని రాష్ట్ర హోంమంత్రి బసవరాజ్ బొమ్మై తప్పుబట్టారు. సీఏఏ పేరుతో ఎవర్నీ నిర్బంధించట్లేదని, శిబిరం ప్రారంభమైనట్టు తనకు సమాచారం కూడా లేదన్నారు.

నేడు సూర్యగ్రహణం

- ఉంగరం ఆకారంలో కనిపించనున్న సూర్యుడు
- ఉదయం 8.08 గంటల నుంచి 11.05 గంటల వరకు..

న్యూఢిల్లీ: గురువారం సూర్యగ్రహణం సంభవించనున్నది. ఉదయం 8.08 గంటలకు మొదలయ్యే సూర్యగ్రహణం11.05 గంటలకు ముగుస్తుంది. దీన్ని అంగుళీయక(ఉంగరం ఆకారంలో) సూర్యగ్రహణంగా వ్యవహరిస్తున్నారు. దీనికి కారణం చంద్రుని చుట్టూ 'రింగ్ ఆఫ్ ఫైర్' ఏర్పడటమే. గురువారం ఏర్పడే సూర్య గ్రహణంలో భూమికి అత్యంత దూరంగా ఉండటంవల్ల సూర్యుడిని చంద్రుడు పూర్తిగా కప్పివేయడు. దీంతో సూర్యుడి అంచు చంద్రుడి చుట్టూ ఓ వలయంలా కనిపించనున్నది. దీన్నే 'రింగ్ ఆఫ్ ఫైర్ (అంగుళీయక సూర్యగ్రహణం)' అని అంటారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో గ్రహణాన్ని ఏ సమయంలో వీక్షించవచ్చో కోల్‌కతాలోని బిర్లా ప్లానిటోరియం తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం ఉదయం 8.08 గంటలకు మొదలయ్యే సూర్య గ్రహణం ఉదయం 11.10 గంటలకు ముగుస్తుంది. ఉదయం 9.30 గంటలకు పూర్తిస్థాయి సూర్యగ్రహణాన్ని హైదరాబాదీలు వీక్షించవచ్చని బిర్లా ప్లానిటోరియం పేర్కొంది. సూర్యగ్రహణాన్ని రక్షణ లేకుండా ప్రత్యక్షంగా చూడటం కండ్లకు మంచిది కాదు. సూర్యగ్రహణాన్ని గ్రహణ వీక్షణ కండ్లద్దాలు, 14 నంబర్ వెల్డర్ కండ్లద్దాలు, నల్లటి పాలిమర్ కోట్ చేసిన ఫిల్మ్‌లు, చిన్న రంధ్రం చేసిన కాగితం/కార్డ్‌బోర్డ్ గుండా గ్రహణాన్ని వీక్షించవచ్చని నిపుణులంటున్నారు. 2020, జూన్ 21న(అంగుళీయక సూర్యగ్రహణం), 2020 డిసెంబర్ 14న (సంపూర్ణ సూర్యగ్రహణం), 2021, జూన్ 10న (అంగుళీయక సూర్య గ్రహణం), 2021, డిసెంబర్ 4(సంపూర్ణ సూర్య గ్రహణం) తేదీల్లో సూర్యగ్రహణాలు సంభవించనున్నాయి.



రింగ్ ఆఫ్ ఫైర్ (ఫైల్)

సూర్యగ్రహణంలో రకాలు

- సూర్యుడిని చంద్రుడు పాక్షికంగా కప్పేస్తే ఏర్పడే గ్రహణం 'పాక్షిక సూర్య గ్రహణం'.
- సూర్యుడిని చంద్రుడు పూర్తి స్థాయిలో కప్పి ఉంచితే, దాన్ని 'సంపూర్ణ సూర్యగ్రహణం'గా పేర్కొంటారు.
- సంపూర్ణ సూర్యగ్రహణం, అంగుళీయక సూర్యగ్రహణంగా మారే ప్రక్రియను 'మిశ్రమ సూర్య గ్రహణం(హైబ్రిడ్ సోలార్ ఎక్లిప్స్)'గా పిలుస్తారు.

సోనియాతో హేమంత్ భేటీ

- 29న ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానం
- తమ కూటమి సర్కార్ ఐదేండ్లు పూర్తి చేసుకుంటుందని విశ్వాసం

న్యూఢిల్లీ: జార్ఖండ్ సీఎంగా ప్రమాణం చేయనున్న హేమంత్ సోరేన్ బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆ పార్టీ నేత రాహుల్‌తో సమావేశమయ్యారు. ఈ నెల 29న రాంచీలో జరిగే తన ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరు కావాలని వారిని ఆహ్వానించారు. అనంతరం హేమంత్ సోరేన్ మీడియాతో మాట్లాడుతూ తమ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే సుస్థిర ప్రభుత్వం ఐదేండ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకుంటుందన్నారు. 'సీఎంగా నా ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని సోనియా, రాహుల్‌లను ఆహ్వానించేందుకు ఢిల్లీకి వచ్చాను. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించినందుకు నన్ను సోనియా అభినందించారు' అని తెలిపారు. కాగా, మోదీని, అమిత్‌షాను ఎన్నికల వేళ వారిని బీజేపీ నేతలుగా చూసినా ఇప్పుడు ప్రధానమంత్రిగా, హోంమంత్రిగా చూస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జార్ఖండ్ ప్రజల బాగోగులే తన ప్రాధాన్యం అని హేమంత్ సోరేన్ తెలిపారు. 81 స్థానాల జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి 47 స్థానాల్లో విజయం సాధించి.. బీజేపీని మట్టికరిపించిన సంగతి తెలిసిందే.

సోనియాగాంధీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జేఎంఎం నేత హేమంత్ సోరేన్

అటల్ భూజల యోజన

మొదటిపేజీ తరువాయి...

పంటలు పండించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.

జల్‌జీవన్‌తో ఇంటింటికీ మంచినీరు

భూగర్భ జలమట్టాలు తక్కువ ఉన్న ప్రాంతాలపై అటల్ భూజల యోజన ద్వారా దృష్టిసారించామని తెలిపిన ప్రధాని మోదీ.. మరోవైపు జల్‌జీవన్ మిషన్ ద్వారా దేశంలోని అన్ని కుటుంబాలకు పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేసింది. కసరత్తు చేస్తున్నామని చెప్పారు. నీటి నిర్వహణలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన పంచాయతీలకు అధిక కేటాయింపులు చేస్తామని తెలిపారు. గత 70 ఏండ్లలో 18 కోట్ల గ్రామీణ కుటుంబాలకు గాను మూడు కోట్ల కుటుంబాలకు మాత్రమే పైపులద్వారా మంచినీటి సరఫరాచేశారని, తమ ప్రభుత్వం మాత్రం వచ్చే ఐదేండ్లలో 15 కోట్ల కుటుంబాలకు మంచినీరు అందించేందుకు సంకల్పించిందని వివరించారు. గ్రామస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా నీటి పథకాలను రూపొందించాలని సూచించారు. నీటి సంబంధిత పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చే ఐదేండ్లలో సుమారు రూ.3.5 లక్షల కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. తమ గ్రామాల్లో నీటి సమస్యల పరిష్కారానికి తమవంతు సాయంచేయాలని ప్రవాస భారతీయులకు మోదీ సూచించారు.

ప్రభుత్వ ఆస్తుల ధ్వంసంపై ప్రధాని ఆగ్రహం

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల సందర్భంగా ఉత్

కేబీఆర్ పార్కు బ్రహ్మాండం

పార్కు చూడాలన్న కోరిక నెరవేరింది

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు బ్రహ్మాండంగా ఉన్నదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ప్రశంసించారు. బుధవారం ఆ పార్కును జోషి అనురాధ దంపతులు, పీసీసీఎఫ్ ఆర్ శోభతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ పీసీసీఎఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, హైదరాబాద్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు.. జోషి దంపతులకు స్వాగతం పలికి స్థానిక సదుపాయాలు, పార్కు నిర్వహణను వివరించారు. పార్కు విజిటర్ జోన్‌లోని ఈఈసీ సెంటర్, ఓపెన్ క్లాస్ జిమ్, యోగాషెడ్, నేచర్ క్యాంపు వివరాలు తెలుసుకున్న అనంతరం జోషి మాట్లాడుతూ.. ఈ పార్కు చూడాలన్న కోరిక క్రిస్మస్ ఉదయాన నెరవేరడం ఆనందంగా ఉన్నదన్నారు. పార్కు నిర్వహణలో అధికారులు చూపిస్తున్న శ్రద్ధను సీఎస్ అభినందించారు. వాచ్‌టవర్‌పై నుంచి పార్క్ పచ్చదనాన్ని వీక్షించిన ఆయన అధికారుల సేవలను కొనియాడారు. వాచ్‌టవర్ సమీపాన ప్లాంటింగ్ రాతి బండ మధ్య ఆయన జువ్వి మొక్కనునాటారు. నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ మాట్లాడుతూ.. పార్కుకు కొన్ని దశాబ్దాలుగా వస్తున్నానని తెలిపారు. నాడు బంజరు నేలగా ఉన్న ఈ ప్రాంతాన్ని అద్భుతమైన పచ్చదనంతో కళకళలాడేవిధంగా తీర్చిదిద్దిన అటవీశాఖ కృషిని అభినందించారు.

జూబ్లీహిల్స్ కేబీఆర్ పార్కులోని వాచ్‌టవర్‌పై సీఎం ఎస్కే జోషి, అనురాధ దంపతులు, పీసీసీఎఫ్ శోభ

మోదీకి గుడి

ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలోని ఎరాకుడి గ్రామానికి చెందిన రైతు పీ శంకర్ తన వ్యవసాయ భూమిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గుడి నిర్మించారు. రూ.1.2 లక్షలు వెచ్చించి నిర్మించిన గుడిలో.. ఏర్పాటుచేసిన మోదీ విగ్రహానికి రోజూ పూజలుచేసి హారతి ఇస్తున్నారు.

- తిరుచిరాపల్లి

శాంతియుత ప్రపంచం నెలకొనాలి

- సంక్షోభ దేశాల్లో సాధారణ పరిస్థితులు ఏర్పడాలి
- క్రిస్మస్ సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్ష.. వాటికన్‌లో ప్రత్యేక ప్రార్థనలు

వాటికన్ సిటీ, డిసెంబర్ 25:

క్రిస్మస్ నేపథ్యంలో పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ సిటీలో బుధవారం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సంక్షోభ దేశాల్లో శాంతి, సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొనాలని ఆయన ఆకాంక్షించా రు. వెనెజులా, లెబనాన్, మధ్య ఐరోపాతోపాటు పలు ఆఫ్రికా దేశాల్లో సాయుధ ఘర్షణలపట్ల పోప్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మధ్య ఐరోపా, ప్రపంచంలోని పలు దేశాల్లో అంతర్యుద్ధం, ఘర్షణల కారణంగా బాధపడుతున్న చాలా మంది చిన్నారుల జీవితాల్లో ప్రభువు వెలుగునింపాలని ప్రార్థిస్తున్నా' అని 83 ఏండ్ల వాటికన్ పీఠాధిపతి తన క్రిస్మస్ సందేశంలో పేర్కొన్నారు. పదేండ్లుగా అంతర్యుద్ధాలతో నలిగిపోతున్న ప్రియమైన సిరియా ప్రజలకు స్వస్థత చేకూరాలని పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్షించారు. ఆ ప్రాంత ప్రజలు శాంతి, భద్రతతో కలిసిమెలిసి జీవించే పరిస్థితులు నెలకొనేందుకు తగిన పరిష్కారాలను అన్వేషించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. 'ఇరాక్, యెమన్‌లో చాలా మంది ప్రజలు కష్టాలతో పోరాడుతున్నారు. అయినా వారు ధైర్యం కోల్పోలేదు. శాంతి, భద్రతతోపా టు తమ శ్రేయస్సు కోసం ఎదురుచూస్తున్నారు. పలు దక్షిణ అమెరికా దేశాలు సామాజిక, రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్నా యి. ప్రి యమైన వెనెజులా ప్రజలకు అవసరమైన సహా యం అందుతుంది. శాంతి కోసం ఉక్రెయిన్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయి' అని చెప్పారు. ఆఫ్రికాలో క్రిస్టియన్లపై దాడిని పోప్ ఖండించారు. ప్రపంచంలోనే పేద ఖండమైన ఆఫ్రికాలో రోగాలు, ప్రకృతి విపత్తులు, బుర్కినా ఫాసో, మాలి, నైజీరియా, డీఆర్‌కాంగోలో ఘర్షణలతో సతమతమవుతున్న బాధితులు, మంచి జీవితం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి సముద్రం మీ దుగా ఐరోపా చేరుకునే ప్రయత్నాల్లో ప్రమాదాలకు గురవుతున్న వారికోసం పోప్ ప్రార్థించారు.

వాటికన్ సిటీలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న పోప్ ఫ్రాన్సిస్

దేవుడిది ఆంక్షలు లేని ప్రేమ

'దేవుడిది ఆంక్షలు లేని ప్రేమ. మనతోపాటు మనలోని చెడ్డవారిని కూడా ఆయన ప్రేమిస్తూనే ఉన్నారు' అని పోప్ ఫ్రాన్సిస్ తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని వాటికన్ సిటీలో మంగళవారం రాత్రి జరిగిన ప్రార్థనలకు భారీగా తరలివచ్చిన ప్రజలకు తన సందేశాన్ని వినిపించారు. 'మీలో తప్పుడు ఆలోచనలు ఉండవచ్చు. చాలా చెడ్డ పనులు చేసి ఉండవచ్చు. అయినా ప్రభువు మిమ్మల్ని ప్రేమిస్తునే ఉన్నాడు' అని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు.

మంచుకొండల్లో క్రిస్మస్ వేడుకలను జరుపుకుంటున్న సైనికులు

మంచుకొండల్లో సైనికుల క్రిస్మస్ సంబురాలు

న్యూఢిల్లీ: పాకిస్థాన్ సైనికుల కాల్పులు, ఉగ్రవాదుల చొరబాట్లతో ఎప్పుడూ ఉద్రిక్తంగా ఉండే కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి బుధవారం క్రిస్మస్ కరోల్ జింగిల్ బెల్స్ గీతాలు వినిపించాయి. బుధవారం దేశవ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో ఘనంగా జరుపుకున్న క్రిస్మస్ వేడుకలను.. సరిహద్దుల్లో దేశ సంరక్షణ బాధ్యతలు చేపడుతున్న సైనికులు కూడా అంతే ఘనంగా జరుపుకున్నారు. 50 నుంచి 60 మంది ఉన్న భారత సైనికుల బృందం ఒకటి.. భారీగా మంచుతో కప్పబడిన ప్రాంతంలో క్రిస్మస్ కరోల్ జింగిల్ బెల్స్ పాడుతూ, కరోల్ ట్యూన్లకు చప్పట్లు కొడుతూ ఆనందంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. ఈ సైనికులు అస్సాం రెజిమెంట్‌కు చెందిన వాళ్లుగా తెలుస్తున్నది.

బ్యాంకు లూటీ చేసి.. ప్రజలకు పంచి..

క్రిస్మస్‌ను పురస్కరించుకొని అమెరికాలో ఓ వ్యక్తి వింత పని

వాషింగ్టన్: అమెరికాలో ఓ వ్యక్తి క్రిస్మస్‌ను పురస్కరించుకొని ప్రజలకు ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. పండుగకు రెండు రోజుల ముందు సోమవారం ఓ బ్యాంకును లూటీ చేశాడు. అనంతరం ఆ సొమ్మును ప్రజలకు పంచి క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పాడు. ఈ ఘటన సోమవారం కొలరాడోలో చోటుచేసుకుంది. డేవిడ్ వైన్ ఒలివర్ (65) అనే వ్యక్తి కొలరాడోలో ఉన్న అకాడమీ బ్యాంకులోకి చొరబడి అక్కడ ఉన్న సిబ్బందిని ఆయుధంతో బెదిరించి నగదును (డాలర్లు) దోచుకెళ్లాడు. అనంతరం కరెన్సీ నోట్లను వీధుల్లో విసిరాడు. దీంతో జనం వాటిని తీసుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఒలివర్ 'మెర్రీ క్రిస్మస్' అంటూ శుభాకాంక్షలు చెప్పాడు. అయితే దొంగతనం విషయం తెలిసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఇదే సమయంలో తాము తీసుకున్న నగదును కొంతమంది ప్రజలు బ్యాంకుకు తిరిగి ఇచ్చేశారు. కానీ ఇప్పటికీ ఇంకా వేలాది డాలర్లను కొంత మంది తిరిగి బ్యాంకుకు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

భూ సర్వే నివేదిక ఇవ్వని రెవెన్యూ యంత్రాంగం

- భూ యజమానులను సతాయిస్తున్న బీబీనగర్ సర్వేయర్
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూమిని కొలిచిన నివేదిక ఇవ్వకుండా మండల సర్వేయర్ తనను సతాయిస్తున్నాడని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మక్త అనంతారం గ్రామానికి చెందిన భూ యజమాని కొత్తోజు నర్సింహాచారి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికి రెండుసార్లు సర్వేకు దరఖాస్తు చేశానని, రెండుసార్లు సర్వేచేసిన సర్వేయర్ నివేదిక ఇవ్వకుండా సతాయిస్తున్నాడని వాపోయారు. హైదరాబాద్ శివారు బోడుప్పల్‌కు చెందిన తాను 2014లో డాక్యుమెంట్ నంబర్ 3419 ద్వారా సర్వే నంబర్ 4రు లో 30 గుంటలు, 4రూ లో 1.30 గుంటల భూమిని అన్నోజిగూడ గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డి వద్ద కొనుగోలు చేశానని తెలిపారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు తనకు భూమిని మ్యుటేషన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారన్నారు. తనకున్న భూమిని పూర్తి హద్దు లతో బందోబస్తు చేసుకో వడం కోసం 2015లో సర్వేకు దరఖాస్తు చేశానని చెప్పారు. భూమిని కొలిచిన సర్వేయర్ ఇప్పటివరకు రిపోర్ట్ ఇవ్వలే దని, తిరిగి రెండోసారి 2018లో దరఖాస్తు చేసుకొంటే సర్వేచేసి నేటికీ రిపోర్ట్ తనకు ఇవ్వలేదని వాపోయారు. ఎన్నిసార్లు అడిగినా 'నీకు అంత భూమి లేదు.. ఉన్న భూమి చెరువులో ఉన్నది' అంటూ దాటవేస్తున్నాడని, ఎలా ఉంటే అలా రిపోర్ట్ ఇవ్వమని అడిగినా సర్వేయర్ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. సరైన హద్దులులేకపోవ డంతో తన భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నా రని కొత్తోజు నర్సింహాచారి ఆందోళన వ్యక్తంచేశారు. కబ్జా దారుల నుంచి భూమిని కాపాడుకోవాలంటే సర్వే రిపోర్ట్ తప్పని సరి అని, ఎలాగైనా రిపోర్ట్ ఇప్పించాలని నర్సింహాచారి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

ధర్మగంట

బాధితుడు కొత్తోజు నర్సింహాచారి

శుక్రవారం రిపోర్ట్ ఇస్తా

మక్త అనంతారం గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 4రు, 4రూలు రెండు జిల్లాల సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ సర్వే నంబర్ల పేరిట రికార్డుల్లో ఉన్నంత భూమి వాస్తవంగా లేదు. దీంతో ఈ సర్వే నంబర్ సర్వే సెటిల్‌మెంట్ ఎర్రర్‌లో ఉన్నది. దీనిపై వాస్తవ నివేదికను జిల్లా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ సర్వేకు రెఫర్ చేస్తాం. అలాగే సర్వే నివేదిక, ఏడీకి రెఫర్ చేసిన ప్రతిని శుక్రవారం భూ యజమానికి అందజేస్తాం.

- వెంకటరెడ్డి, బీబీనగర్ తాసిల్దార్

పాస్‌పోర్ట్ ఫోర్జరీ కేసులో..

దావూద్ సన్నిహితుడిపై సీబీఐ చార్జ్‌షీట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: పాస్‌పోర్ట్ ఫోర్జరీకి పాల్పడిన కేసులో అండర్‌వరల్డ్ డాన్, అంతర్జాతీయ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీంకు అత్యంత సన్నిహితుడైన ఫారూఖ్ టక్లాపై సీబీఐ చార్జ్‌షీట్ నమోదు చేసింది. ముంబై ప్రత్యేక కోర్టులో సీబీఐ ఇటీవల ఈ చార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. 1993 ముంబై బాంబు పేలుళ్ల అనంతరం ఫోర్జరీ పాస్‌పోర్టుతోనే టక్లా దేశం దాటి వెళ్లాడని అధికారులు తెలిపారు. మహమ్మద్ ఫారూఖ్ అలియాస్ ఫారూఖ్ టక్లాను కేంద్ర భద్రతా సంస్థకు చెందిన అధికారులు మార్చి 8, 2018న ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుకున్నారు. అరెస్టు చేసిన సమయంలో ఫారూఖ్ దగ్గర ముస్తాఖ్ మహమ్మద్ మియా పేరుతో ఉన్న ఓ పాస్‌పోర్టును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముస్తాఖ్ పేరుతో చలామణీ అవుతూ.. దుబాయ్, గల్ఫ్ నగరాల్లో ఫారూఖ్ నివాసం ఏర్పరుచుకున్నాడని, 1993 ముంబై బాంబు పేలుళ్లకు పేలుడు పదార్థాలు అందించి దావూద్‌కు అతను సహకరించాడని అధికారులు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కింద యాసంగి శోభ

మొదటిపేజీ తరువాయి...

ఎకరాలకు ఎస్సారెస్పీ నుంచి నేరుగా నీటిని సరఫరా చేయనుండగా.. దిగువనఉన్న మిగిలిన ఆయకట్టుకు ఎస్సారార్ ద్వారా ఎల్ఎండీకి తరలించిన కాళేశ్వరం జలాల ద్వారానే సాగునీరు అందనున్నది. ఎస్సారెస్పీ పరిధిలో లక్ష్మికాల్వ కింద నిజామాబాద్ జిల్లాలో 36 వేల ఎకరాలు, సరస్వతీకాల్వ కింద నిర్మల్ జిల్లాలో 35,735 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాకతీయకాల్వ ద్వారా ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు, నల్లగొండ జిల్లాలోని ఆయకట్టుకు నీళ్లుపారుతాయి. ప్రాజెక్టు కింద శ్రీరాంసాగర్ నుంచి ఎల్ఎండీ వరకు 4.62 లక్షల ఎకరాలు, ఎల్ఎండీ నుంచి హుజూరాబాద్ వరకు 70 వేలు, హుజూరాబాద్ నుంచి వరంగల్ జిల్లా వర్ధన్నపేట వరకు 4.20 లక్షలు, వర్ధన్నపేట నుంచి తిరుమలగిరి వరకు 3.97 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఈసారి యాసంగిలో పూర్తి ఆయకట్టుకు నీరందనుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 1090.70 అడుగులు 88.662 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. యాసంగి పంటలకు అధికారులు 40 నుంచి 45 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఆయువుపట్టు కాళేశ్వర పథకమే..

ఎస్సారెస్పీ కింద చరిత్రలో మొదటిసారి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడానికి ప్రధాన ఆయువుపట్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. సాధారణంగా లోయర్ మానేరు డ్యాంకు శ్రీరాంసాగర్ ద్వారా గోదావరిజలాలు అందుతాయి. ఎగువ నుంచి వరద సమృద్ధిగా ఉంటే ఎస్సారెస్పీతోపాటు ఎల్ఎండీ కూడా నిండుతుంది. రెండోపంటకు నీళ్లు రావాలన్నా.. చివరకు తాగునీటి కోసమైనా ఎస్సారెస్పీలోని నిల్వలపైనే ఆధారపడాలి. ఎగువ నుంచి వరద ఒక్కసారి నిలిచిపోయిందంటే మళ్లీ ఏడాది తర్వాతగానీ ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో ఉండదు. దీంతో శ్రీరాంసాగర్ కింద ఆయకట్టును పద్నాలుగు లక్షల ఎకరాలకు నిర్దేశించినా.. ఏనాడూ నాలుగైదు లక్షలకు మించి పుష్కలంగా సాగునీరు అందిందిలేదు. కానీ, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అందుబాటులోకి రావడంతో ఎల్ఎండీ చరిత్రలో కీలక మలుపు మొదలైంది. ఎస్సారెస్పీ ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు సీఎం కేసీఆర్ ముందుగా రూపొందించిన ప్రణాళిక అమలుకు నీటిపారుదల శాఖ తాజాగా శ్రీకారం చుట్టింది. ఎల్ఎండీ ఎగువన ఉన్న ఆయకట్టు వరకు మాత్రమే ఎస్సారెస్పీ జలాలను పరిమితం చేసి, ఎల్ఎండీని కాళేశ్వరం ప్రాజెక్టుతో లింకుచేశారు. దీంతో ఎల్ఎండీ దిగువన ఉన్న ఆయకట్టుకు అవసరమైనపుడల్లా కాళేశ్వరజలాలను తరలించనున్నారు. దీనిద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పెద్దభారం తగ్గినట్టయింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలో సుమారు 88 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్టుపై ఆధారపడిన లిఫ్టులతోపాటు ఎల్ఎండీ ఎగువన ఉన్న 4,62,920 ఎకరాలకు పుష్కలంగా సాగునీరందించేందుకు 29 టీఎంసీల వరకు సరిపోతాయి. ఆవిరినష్టాలు కూడా పోను 57-58 టీఎంసీలు యాసంగి ముగిసినా నిల్వ ఉంటాయి. వేసవిలో తాగునీటి అవసరాలకు కూడా పుష్కలంగా వినియోగించుకోగా.. వచ్చే ఏడాది వానకాలం పంటలకు నిర్ణీత సమయంలోనే సాగునీటిని విడుదల చేసేందుకు కూడా మార్గం సుగమమవుతుంది.

రెండోసారీ కాళేశ్వర జలాలతోనే..

ఎల్ఎండీ దిగువన ఎస్సారెస్పీ మొదటి ఫేజ్ కింద 5,05,720 ఎకరాలకు నీళ్లందించేందుకు 33 టీఎంసీలు అవసరమవుతాయి. రెండోఫేజ్ కింద 3,98,949 ఎకరాలు ఉండగా.. 2.50 లక్షల ఎకరాలకు యాసంగి సాగునీరు ఇవ్వనున్నట్టు అధికారులు ప్రకటించారు. దీనికి 16-20 టీఎంసీలు అవసరం. రెండుదశలు కలిపి యాభైటీఎంసీలకు పైగా అవసరం పడుతాయి. అయితే లోయర్ మానేరు డ్యాం పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 24.07 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 23.08 టీఎంసీల నిల్వ ఉన్నది. ఇవికూడా ఎల్లంపల్లి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం ద్వారా తరలించిన నీళ్లే. యాసంగి ప్రణాళిక అమలు కోసం జలాశయం పూర్తిస్థాయి నిల్వకంటే రెట్టింపు నీటి పరిమాణం అవసరం. అందుకే ఎప్పటికప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎల్ఎండీని నింపేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎస్సారెస్పీతో సంబంధం లేకుండా కాళేశ్వరం జలాలతోనే ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు నీళ్లందనున్నాయి. ఇలా శ్రీరాంసాగర్ పరిధిలో 13.49 లక్షల ఎకరాలకు పక్కాగా సాగునీరు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎల్ఎండీ నుంచి దిగువన ఉన్న 300 చెరువులను 18 టీఎంసీలతో నింపిన అధికారులు.. మళ్లీ నింపేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు: సీఈ శంకర్

సీఎం కేసీఆర్ సూచనల మేరకు ఎస్సారెస్పీ పరిధిలో యాసంగికి సమృద్ధిగా సాగునీరందించేందుకు ప్రణాళిక అమలుచేస్తున్నామని ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ తెలిపారు. ఎల్ఎండీ ఎగువన శ్రీరాంసాగర్ నిల్వలు, దిగువన అవసరాలకు కాళేశ్వరం జలాలు ఉన్నందున.. చివరి భూముల వరకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని చెప్పారు. సాగునీటి సరఫరా సాఫీగా కొనసాగేందుకు రైతులు కూడా అధికారులతో సహకరించాలని కోరారు.

తుఫాన్ బీభత్సానికి నేలకొరిగిన కొబ్బరిచెట్లు

ఫాన్‌ఫాన్ బీభత్సం

ఫిలిప్పీన్స్‌లో హరించుకుపోయిన క్రిస్మస్ పండుగ సంతోషం

మనీలా: ఫిలిప్పీన్స్‌లో ఫాన్‌ఫాన్ తుఫాన్ బీభత్సం సృష్టించింది. భారీ గాలులతో కూడిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. పలు ద్వీపాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని చోట్ల చెట్లు కూలి ఇండ్లు ధ్వంసమయ్యాయి. నిరాశ్రయులైన సుమారు 16 వేల మంది ప్రజలు మంగళవారం రాత్రంతా సహాయక శిబిరాల్లో తలదాచుకున్నారు. క్యాథలిక్ దేశమైన ఫిలిప్పీన్స్‌లో బుధవారం నాటి క్రిస్మస్ పండుగ సంతోషాన్ని తుఫాన్ హరించివేసింది. పండుగ సందడి లేక పలు హోటళ్లు బోసిపోయాయి. ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే సామూహిక రాత్రి భోజనం కార్యక్రమం 'నోచే బ్యూనా' వెలవెలబోయింది. తుఫాన్ కారణంగా ఆరుగురు గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. సెలవుల నేపథ్యంలో విహార ప్రాంతాలకు వెళ్లిన లక్షలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. ఫిలిప్పీన్స్‌లో 2013లో సంభవించిన హైయాన్ తుఫాన్ కారణంగా 7,300 మందికిపైగా మరణించారు, గల్లంతయ్యారు.

నయాసాల్.. నయా జోష్

మొదటిపేజీ తరువాయి...

తెలిపాయి. దుబాయికి అయితే బుకింగ్‌లు ఇప్పటికే నిలిపివేశారు. పెరుగుదల 20 శాతం పైమాటే ఉన్నది. రియల్టర్లు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్తున్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు కూడా రావడంతో కార్యకర్తలను కూడా తమ ఖర్చులతో టూర్‌కు తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు.

విదేశాల్లో వేడుకలపై మోజు

కొత్త సంవత్సర వేడుకల్లో దూరప్రాంతాలకు వెళ్లాలన్న ఆసక్తి పెరుగుతున్నదని, సాధారణ రోజుల్లో కంటే పండుగరోజుల్లో, న్యూ ఇయర్ వేడుకల సందర్భంలో ఇది ఎక్కువగా ఉంటున్నదని క్లియర్ ట్రిప్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాలు రామచంద్రన్ చెప్పారు. 'అంతర్జాతీయ ప్రయాణాలను పరిశీలిస్తే.. యూరోప్‌కు వెళ్లడానికి చాలామంది మొగ్గుచూపుతున్నారన్నారు. థాయిలాండ్, సింగపూర్, ఇండోనేషియా, మలేషియా, వియత్నాం, మాల్దీవులు, యునైటెడ్ కింగ్‌డమ్‌కు ఎక్కువ టికెట్లు బుక్ అవుతున్నాయి. అన్నింటికంటే యూఏఈ బుకింగ్‌లు అధికంగా ఉంటున్నాయి' అని తెలిపారు. ప్రపంచంలో ఎక్కువ మంది ఇష్టపడే ప్రాంతంగా దుబాయ్ తేలింది. దీంతోపాటు డొమెస్టిక్ జర్నీల్లో గోవా, కేరళ, రాజస్థాన్, జైపూర్‌లను ఎంపికచేసుకుంటున్నారని బాలురామచంద్రన్ వివరించారు.

రైళ్లలోనూ 14 శాతం అదనం

కొత్త సంవత్సరం సందర్భంగా సాధారణ రోజులతో పోలిస్తే రైళ్లలోనూ 14 శాతం అదనంగా ప్రయాణాలు సాగుతున్నట్లు 'కన్‌ఫాంటికెట్.ఆన్‌లైన్ ట్రైన్ టికెట్ డిస్కవరీ అండ్ బుకింగ్ ఇంజిన్' ఫౌండర్ శ్రీపాద వైద్య చెప్తున్నారు. ఎక్కువమంది మెట్రో నగరాల నుంచి టైర్-2 సిటీలకు వెళ్తున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడి వాళ్లు సొంత ప్రాంతాలకు వెళ్లేందుకూ ఇష్టపడుతున్నారు. తిరుపతికి కూడా అధిక సంఖ్యలోనే వెళ్తున్నారు. విశాఖపట్నం, చెన్నై, విజయవాడ, యశ్వంత్‌పూర్, గుంటూరు, పుణె, రాజమండ్రి, బెంగళూరు, నెల్లూరు, కొట్టాయం, నిజాముద్దీన్, నాగ్‌పూర్, భువనేశ్వర్, భద్రాచలం, కాకినాడ, హౌరా, నర్సాపూర్, సిమ్లా, చెంగనూరు, మైసూరు వంటి ప్రాంతాలకు అత్యధికంగా వెళ్తున్నట్లు వివరించారు.

డిస్కౌంట్ల మేళా

న్యూఇయర్ సందర్భంగా పలు విమానయాన సంస్థలు భారీ డిస్కౌంట్ ఆఫర్లతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రూ.899 కే దేశీయ రూట్లలో టికెట్‌ను అందించేందుకు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్(ఇండిగో) 'ది బిగ్ ఫ్యాట్ ఇండిగో సేల్' పేరిట ఆఫర్లను ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఏప్రిల్ 15 వరకు జరిగే ప్రయాణాలపైనా ఆఫర్లను కుమ్మరించింది. విదేశీ ప్రయాణానికి ప్రారంభ టికెట్ ధర కేవలం రూ.2,999 గా ప్రకటించింది. ఇండిగో వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా బుకింగ్ చేసుకుంటే కన్వీనియన్స్ చార్జీలు కూడా లేవని తెలిపింది. మిగతా సంస్థలు ఇండిగో మార్గంలోనే వివిధ రూపాల్లో విమానయాన ప్రయాణాల్లో డిస్కౌంట్లు ఇస్తున్నాయి. దాంతో మధ్యతరగతి ప్రజలు విమానయానంపై ఆసక్తిచూపుతున్నారు.

క్రెడిట్ కార్డు పేమెంట్లే ఎక్కువ

కొత్త ఏడాది టూర్లకు బుకింగ్‌ల్లో అధికశాతం క్రెడిట్‌కార్డులపైనే జరుగుతున్నట్లు క్లియర్ ట్రిప్ సంస్థ పేర్కొన్నది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ బుకింగ్‌లలో అత్యధికం క్రెడిట్ కార్డు పేమెంట్లే నని తేలింది. మొబైల్ ద్వారా 49%డొమెస్టిక్ బుకింగ్‌లు, 44% ఇంటర్నేషనల్ బుకింగ్‌లు ఉన్నాయి. ట్రావెల్ ఏజెంట్లతో సంబంధం లేకుండా అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతున్నాయి.

దుబాయ్‌లో పార్టీ

కొత్త సంవత్సరం పార్టీలను దుబాయ్‌లో పలు సంస్థలు, కంపెనీలు వినూత్నంగా నిర్వహించడానికి ఏర్పాట్లుచేస్తున్నాయి. అనేక ఈవెంట్లను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నాయి. వాటికి తగ్గట్లే రేట్లు కూడా ఉంటున్నాయి. దుబాయ్ ఒపేరాలో డిన్నర్ చేయడానికి ప్రవేశ రుసుమును రూ.5 వేల నుంచి రూ.35 వేలుగా నిర్ణయించారు. అట్లాంటిస్ ది పామ్‌లెవో రాయల్ గాలా డిన్నర్ పేరిట అతి పెద్ద ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఎమిరేట్స్ గోల్ఫ్‌క్లబ్‌లోనూ కింగ్ ఆఫ్ రాక్, ది క్వీన్ ఆఫ్ పాప్ పేరిట పార్టీని నిర్వహిస్తున్నారు. బీచ్‌లో ఎంజాయ్ చేయడానికి మెడియేటివ్ ఫన్ 2020 పేరిట వినూత్న కార్యక్రమాన్ని యోగాతో ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. ఈ పార్టీల్లో పాల్గొనడానికి హైదరాబాద్ నుంచి వేలమంది వెళ్తున్నారు.

హైదరాబాద్‌కూ జై

దేశీయ పర్యాటకులు ఈ ఏడాది హైదరాబాద్‌కు జై కొట్టినట్లు బుకింగ్ డాట్‌కామ్ సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల్లో దుబాయ్ అగ్రస్థానంలో నిలువగా, దేశీయ పర్యాటకాల్లో హైదరాబాద్‌దే మొదటి స్థానం. ఆ తర్వాత పుణె, జైపూర్, కొచ్చి, మైసూర్ నిలిచాయి. భారతీయ పర్యాటకులు మాత్రం అంతర్జాతీయ సందర్శన నగరాల్లో దుబాయ్, బ్యాంకాక్, సింగపూర్, లండన్‌లను ఎంచుకొన్నారు. గ్లోబల్ సిటీగా వేగంగా ఎదుగుతున్న మహానగరంలో ప్రతిరోజూ ఏదో ఒకచోట జాతీయ, అంతర్జాతీయస్థాయి సదస్సులు, వర్క్‌షాపులు జరుగుతుండటం.. జాతీయ అంతర్జాతీయ ప్రముఖులు వచ్చివెళ్తుండటంతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా అంతర్జాతీయ వేదికలను ఏర్పాటు చేస్తుండటంతో హైదరాబాద్ ప్రతిష్ఠ మరింత ఇనుమడిస్తున్నది.

ఆలయాల మూసివేత

వేములవాడ ఆలయ ప్రధాన ద్వారాన్ని మూసివేసిన అర్చకులు, అధికారులు

నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: సూర్యగ్రహణం సందర్భంగా రాష్ట్రంలోని పలు దేవాలయాలను బుధవారం రాత్రి మూసివేశారు. గురువారం మధ్యాహ్నం సంప్రోక్షణ అనంతరం ఆలయాలను తిరిగి తెరిచి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం మూసివేశామని.. సంప్రోక్షణ అనంతరం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు దర్శనం కల్పిస్తామని ఈవో గీత తెలిపారు. భద్రాద్రి ఆలయంలో గురువారం సాయంత్రం 3.30 గంటల నుంచి దర్శనాలకు అవకాశం కల్పించనున్నారు. నిర్మల్ జిల్లాలోని బాసర సరస్వతి ఆలయాన్ని సంప్రోక్షణ అనంతరం గురువారం ఉదయం 11.30 గంటలకు తెరువనున్నారు. వేములవాడ రాజన్న దేవస్థానాన్ని గురువారం ఉదయం 11:20 గంటలకు తెరవనున్నట్టు స్థానాచార్యులు తెలిపారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి, ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయాలను బుధవారం రాత్రి 7.30 గంటలకు మూసేశారు. గురువారం మధ్యాహ్నం 1.30గంటలకు తిరుమంజనం, సంప్రోక్షణ అనంతరం భక్తులకు సర్వదర్శనం ప్రారంభించనున్నారు.


భద్రాద్రి రామాలయం ద్వారాన్ని మూసివేస్తున్న పూజారులు

లక్నవరం పర్యాటకప్రాంతం పర్యాటకులతో కోలాహలంగా మారింది. బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరాన్ని సందర్శించుకొనేందుకు పర్యాటకులు భారీసంఖ్యలో తరలివచ్చారు. లక్నవరం చెరువు అందాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. వేలాడే వంతెన, బోట్, వాటర్ బెలున్‌లలో పర్యాటకులు ఉత్సాహంగా గడిపారు. - గోవిందరావుపేట(ములుగు)

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబురాలు

భక్తులతో కిటకిటలాడిన చర్చిలు
క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

సికింద్రాబాద్ సెయింట్ మేరీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

మెదక్ క్యాథడ్రల్ చర్చి ఎదుట భక్తజన సందోహం (ఇన్‌సెట్‌లో) చర్చిలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే చర్చిల వద్దకు వచ్చిన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ క్యాథడ్రల్, సికింద్రాబాద్‌లోని వెస్లీతోపాటు రాష్ట్రంలోని అన్ని చర్చిలు క్రైస్తవులతో కిక్కిరిసిపోయాయి. ఆయా జిల్లాల్లో చర్చిలకు వెళ్లిన మంత్రులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 4.30కు మెదక్ కేథడ్రల్ చర్చిలో శిలువ ఊరేగింపుతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా మెదక్ డయాసిస్ అధ్యక్ష మండల బిషప్ రెవరెండ్ రైట్ ఏసీ సాలమాన్‌రాజ్ హాజరై భక్తులకు వాక్యోపదేశం చేశారు. హైదరాబాద్‌లోని ఆంధ్రక్రైస్తవ దైవజ్ఞ కళాశాల నుంచి 12 మంది గురువులు హాజరై భక్తులకు దీవెనలు అందజేశారు. వేడుకలకు హాజరైన ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఏసు ప్రభువు దీవెనలతో సీఎం కేసీఆర్ న్యాయకత్వంలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని.. రాష్ట్రప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, సిద్దిపేట, మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్లు రోజాశర్మ, లావణ్యరెడ్డి తదితరులతో కలిసి మంత్రి హాజరయ్యారు. అనంతరం సిద్దిపేట సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేటలో రూ.40 లక్షలతో క్రిస్టియన్ భవన్ నిర్మిస్తున్నామని, సీఎస్ఐ చర్చి ఆవరణలో రూ.50 లక్షలతో ఫంక్షన్‌హాల్‌ను నిర్మిస్తామని ప్రకటించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంబీ ఒలివా చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవుల సంక్షేమం, అభివృద్ధి కోసం టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ క్లాక్ టవర్ సమీపంలో ఉన్న వెస్లీ చర్చిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం చర్చి కాంపౌండ్ సీఎస్ఐ చర్చి, ఎన్ఎస్పీ హోలిట్రినిటి చర్చిలో రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహబూబ్‌నగర్ ఎంబీ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. క్రైస్తవులతో కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. పోరాడి సాధించిన తెలంగాణలో ఆరేండ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మత సామరస్యంతో కూడిన శాంతియుత పాలన కొనసాగుతున్నదని.. రాష్ట్రంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని, అందరి పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి(సీబీసీ)లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌తో కలిసి చర్చిలో ప్రార్థనలు చేశారు.

బాలుర సదనం క్రిస్మస్ వేడుకల్లో హిమాన్ను

సైదాబాద్‌లోని బాలుర సదనం(జువైనల్‌హోం)లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్ను పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి వారికి తినిపించారు. చిన్నారులకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హిమాన్ను మాట్లాడుతూ.. మీ అందరి మధ్య క్రిస్మస్ వేడుకలు జరుపుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సుమారు 45 నిమిషాలపైగా చిన్నారులతో ఉన్నా zరు. ఈ సందర్భంగా చిన్నారులు హిమాన్షుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జువైనల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ఇంచార్జీ డైరెక్టర్ బీ శైలజ, బాలుర సదనాల పర్యవేక్షణాధికార్లు లక్ష్మీరాజ్యం, నీలకంఠధర్, నాగేశ్వర్‌రావు, ఐసీవో రాజు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా రంగంపేటలోని మదనానంద ఆశ్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సీఎం కేసీఆర్ కృషితో జీవనదిగా మంజీరా

మంత్రి హరీశ్‌రావు

కొల్చారం: సీఎం కేసీఆర్ కృషితో కాళేశ్వరం నీళ్లతో మంజీరానది జీవనదిగా మారబోతున్నదని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని మదనానంద ఆశ్రమంలో జరుగుతున్న కృష్ణానంద ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతారెడ్డితో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో పేరొందిన ఏకైక పీఠం మదనానంద స్వామివారి పీఠమని చెప్పారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన తొలి పీఠాధిపతి మదనానంద స్వామి అని గుర్తుచేశారు. ఆశ్రమంలో వేదవిద్య పూర్తిచేసుకున్న 25 మంది విద్యార్థులకు మంత్రి విజయపత్రాలను అందజేశారు.

జనగామ జిల్లా పాలకుర్తిలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రైతు సమన్వయ సమితులకు అధికారాలు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్ \ కొడకండ్ల: రాబోయే రోజుల్లో రైతు సమన్వయ సమితులకు విశేష అధికారాలు కల్పిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి, కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతును రాజును చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సాగునీరు, నిరంతర విద్యుత్, మద్దతు ధర ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రపంచం మొత్తం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తుంటే కాంగ్రెస్ మాత్రం దానిని అడ్డుకోవడానికి చేయని ప్రయత్నం లేదన్నారు. రూ.13 వేల కోట్లతో రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఇంత పెద్ద మొత్తంలో గతంలో ఏ ప్రభుత్వం కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు. గోదావరి జలాలతో పాలకుర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని చెప్పారు. అనంతరం పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముస్కు రాంబాబు, కొడకండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పేరం రాముతో ప్రమాణస్వీకారం చేయించారు.

నిరంతరాయంగా ఎత్తిపోతలు

ఎస్సారార్‌కు తరలుతున్న
గోదావరి జలాలు

కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంపుహౌస్‌లోని రెండు పంపుల ద్వారా ఎగిసిపడుతున్న జలాలు

రామడుగు /ధర్మారం/బోయినపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ -2లోని నంది, గాయత్రి పంప్‌హౌసుల్లో గోదారి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఈ నెల 5 నుంచి సోమవారం వరకు 21 రోజుల్లో 13.239 టీఎంసీలు ఎత్తిపోశాయి. ఎల్లంపల్లి జలాశయం నుంచి పెద్దపల్లి ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌కు వచ్చిన జలాలు మూడు మోటర్ల ద్వారా నంది రిజర్వాయర్‌కు చేరుతున్నాయి. ఇక్కడి నుంచి జంటసొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడ బుధవారం 1,2,7వ మోటర్లు నీటిని ఎత్తిపోస్తుండగా గ్రావి టీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడినుంచి ఎస్సారార్ వైపుకు వెళ్తున్నాయి.

ఎస్ఆర్ఆర్@ 23.344 టీఎంసీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో ఉన్న శ్రీరాజరాజేశ్వర జలాశయంలో 23.344 టీఎంసీల నీరు నిలువ ఉన్నదని ఈఈ అశోక్‌కుమార్ చెప్పారు. వరద కాల్వ ద్వారా 10,700 క్యూసెక్కుల నీరు వస్తున్నదని తెలిపారు.

కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌కు..

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి(కన్నెపల్లి) పంప్‌హౌస్‌లోని 2 మోటర్ల ద్వారా 4,600 క్యూసెక్కుల నీరు అన్నారం బరాజ్‌కు నీరు తరలుతున్నది. అన్నారం బరాజ్‌లో 10.87 టీఎంసీలకు ప్రస్తుతం 7.05 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికార్లు తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా తానంచర్లలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

సాగునీటితోనే పూర్వ వైభవం

మంత్రి సత్యవతి రాథోడ్

మరిపెడ నమస్తే తెలంగాణ: సాగునీటితోనే పల్లెలకు పూర్వ వైభవం వస్తుందని గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల పెద్ద చెరువులోకి ఎస్సారెస్పీ ఉపకాల్వలో నీటిప్రవాహాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరుస కరువుతో తానంచర్ల, బుర్హన్‌పురం, తాళ్లూకల్, రాంపురం గ్రామాల రైతులు అల్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దయతో కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేసుకొని ఎస్సారెస్పీ కాలువల ద్వారా గోదావరి జలాలను తీసుకరావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుడు కుర్ర తిరుపతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల

అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ లక్ష్యం

మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా బీజేపీ నాయకులు పని చేస్తున్నారని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ కుర్ర తిరుపతి బుధవారం టీఆర్ఎస్‌లో చేరగా మంత్రి కండువా కప్పి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావుతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంటే అడ్డుకునేందుకు బీజేపీ నాయకులు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. స్మార్ట్ సిటీ పనులను అడ్డుకునేందుకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రధానితో పాటు కేంద్ర మంత్రులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్ బొమ్మతోనే ప్రచారానికి వెళ్లి, పురపాలికలపై గులాబీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

మహబూబ్‌నగర్‌లో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి, ఎంపీ

కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ: కష్టపడి పని చేసేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు , అభివృద్ధిని చూసే వివిధ పార్టీలకార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ నేత, మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, అప్పన్నపల్లికి చెందిన 200 మంది బీజేపీ కార్యకర్తలు మంత్రి, ఎంపీ సమక్షంలో టీఆర్ఎస్‌ల చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాట్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ ఇసాక్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఏన్కూర్ ఎంపీడీవో సరెండర్

వరప్రసాద్

మామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండలం ఎంపీడీవో గంటా వరప్రసాద్‌ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు సరెండర్ చేస్తూ జెడ్పీ సీఈవో ప్రియాంక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పల్లెప్రగతి ప్రణాళిక పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆర్వీ కర్ణన్ విచారణ చేపట్టారు. పూర్తి నివేదికను పరిశీలించిన కలెక్టర్ వెంటనే ఎంపీడీవోను సరెండర్ చేయాలని జెడ్పీ సీఈవోకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సీఈవో ఎంపీడీవోను పీఆర్ కమిషనర్‌కు సరెండర్ చేశారు.

వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట కమ్యునిటీ హెల్త్‌సెంటర్‌లో మంగళవారం ఒకేరోజు వైద్యులు 10 సాధారణ ప్రసవాలుచేశారు. గర్భిణులకు నెలవారీగా పరీక్షలు చేయడంతోపాటు సాధారణ ప్రసవాలు చేస్తున్నట్టు దవాఖాన సూపరింటెండెంట్ నరసింహస్వామి తెలిపారు. చిన్నారులు, తల్లులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని నరసింహస్వామి పేర్కొన్నారు. - వర్ధన్నపేట, నమస్తే తెలంగాణ

అదృశ్యమైన తల్లి, కూతురు దుర్మరణం

సంగారెడ్డి జిల్లా సైదాపూర్‌లో ఘటన

కొండాపూర్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం సైదాపూర్‌లో గత సోమవారం అదృశ్యమైన తల్లి, కూతురు అనుమానస్పద స్థితిలో మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదాపూర్‌కు చెందిన మద్దికుంట జయశీల (30), ఆమె కూతురు దుర్గమ్మ అలియాస్ సిరి (4) సోమవారం నుంచి కనిపించకుండా పోయారు. బుధవారం సైదాపూర్ శివారులోని ఓ కందిచేనులో వారు విగతజీవులుగా పడిఉండటాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. క్రిస్మస్ పండుగపూట ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. జయశీల భర్త బాలయ్యే వీరిద్దరిని చంపి ఉంటాడని ఆమె తండ్రి లచ్చయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

మిర్యాలగూడ రూరల్ ఎస్సై సస్పెన్షన్

నల్లగొండ సిటీ: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ ఎస్సై సైదాబాబును సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ రేంజ్ డీఐజీ శివశంకర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సైదాబాబు అవినీతికి పాల్పడుతున్నాడని.. ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఇసుక అక్రమ రవాణా వంటి ఘటనల్లోనూ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు రాగా.. ఎస్పీ రంగనాథ్ విచారణ చేసి నివేదికను అందించారు. ఈ మేరకు ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం			
			రంగారెడ్డి	18.0	29.0
			సూర్యాపేట	18.0	29.0
			భద్రాద్రి కొత్తగూడెం	18.0	30.0
సంగారెడ్డి	10.4	32.1	జనగామ	18.1	27.0
వికారాబాద్	14.6	33.1	కామారెడ్డి	19.0	26.0
నల్లగొండ	15.0	29.8	ములుగు	19.0	27.0
మెదక్	15.7	32.6	రాజన్న సిరిసిల్ల	19.0	29.0
వరంగల్ రూరల్	16.0	28.0	జయశంకర్ భూపాలపల్లి	19.0	29.0
నిర్మల్	16.0	29.0	ఖమ్మం	19.0	31.0
సిద్దిపేట	16.4	32.6	హైదరాబాద్	19.4	28.2
మంచిర్యాల	16.6	31.8	మేడ్చల్	19.4	28.2
నాగర్‌కర్నూల్	17.0	29.0	జోగులాంబ గద్వాల	19.5	32.1
కరీంనగర్	17.1	32.5	పెద్దపల్లి	20.0	29.0
వనపర్తి	17.5	33.5	నిజామాబాద్	20.4	30.7
ఆదిలాబాద్	17.6	29.3	మహబూబ్‌నగర్	20.5	30.8
యాదాద్రి భువనగిరి	18.0	28.0	నారాయణపేట	20.5	30.8
మహబూబాబాద్	18.0	28.0	కుమ్రంభీం ఆసిఫాబాద్	21.0	27.0
వరంగల్ అర్బన్	18.0	29.0	జగిత్యాల	21.0	28.0

epaper.ntnews.com

టీటీలో మేటి దిశగా..

భారత టేబుల్ టెన్నిస్(టీటీ) చరిత్రలో ఈ ఏడాది ప్రత్యేకంగా నిలిచిపోతుంది. సీనియర్ ప్లేయర్ శరత్ కమల్ 15ఏండ్లుగా ఒంటరిగా ముఖ్యమైన అంతర్జాతీయ వేదికలపై సత్తాచాటుతుండగా.. మరో ఆటగాడు అనూహ్యరీతిలో ఆటను మెరుగుపరుచుకొని ర్యాంకింగ్స్‌లో అతడిని దాటేశాడు. మెరుగైన ర్యాంకుల్లో ఉన్న ఆటగాళ్లను చిత్తుచేసి నేనున్నానంటూ దూసుకొచ్చాడు. అతడే సాతియాన్ జ్ఞానశేఖరన్. ఈ ఏడాది అద్భుత విజయాలతో భారత అగ్రశ్రేణి ఆటగాడిగా అవతరించిన అతడు భవిష్యత్తుపై కొండంత ఆశలు రేపాడు. ఈ ఏడాదిని పూర్తిస్థాయి కోచ్ లేకుండానే ముగించిన భారత టీటీ బృందం మొత్తంగా మంచి ప్రదర్శనే చేసినా... మహిళా ప్యాడ్లర్లు కాస్త వెనుకబడ్డట్టు కనిపించారు. మరోవైపు తెలంగాణ యువ కెరటాలు ఫిడేల్ రఫీక్ స్నేహిత్, ఆకుల శ్రీజ, నైనా జైస్వాల్ జాతీయ స్థాయిలో అద్భుతమైన ఆటతీరు కనబరిచి, అంతర్జాతీయ టోర్నీల్లో సత్తాచాటేందుకు సిద్ధమయ్యారు.



మనికా

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

టేబుల్ టెన్నిస్ క్రమంగా భారత క్రీడాభిమానులకు దగ్గరవుతున్నది. ఈ ఏడాది మన స్టార్ ప్యాడ్లర్లు మంచి ప్రదర్శన చేసి భవిష్యత్తుకు భరోసా ఇచ్చారు. 2019లో సాతియాన్ జ్ఞానశేఖరన్ సంచలనాత్మక ప్రదర్శనలతో భారత అగ్రశ్రేణి ప్యాడ్లర్‌గా ఎదిగాడు. మెరుగైన ర్యాంకుల్లో ఉన్న ప్లేయర్లకు చెమటలు పట్టించి.. తన సత్తా ప్రపంచానికి చాటాడు. కోచ్ లేకుండానే ఏడాదంతా చెమటోడ్చిన మన ప్యాడ్లర్లు వచ్చే ఏడాది విశ్వక్రీడల్లో చోటే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. తొలిసారిగా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టిన టేబుల్ టెన్నిస్ టీమ్ విభాగంలో ప్లేస్ కోసం క్వాలిఫయర్స్‌లో తలపడేందుకు భారత పురుషుల జట్టు సమాయత్తమవుతున్నది.

ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు సిద్ధం

గతేడాది ఆసియా క్రీడల్లో శరత్ కమల్, సాతియాన్, హర్మీత్ దేశాయ్‌లతో కూడిన భారత జట్టు కాంస్యం సాధించి చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో 2020 టోక్యో ఒలింపిక్స్ టీమ్‌విభాగంలో క్వాలిఫయర్స్‌కు మన జట్టు అర్హత సాధించింది. వచ్చే నెల 22 నుంచి పోర్చుగల్‌లో జరిగే అర్హత పోటీల్లో సత్తా చాటాలని భారత ప్యాడ్లర్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎనిమిదో ర్యాంకులో ఉన్న భారత జట్టు టోక్యో విశ్వక్రీడల్లో ప్రవేశించాలంటే క్వాలిఫయర్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాల్సి రావడంతో ఎలాగైనా రాణించాలని పట్టుదలగా ఉంది. అంచనాలకు తగ్గట్టుగా అదరగొడితే విశ్వక్రీడల్లో తొలిసారిగా ప్రవేశపెట్టిన టేబుల్ టెన్నిస్ టీమ్‌విభాగంలో మన ప్యాడ్లర్లు అడుగుపెట్టడం ఖాయమే.

మనికా నిరాశ

టేబుల్ టెన్నిస్‌లో పురుషుల బృందం ఈ ఏడాది అదరగొడితే మహిళల జట్టు కాస్త వెనుకబడింది. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో నాలుగు పతకాలతో అద్భుత ప్రదర్శన చేసిన మనికా బాత్రా ఈ ఏడాది తీవ్రంగా నిరాశపరిచింది. పేలవ ప్రదర్శనలతో 61వ ర్యాంకుకు పడిపోయింది. చిన్ననాటి కోచ్ సందీప్ గుప్తాతో విభేదాల కారణంగా ఆయన నుంచి వేరుపడడం కూడా మనికా ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపింది. అయితే ఇటీవలే ఢిల్లీ నుంచి పుణెకు శిక్షణా స్థానాన్ని మార్చిన మనికా టాప్-50లోకి తిరిగి ప్రవేశించాలని తీవ్రంగా కృషి చేస్తున్నది.

కోచ్ లేకుండానే..

భారత ప్యాడ్లర్లు ఈ ఏడాది ఎదుర్కొన్న ప్రధానమైన సమస్య కోచ్ కొరత. గత 16నెలలుగా భారత టేబుల్ టెన్నిస్‌కు పూర్తిస్థాయి కోచ్ లేరు. మిసిమో కోస్టాన్‌టినీ దిశానిర్దేశంలో 2018 కామన్వెల్త్ క్రీడల్లో ఎనిమిది పతకాలను మన ప్యాడ్లర్లు సాధించారు. అయితే గతేడాది ఆసియా క్రీడల తర్వాత మిసిమో బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్త కోచ్‌గా ఎవరూ బాధ్యతలు చేపట్టలేదు. డీజన్ పాపిక్‌ను కొత్త విదేశీ కోచ్‌గా జులైలో ఎంపిక చేసినా శస్త్రచికిత్స కారణంగా అతడు బాధ్యతలు తీసుకోలేదు. దీంతో జాతీయ శిక్షణ శిబిరాలు నిర్వహించకపోవడంతో ప్యాడ్లర్లు వ్యక్తిగతంగా ఎవరికి వారు ఇప్పటి వరకు శిక్షణ తీసుకుంటున్నారు. అయితే వచ్చే ఏడాది టీమ్ క్వాలిఫికేషన్ పోటీలు ఉండడంతో కోచ్ ఉంటే బాగుండేదని సీనియర్ ప్లేయర్ శరత్ కమల్ సైతం అభిప్రాయపడ్డాడు. 'ముఖ్యమైన టీమ్ పోటీలు జరిగే ముందు తప్పకుండా కలిసి ప్రాక్టీస్ చేయాలి. వ్యక్తిగతంగా అందరూ బాగానే ఆడుతున్నారు. కానీ కోచ్ లేకపోవడం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య(టీటీఎఫ్ఐ) కూడా మంచి కోచ్ కోసం వెతుకుతున్నది' అని శరత్ అన్నాడు. అలాగే సీనియర్‌గా జట్టుకు మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పాడు.

సాతియాన్ షో..

దశాబ్ద కాలానికి పైగా సీనియర్ ఆటగాడు ఏ శరత్ కమల్ అంతర్జాతీయ వేదికలపై భారత తరపున సత్తాచాటుతుండగా.. ఈ ఏడాది యువ ప్యాడ్లర్ సాతియాన్ నేనున్నానంటూ దూసుకొచ్చాడు. ఆటను రోజురోజుకూ మెరుగుపరుచుకుంటూ అంతర్జాతీయ వేదికలపై మెరిశాడు. ఈ ఏడాదిలో ప్రపంచ నంబర్ ఐదో ర్యాంకు ఆటగాడు హరిమోటో తొమోకాజుకు షాకివ్వడం సహా పలువురు టాప్-20లో ఉన్న ప్లేయర్లను చిత్తుచేశాడు. అలాగే ఈఏడాది జులై 24న ప్రకటించిన ఐటీటీఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-25లోకి ప్రవేశించి.. ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం 30వ ర్యాంకులో కొనసాగుతున్న సాతియాన్.. సీనియర్ శరత్ కమల్ కన్నా నాలుగు ర్యాంకులు పైనే ఉన్నాడు. అలాగే తొలిసారిగా నిర్వహించిన ఆసియాకప్‌లో ఆరోస్థానంలో నిలిచి ప్రపంచకప్‌నకు అర్హత సాధించాడు.

> ఈ సంవత్సరం సంతృప్తికరంగా సాగింది. నా కన్నా మెరుగైన ర్యాంకుల్లో ఉన్న కొందరిని ఓడించా. టాప్-10లోని ప్లేయర్లను ఓడించడమే నా తర్వాతి ఏడాది లక్ష్యం. జట్టుగానూ బాగా ఆడుతున్నాం. ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ లోనూ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతాం.
>
> - సాతియాన్

తెలంగాణ యువ కెరటాలు

తెలంగాణ యువ ప్యాడ్లర్లు ఈ ఏడాది సత్తాచాటి భారత టేబుల్ టెన్నిస్ భవిష్యత్తుకు భరోసానిచ్చారు. ఆకుల శ్రీజ సీనియర్ విభాగంలో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంటే.. యువ ప్యాడ్లర్ ఫిడేల్ ఆర్ స్నేహిత్ జాతీయ యూత్ టోర్నీలో విజేతగా నిలిచాడు. నైనా జైస్వాల్ సైతం రాణించింది. ఈ ఏడాది యూత్ టేబుల్ టెన్నిస్‌లో జాతీయ చాంపియన్‌గా నిలిచిన స్నేహిత్ అంతర్జాతీయ టోర్నీల్లో అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. వచ్చే ఏడాది హైదరాబాద్ వేదికగా జరిగే టీటీ చాంపియన్‌షిప్ ద్వారా సీనియర్ విభాగంలోకి అడుగుపెట్టనున్న అతడు.. అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించడమే తన లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్పష్టం చేశాడు. ఆకుల శ్రీజ యూటీటీ నేషనల్ ర్యాంకింగ్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్(నార్త్‌జోన్) టోర్నీ విజేతగా నిలిచి, సీనియర్ విభాగంలో తొలి టైటిల్‌తో సత్తాచాటి మంచి ఫామ్‌లో ఉంది. ఇటీవల నేపాల్‌లో జరిగిన దక్షిణాసియా గేమ్స్ లోనూ రెండు స్వర్ణ పతకాలను సాధించింది.

స్నేహిత్

శ్రీజ

నైనా

2020లో పేస్ గుడ్‌బై

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ వచ్చే ఏడాది ఆటకు వీడ్కోలు చెప్పనున్నాడు. తన సుదీర్ఘ ప్రొఫెషనల్ కెరీర్‌కు 2020లోనే తెరదించుతానని పేస్ బుధవారం ప్రకటించాడు. వచ్చే ఏడాది కొన్ని టోర్నీలను ఎంపిక చేసుకొని జట్టుతో ప్రయాణించి ప్రపంచంలోని తన అభిమానులతో వీడ్కోలు సంబురాలు చేసుకుంటానని వెల్లడించాడు. 1991లోనే ప్రొఫెషనల్ ప్లేయర్‌గా ప్రస్థానాన్ని ఆరంభించిన పేస్ ఇప్పటి వరకు 28ఏండ్లకు పైగా సాగిన తన కెరీర్‌లో 18 డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో పాటు వందలాది ట్రోఫీలను కైవసం చేసుకున్నాడు. 2016 ఫ్రెంచ్ ఓపెన్ అతడి చివరి ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఇటీవల 46ఏండ్ల వయసులో డేవిస్‌కప్‌లో 44వ విజయం సాధించి, ఈ టోర్నీ చరిత్రలో అత్యంత విజయవంతమైన ప్లేయర్‌గా పేస్ చరిత్ర లిఖించిన సంగతి తెలిసిందే.

బుమ్రాకు దాదా బాసట

నేరుగా లంకతో టీ20 సిరీస్‌లో బరిలోకి జస్ప్రీత్

గంగూలీ

బుమ్రా

ముంబై: గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకుని తిరిగి టీమ్‌ఇండియాకు ఎంపికైన స్పీడ్ స్టర్ జస్ప్రీత్ బుమ్రాకు బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ బాసటగా నిలిచాడు. జాతీయ జట్టుకు ఆడే ముందు రంజీల్లో ఆడాల్సిన అవసరం లేదంటూ శ్రీలంకతో నేరుగా టీ20 సిరీస్‌లో బరిలోకి దిగేందుకు బుమ్రాకు అవకాశమిచ్చాడు. సాధారణంగా గాయపడ్డ ఆటగాడు తన ఫిట్‌నెస్ నిరూపించుకుని దేశవాళీలో ఆడి ఫామ్ చాటాల్సి ఉంటుంది. అయితే వచ్చే ఏడాది బిజీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని బుమ్రాను రంజీల నుంచి తప్పించారు. దీనికి తోడు జట్టులో పునరాగమనానికి ముందు తీరిక లేకుండా ఆడటం బుమ్రా కు ఇష్టం లేదని తెలిసింది. ఏదైనా సాఫీగా సాగాలన్న ఉద్దేశంలో భాగంగా తన అభిప్రాయాన్ని బీసీసీఐ చీఫ్ గంగూలీతో పాటు కార్యదర్శి జై షా దృష్టికి తీసుకెళ్లినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న దాదా, జైషా..గుజరాత్ కెప్టెన్ పార్థివ్‌పటేల్‌తో మాట్లాడారు. ఈ నేపథ్యంలో బుధవారం సూరత్ వేదికగా కేరళతో మొదలైన రంజీ మ్యాచ్‌లో గుజరాత్ తరఫున ఆడాల్సిన అవసరం బుమ్రాకు లేకుండా పోయిం ది. శ్రీలంక, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు జట్లను ఎంపిక చేసిన ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ బృందం..బుమ్రా రంజీ ల్లో ఆడుతాడని పేర్కొన్న సంగతి తెలిసిందే.

40 నిమిషాల్లో మనసు గెలిచాడు

ముస్తాక్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటేనే ఒక యుద్ధం లాంటిది. ఇరు దేశాల అభిమానులు ప్రతి మ్యాచ్‌ను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. కోట్లాది మంది భావోద్వేగాలు మ్యాచ్‌తో ముడిపడి ఉంటాయి. గెలిచేందుకు అహరహం శ్రమించే ఆటగాళ్లు కూడా అదుపుతప్పి ఒకరిని ఒకరు దూషించుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ ఇదంతా ఒకవైపైతే మ్యాచ్ ముగిసిన తర్వాత కలిసిపోవడం చూడవచ్చు. గంగూలీ, పాక్ గ్రేట్ స్పిన్నర్ సక్లయిన్ ముస్తాక్ మధ్య నువ్వానేనా అన్న రీతిలో పోటీ సాగిన సందర్భాలు ఉన్నాయి. అయితే 2005-06 ఇంగ్లండ్‌లో భారత్ పర్యటించిన సమయంలో ఆసక్తికర సందర్భం చోటు చేసుకుంది. ససెక్స్ జట్టు సభ్యుడైన ముస్తాక్ రెండు మెకాళ్లకు శస్త్రచికిత్స జరుగడంతో భారత్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఆ సమయంలో గంగూలీ తనను కలిసిన సందర్భాన్ని ముస్తాక్ బుధవారం వీడియో ద్వారా వెలువరించాడు. 'గాయం కారణంగా 36-37 వారాలు పూర్తిగా మంచానికే పరిమితమయ్యాను. గాయం నుంచి తేరుకుని తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాను. ప్రాక్టీస్ మ్యాచ్‌లో ససెక్స్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు సౌరవ్ చూసేందుకు వచ్చాడు. నీ అతను నేరుగా నేను ఉన్న గదిలో వచ్చి కాఫీ తాగి నాతో చాలాసేపు ముచ్చటించాడు. గాయం గురించి అడుగడంతో పాటు జీవితం, కుటుంబం ఇలా 40 నిమిషాల్లోనే నా మనసు గెలుచుకున్నాడు' అని ముస్తాక్ అన్నాడు.

రంజీ మ్యాచ్‌లకు గ్రహణం అడ్డంకి

ముంబై: రంజీ మ్యాచ్‌లకు సూర్య గ్రహణం అడ్డంకిగా మారబోతున్నది. ముంబై-రైల్వేస్, ఉత్తర్‌ప్రదేశ్, సౌరాష్ట్ర మ్యాచ్‌లు గ్రహణం కారణంగా గురువారం నిర్ణీత సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా మొదలుకానున్నాయి. వాంఖడే స్టేడియం వేదికగా ముంబై, రైల్వేస్ తలపడుతుండగా, రాజ్‌కోట్‌లో సౌరాష్ట్ర, యూపీ ఆడుతున్నాయి. గ్రహణాన్ని దృష్టిలో ఉంచుకుని మ్యాచ్‌ను ఆలస్యంగా మొదలుపెడుతున్నట్లు సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్(ఎస్‌సీఏ) ఒక ప్రకటనలో పేర్కొంది.

ఏటీకే గెలుపు

కోల్‌కతా : ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్ఎల్) ఆరో సీజన్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీపై ఏటీకే పైచేయి సాధించింది. బుధవారమిక్కడ ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏటీకే 1-0తో బెంగళూరుపై గెలిచింది. మ్యాచ్ ప్రారంభంలో సునీల్ ఛెత్రి సారథ్యంలోని బెంగళూరు దూకుడుగా ఆడినా ఫలితం లేకపోయింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన రెండో నిమిషంలోనే ఏటీకే ప్లేయర్ డేవిడ్ విలియమ్స్(47వ నిమిషం) ఏకైక గోల్ చేశాడు. ఐఎస్ఎల్‌లో బెంగళూరుపై ఏటీకేకు ఇది తొలి విజయం కావడం విశేషం.

అంజుమ్ మౌద్గిల్ హ్యాట్రిక్

భోపాల్: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్టార్ షూటర్ల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మహిళల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో అంజుమ్ మౌద్గిల్ వరుసగా మూడో ఏడాది స్వర్ణ పతకంతో హ్యాట్రిక్ కొట్టింది. బుధవారం జరిగిన అర్హత రౌండ్ పోటీలో అంజుమ్ 1172 పాయింట్లతో టాప్‌లో నిలువగా, హర్యానా షూటర్ రాజ్ చౌదరీ(1164) రెండో స్థానం దక్కించుకుంది. అదే జోరు కొనసాగిస్తూ ఫైనల్లో 449.9 పాయింట్లతో మౌద్గిల్ పసిడి పతకం ఖాతాలో వేసుకోగా, గాయత్రికి రజతం లభించింది. టీమ్ విభాగంలోనూ అంజుమ్ స్వర్ణం దక్కించుకుంది. 10మీటర్ల పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంటులో హర్యానా ద్వయం అభిషేక్ వర్మ, యశస్విని దేస్వాల్ పసిడి సాధించారు. జూనియర్ మిక్స్‌డ్ టీమ్ పిస్టల్ ఫైనల్లో మను భాకర్, సరబ్‌జ్యోత్ సింగ్ జోడీ 16-8తో గెలిచి పసిడి ఖాతాలో వేసుకున్నారు.

32 ఏండ్ల తర్వాత..

ఆసీస్, కివీస్ మధ్య బాక్సింగ్ డే టెస్టు

విలియమ్సన్

పైన్

మెల్‌బోర్న్ : సుదీర్ఘ విరామం తర్వాత బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియా - న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. రెండు జట్లు చివరిసారిగా 1987 డిసెంబర్ 26న పోటీ పడగా.. ఆ తర్వాత ఆ తేదీన తలపడనుండడం ఇదే తొలిసారి. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆసీస్ - కివీస్ మధ్య రెండో టెస్టు ఇక్కడి మెల్‌బోర్న్ క్రికెట్‌లో గురువారం ప్రారంభం కానుంది. ఈ టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ఆసీస్ భావిస్తుంటే.. ఎలాగైనా ఆతిథ్య జట్టును అడ్డుకొని ఆశలు సజీవంగా ఉంచుకోవాలని న్యూజిలాండ్ ఆరాటపడుతున్నది. ప్రత్యేకమైన రోజున తలపడేందుకు చాలా మందికి అవకాశం రాలేదని, తమకు వచ్చిన ఈ చాన్స్‌ను వదలకూడదని అనుకుంటున్నట్టు కివీస్ బౌలర్ టిమ్ సౌథీ చెప్పాడు. కాగా, కివీస్ ఈ మ్యాచ్‌లో రెండు మార్పులు చేసింది. గాయం నుంచి కోలుకున్న స్టార్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ జట్టులోకి రాగా, టాపార్డర్ బ్యాట్స్‌మన్ జీత్ రావల్ స్థానంలో బ్లండెల్ చోటు దక్కించుకున్నాడు. ఆసీస్ జట్టులో గాయపడిన బౌలర్ హాజిల్‌వుడ్ స్థానంలో జేమ్స్ పాటిన్సన్ వచ్చే అవకాశాలు ఉండగా.. మరో పేసర్ మిచెల్ నేసర్ టెస్టు అరంగేట్రం చేయడం ఖాయంగా కనిపిస్తున్నది. ఒకవేళ ఐదుగురు కాకుండా నలుగురు బౌలర్లతోనే బరిలోకి దిగాలనుకుంటే ఇద్దరిలో ఒకరు తుది జట్టుకు దూరం కావాల్సి వస్తుంది.

అగర్వాల్, కునాల్‌కు డోపింగ్ పరీక్షలు

న్యూఢిల్లీ: డోపింగ్‌ను అరికట్టడంలో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా హైదరాబాద్, న్యూఢిల్లీ మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ సందర్భంగా నాడా శాంపిల్స్ సేకరించింది. నాడాకు చెందిన ఇద్దరు ప్రతినిధులు హైదరాబాద్ కెప్టెన్ తన్మయ్ అగర్వాల్, ఢిల్లీ ఓపెనర్ కునాల్ చండేలా నుంచి మూత్ర నమూనాలను సేకరించారు. మ్యాచ్ భోజన విరామ సమయంలో ఇద్దరి నుంచి డోపింగ్ పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకున్నట్లు నాడా అధికారులు తెలిపారు. 'మాకున్న సమాచారం మేరకు ర్యాండమ్ పరీక్షల్లో భాగంగా ఒక్కో జట్టు నుంచి ఒక్కో శాంపిల్‌ను తీసుకున్నారు. హైదరాబాద్ నుంచి తన్మయ్, ఢిల్లీ జట్టులో చండేలా శాంపిల్స్ ఇచ్చారు' అని డీడీసీఏ సీనియర్ అధికారి అన్నారు. నిర్దేశిత ప్రమాణాలు పాటించిన కారణంగా నాడాపై ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ(వాడా) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో దోహాలో వాడా గుర్తింపు పొందిన ల్యాబ్‌లో నాడా పరీక్షలు చేయిస్తున్నది.

అగర్వాల్

గబ్బర్ ఈజ్ బ్యాక్

హైదరాబాద్‌పై ధవన్ అజేయ శతకం.. రంజీ ట్రోఫీ


ధవన్ (137★)

న్యూఢిల్లీ : గాయం నుంచి కోలుకున్న టీమ్‌ఇండియా స్టార్ ఓపెనర్, ఢిల్లీ ఆటగాడు శిఖర్ ధవన్ పునరాగమనంలో అదరగొట్టాడు. ఇంగ్లండ్ పరిస్థితులను తలపించిన ఢిల్లీ పిచ్‌పై తన మార్క్ డ్రైవ్‌లతో, బాక్స్ క్రికెట్ టెక్నిక్‌తో హైదరాబాద్‌పై రెచ్చిపోయి అజేయ శతకం బాదాడు. రంజీ ట్రోఫీ గ్రూప్-ఏలో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియంలో హైదరాబాద్, ఢిల్లీ మధ్య మ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. శిఖర్ ధవన్(198 బంతుల్లో 137 నాటౌట్ ; 19ఫోర్లు, 2సిక్సర్లు) చెలరేగడంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఢిల్లీ ఆరు వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. క్రీజులో ధవన్‌తో పాటు బధూరీ (22) ఉన్నాడు. హైదరాబాద్ బౌలర్లలో మెహదీ హసన్ మూడు, సిరాజ్ రెండు, మిలింద్ ఓ వికెట్ తీసుకున్నారు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న హైదరాబాద్ తొలుత అదరగొట్టింది. మహమ్మద్ సిరాజ్ (2/60) ఆరంభంలోనే కునాల్ చండేలా(1)ను ఔట్ స్వింగర్‌తో, ధృవ్ షోరేను ఇన్‌స్వింగర్‌తో బోల్తా కొట్టించి పెవిలియన్ చేర్చాడు. మరోవైపు ఢిల్లీ ఓపెనర్ ధవన్ తొలి నుంచి దూకుడు కనబరిచాడు. స్వింగ్ అవుతున్న బంతులను క్లాసిక్ డ్రైవ్‌లతో బౌండరీలు దాటించాడు. ఓ దశలో హైదరాబాదీ స్పిన్నర్ మెహదీ హసన్(3/61).. జాంటీ సిద్ధు(15), లలిత్ యాదవ్(19)ను వెనక్కి పంపడంతో ఢిల్లీ 128కే ఐదు వికెట్లు కోల్పోయినా శిఖర్ ఏ మాత్రం తగ్గలేదు. అంజు రావత్(29) సహకరించడంతో ఇన్నింగ్స్‌ను ధాటిగానే నడిపించాడు. ఈ క్రమంలో శకతం పూర్తి చేసుకున్న ధవన్ ఆ తర్వాత మరింత దూకుడు పెంచాడు. రావత్ ఔటైన తర్వాత కున్వర్ బిందూరీ(22) శిఖర్‌కు తోడుగా నిలిచాడు.

ముంబై 114 ఆలౌట్

స్టార్ ప్లేయర్లు అంజిక్య రహానే(5), పృథ్వీషా(12) విఫలమవడంతో రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి రోజే ఆతిథ్య ముంబై జట్టు 114పరుగులకు కుప్పకూలింది. రైల్వేస్ జట్టులో పేసర్ టి ప్రదీప్(6/37) ఆరు వికెట్లతో సత్తాచాటగా అమిత్ మూడు వికెట్లు తీసుకున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(39) చెప్పుకోదగ్గ స్కోరు చేయడంతో ముంబై 114 పరుగులైనా చేయగలిగింది. ఆ తర్వాత ముంబై బౌలర్ దీపక్ శెట్టి(3/20) అదరగొట్టడంతో 116 పరుగులకే రైల్వేస్ ఐదు వికెట్లు కోల్పోయి తొలి రోజును ముగించింది.

బుధవారం క్రిస్మస్ పార్టీలో పాల్గొన్న భారత సీనియర్ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోనీ, రిషబ్ పంత్

డిజిటల్ మీడియాలోకి వచ్చే ఎఫ్‌డీఐలపై త్వరలో స్పష్టత

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: డిజిటల్ మీడియా రంగంలోకి అనుమతించిన 26 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై పలువురు వాటాదారులు లేవనెత్తిన సమస్యలపై త్వరలో స్పష్టతనివ్వనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ) వర్గాలు వెల్లడించాయి. డిజిటల్ మీడియాలోకి ఎఫ్‌డీఐల పరిమితిని 26 శాతానికి పెంచడంపై పలు పారిశ్రామిక వర్గాలు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. విదేశాల నుంచి నిధులను సేకరించాలని చూస్తున్న సంస్థలను నియంత్రించే చర్యలను వ్యతిరేకించాయి. ఇందుకు సంబంధించి ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖ నుంచి సమాచారాన్ని సేకరించింది డీపీఐఐటీ. ఆన్‌లైన్లో న్యూస్‌లను అందించే టెలివిజన్ బ్రాడ్‌కాస్ట్‌లను ఎలా గుర్తిస్తారని, ముందుగా దీనిపై స్పష్టతనిచ్చిన తర్వాతనే చర్యలు తీసుకోవాలని డెలాయిట్ ఇండియా భాగస్వామి జెహిల్ ఠక్కర్ సూచించారు. ఈ రంగంలోకి ఎఫ్‌డీఐల పరిమితిని 26 శాతానికి కాదు 49 శాతానికి పెంచాలని ఆయన కేంద్రానికి సూచించారు. అలాగే ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్పష్టతనిచ్చిందని, దేశీయ డిజిటల్ మీడియా స్టార్టప్‌లను అంతర్జాతీయ స్థాయిలో విస్తరించడానికి ఈ నిర్ణయం దోహదం చేయనున్నప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు.

మూడేండ్లలో రూ.50 వేల కోట్లు

సౌర విద్యుత్‌లో పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించిన ఎన్‌టీపీసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌టీపీసీ వచ్చే మూడేండ్లకాలంలో 10 గిగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి రూ.50 వేల కోట్ల మేర పెట్టుబడులు పెట్టబోతున్నది. ఈ నిధులను గ్రీన్ బాండ్లను జారీ చేయడం ద్వారా సేకరించనున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం సంస్థ 920 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నది. దీర్ఘకాలిక విస్తరణలో భాగంగా 2032 నాటికి 130 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 2,300 మెగావాట్ల సోలార్ ఎనర్జీ కెపాసిటీకోసం టెండరింగ్‌ను పూర్తి చేయనున్న సంస్థ..2020-21, 2021-22లలో చెరో 4 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలనుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్గదర్శకాలకు అనుగుణంగా సంస్థ..త్వరలో సోలార్ ఏనర్జీ ప్రాజెక్టు పథకానికి శ్రీకారం చుట్టబోతున్నది. ఈ పథకం కింద యూనిట్‌కు అయ్యే ఖర్చు రూ.3 కంటే తక్కువగా అవనున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రోజుకు అరగంట నుంచి గంట వరకు విద్యుత్‌ను తీసేస్తున్నారని, ఈ అంతరాన్ని తగ్గించడానికి ఉత్పత్తిని అమాంతం పెంచనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

బాకీలియ్యండి మహాప్రభో!

కేంద్రానికి ఎయిర్ ఇండియా పైలెట్ల సంఘం లేఖ • నోటీసులు ఇవ్వకుండా మానేయాలన్న యోచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: మాకు రావాల్సిన జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎయిర్ ఇండియా పైలెట్లు కేంద్రాన్ని కోరారు. సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో నోటీసులు ఇవ్వకుండా ఉద్యోగం మానేసేందుకు అనుమతినివ్వాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇండియన్ కమర్షియల్ పైలెట్స్ అసోసియేషన్ (ఐసీపీఏ).. పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ఇటీవల ఓ లేఖ రాసింది. ఈ లేఖలో చెప్పాల్సింది సూటిగా సుత్తి లేకుండా స్పష్టం చేసిన ఐసీపీఏ.. 'వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఎయిర్ ఇండియా ప్రైవేటీకరణ జరుగకపోతే అప్పుడు సంస్థ మూతబడుతుందంటూ మీరు చేసిన ప్రకటన ఆందోళనకరం' అని పేర్కొన్నది. మా బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇంకెటువంటి ఆలస్యం చేయకుండా న్యాయంగా మాకు రావాల్సిన బాకీలను తీర్చాలన్నది. 'మా ఓపిక రోజురోజుకూ నశించిపోతున్నది. అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న ఈ సంస్థలో ఇక మేము ఉద్యోగాలను చేయలేం. నోటీసులు లేకుండా మానేసేందుకు అనుమతివ్వాలి' అని కోరింది. నిజానికి ఉద్యోగం మానేయాలంటే 6 నెలల ముందస్తు నోటీసు తప్పనిసరి. అయితే సంస్థ ఆర్థిక పరిస్థితులు బాగాలేనందున ఈ నిబంధనను పక్కనబెట్టాలని ఐసీపీఏ కోరుతున్నది. '21 ప్రైవేట్ రంగ విమానయాన సంస్థల ఉద్యోగులకు పట్టిన గతే.. మాకూ పట్టొద్దని కోరుకుంటున్నాం' అని ఈ నెల 23న రాసిన లేఖలో హర్దీప్ సింగ్‌తో ఐసీపీఏ అన్నది. ఇప్పటికే గత 2-3 ఏండ్లుగా అనిశ్చితిలో జీవనం సాగిస్తున్నామని, చాలామంది ఉద్యోగులు రుణాల చెల్లింపులను, ఇతరత్రా హామీలను నెరవేర్చలేక డిఫాల్ట్ అయ్యారని గుర్తుచేసింది. వారివారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ లేఖ ప్రకారం పైలెట్లకు అక్టోబర్ అలవెన్సులూ అందలేదని సమాచారం. ఈ ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ప్రస్తుతం రూ.58 వేల కోట్లకుపైగా రుణ భారాన్ని మోస్తున్న విషయం తెలిసిందే. దీంతో అమ్మేయాలనుకుంటున్న సర్కారుకు ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. కొనేందుకు ఎవరూ ముందుకు రాలేకపోతుండటంతో సంస్థలోని ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ రోజులు లెక్కపెట్టాల్సి వస్తున్నది. ఐసీపీఏలో సుమారు 800 మంది పైలెట్లు సభ్యులుగా ఉన్నారు. వీరంతా సింగిల్ ఏస్లే ఎయిర్‌క్రాఫ్ట్‌లను నడుపుతున్నవారే.

మిశ్రమంగా గృహ విక్రయాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: ప్రస్తుత సంవత్సరంలో దేశవ్యాప్తంగా గృహ విక్రయాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 6 శాతం పెరిగి 46,920 యూనిట్లకు చేరుకున్నట్లు ప్రాపర్టీ కన్సల్టెన్సీ అనరాక్ తాజాగా వెల్లడించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో చదరపు అడుగు ధర రూ.4,600 స్థాయిలో ఉన్నది. అలాగే అమ్ముడుపోని ఇన్వెంటరీ 6 శాతం తగ్గి 1,86,714 యూనిట్ల నుంచి 1,75,079 యూనిట్లకు పడిపోయాయి. మిగత ఏడు నగరాల్లో నికరంగా చూస్తే అమ్మకాలు ఐదు శాతం పెరిగి 2,61,370 లకు చేరుకున్నాయి. రెండో అర్థభాగంలో విక్రయాలు 22 శాతం తగ్గుముఖం పట్టాయి. మిగతా నగరాల విషయానికి వస్తే ముంబైలో ఇండ్ల అమ్మకాలు 22 శాతం పెరుగగా, పుణెలో 18 శాతం, చెన్నైలో 4 శాతం అధికమవగా, కానీ, బెంగళూరుల్లో 12 శాతం పతనం చెందాయి. అలాగే కోల్‌కతా, హైదరాబాద్‌లో అమ్మకాల్లో 11 శాతం దిగువకు పడిపోయాయి.

రెండు శ్లాబులు చాలు

తరచూ పన్ను రేట్లను మార్చక్కర్లేదు • జీఎస్టీ విధానంపై నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానంలో రెండు శ్లాబులు చాలని నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ అభిప్రాయపడ్డారు. అలాగే తరచూ పన్ను రేట్లను సవరించాల్సిన పని లేదని, అవసరమైతే ఏడాదికోసారి మార్చాలన్నారు. బుధవారం ఇక్కడ పీటీఐతో మాట్లాడుతూ జీఎస్టీలో ఉన్న రకరకాల శ్లాబులను కుదించాలన్నారు. ఒకే దేశం.. ఒకే పన్ను.. ఒకే మార్కెట్ పేరుతో జూలై 1, 2017న జీఎస్టీని దేశవ్యాప్తంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ పరోక్ష పన్ను కోసం 17 రకాల కేంద్ర, రాష్ట్ర పన్నులను ఏకం చేయగా, ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతాల శ్లాబులున్నాయి. అన్ని రకాల వస్తు, సేవలపై ఈ శ్లాబుల ప్రకారమే పన్నులు పడుతున్నాయి. జీఎస్టీ వచ్చిన దగ్గర్నుంచి ఎన్నోసార్లు పన్నులను మార్చిన సంగతీ విదితమే. ఈ క్రమంలో ఇన్ని రకాల శ్లాబులు, తరచూ పన్ను సవరణలు అవసరం లేదని రమేశ్ అన్నారు. 'జీఎస్టీ వంటి ఓ పెద్ద పన్ను అమల్లోకి వచ్చినప్పుడు సమస్యలు సర్వసాధారణం, అయితే త్వరలోనే ఇవి సర్దుకుంటాయి. నిజానికి చాలా దేశాల్లో జీఎస్టీ స్థిరీకరణకు చాలా సమయమే పట్టింది' అన్నారు. ఈ క్రమంలోనే తరచూ పన్ను సవరణల వల్ల సమస్యలు మరింత పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా పన్నులను తగ్గించాలన్న డిమాండ్లు ఆయా రంగాల నుంచి ఎప్పటికీ వస్తూనే ఉంటాయన్నారు. దీంతో రెండు శ్లాబులే ఉంటే ఇలాంటి డిమాండ్లకు చెక్ పెట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ఒక వేళ అన్ని రేట్లను సవరించాల్సి వస్తే.. ఏడాదికోసారి మార్చితే చాలన్నారు. నిజానికి పన్ను రేట్ల తగ్గింపు డిమాండ్ల కంటే జీఎస్టీలో అపరిష్కృత అంశాలెన్నో ఉన్నాయన్నారు. కాగా, 15వ ఆర్థిక సంఘంలోనూ సభ్యుడిగా ఉన్న ఈ వ్యవసాయ ఆర్థికవేత్త.. ఒక్క వ్యవసాయ రంగానికే రూ.1.2 లక్షల కోట్ల రాయితీని కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నదని, రాష్ట్రాలన్నీ దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు.

ఆహారోత్పత్తులపై 5 శాతమే సరి

పాల ఉత్పత్తుల వంటి ఆహారోత్పత్తులపై జీఎస్టీ భారాన్ని తగ్గించాలన్న డిమాండ్లపై రమేశ్ స్పందిస్తూ వాటిపై 5 శాతం జీఎస్టీ ఆమోదయోగ్యమేనన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఏర్పాటైన జీఎస్టీ మండలి జీఎస్టీ రేట్లను నిర్ణయిస్తున్న సంగతి విదితమే. ఇందులో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉండగా, గతంలో చాలా వస్తు, సేవలపై పన్ను రేట్లను తగ్గించడం, పూర్తిగా మినహాయింపునివ్వడం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం..

జీఎస్టీ విధానంలో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారార్థం ఓ ప్రత్యేక వ్యవస్థను జీఎస్టీ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నది. ఈ నెల 18న జరిగిన జీఎస్టీ మండలి 38వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 'నిర్మాణాత్మక సమస్యల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేయాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది' అని బుధవారం ఓ అధికారిక ప్రకటన విడుదలైంది. జోనల్, రాష్ట్ర స్థాయిల్లో ఈ వ్యవస్థలు ఏర్పాటు కానుండగా, కేంద్ర, రాష్ట్ర పన్ను అధికారులు, వ్యాపార-పరిశ్రమ ప్రతినిధులు, ఇతరత్రా జీఎస్టీ భాగస్వాములు ఇందులో సభ్యులుగా ఉండనున్నారు. రెండేండ్ల కాలానికిగాను ఈ కమిటీ ఏర్పాటు కానున్నది.

ఏడాదిలోగా మరో 11 హోటళ్లు

దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న హయత్ కార్పొరేషన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: అంతర్జాతీయ ఆతిథ్య రంగ సంస్థ హయత్ హోటల్స్ కార్పొరేషన్.. భారత్‌లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. వచ్చే ఏడాది చివరినాటికి దేశవ్యాప్తంగా మరో 11 కొత్త హోటళ్లను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించింది. చికాగో కేంద్ర స్థానంగా పనిచేస్తున్న హయత్‌కు దేశవ్యాప్తంగా 20 నగరాల్లో 32 హోటళ్లను ఏర్పాటు చేసింది. హయత్, హయత్ సెంట్రిక్, హయత్ రిజెన్సీ, హయత్ ప్లేస్, పార్క్ హయత్, గ్రాండ్ హయత్, అలిలా అండ్ అండాజ్ పేర్లతో హోటళ్లను నిర్వహిస్తున్నది. భారత్‌లో ఆతిథ్య రంగం అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో వచ్చే ఏడాది చివరినాటికి మరో 11 కొత్త హోటళ్లను ప్రారంభించాలనుకుంటున్నట్లు హయత్ వైస్ ప్రెసిడెంట్ (ఇండియా ఆపరేషన్స్) సుంజాయ్ శర్మ తెలిపారు. 35 ఏండ్ల క్రితం భారత మార్కెట్లోకి అడుగుపెట్టిన తొలి అంతర్జాతీయ సంస్థ హయత్ కావడం విశేషం. 1982లో ఢిల్లీలో హయత్ రిజెన్సీ బ్రాండ్‌తో తన తొలి హోటల్‌ను ప్రారంభించింది. ఆ తర్వాతి క్రమంలో నాలుగు బ్రాండ్‌లను పరిచయం చేసినట్లు శర్మ చెప్పారు. గురుగ్రామ్‌లో గ్రాండ్ హయత్ బ్రాండ్‌తో హోటళ్లను ఏర్పాటు చేసిన సంస్థ.. హైదరాబాద్‌లో హయత్ ప్యాలెస్, పార్క్ హయత్‌లతో నిర్వహిస్తున్నది. భవిష్యత్తులో ఏర్పాటు చేసే హోటళ్లను ఫ్రాంచైజ్ పద్ధతిన, కాంట్రాక్ట్ మోడల్ పద్ధతిన ఒప్పందం కుదుర్చుకొని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇకనుంచి ద్వి, తృతీయ శ్రేణి నగరాలకు కూడా వ్యాపారాన్ని విస్తరించే అవకాశం ఉందన్నారు.

రూ.10వేల కోట్లతో ఓడరేవు!

రామాయపట్నం వద్ద ఏర్పాటు చేసేయోచనలో ఏపీ ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 25: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో అతిపెద్ద ఓడరేవును ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. రూ.10 వేల కోట్ల పెట్టుబడితో ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం వద్ద గ్రీన్‌ఫీల్డ్ సముద్ర రేవును నెలకొల్పాలని నిర్ణయించింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ(ఈఏసీ), ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ కంపెనీ రిట్స్ లిమిటెడ్ సంయుక్తంగా ఇటీవల సమావేశమై ఈ నిర్ణయానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో కార్గో సేవలకు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ఏపీ సర్కార్ సరికొత్త రేవును నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనపై ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమైన రాష్ట్ర సర్కార్ ఎట్టకేలకు అనుమతి లభించినట్లు ఏపీ వర్గాలు వెల్లడించాయి. భవిష్యత్తు అవసరాల నిమిత్తం నిర్మిస్తున్న ఈ రేవులో ప్రపంచ స్థాయి టర్మినల్‌ను నెలకొల్పుతున్నది. 3,437 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్న పూర్తిస్థాయి ప్రాజెక్టులో తొలి విడుత 802 ఎకరాల్లో సరుకు రవాణాకోసం శాశ్వత సముద్ర సౌకర్యాలు, రవాణా, స్టోరేజ్‌కోసం ప్రత్యేక వసతులను నెలకొల్పుతున్నది.

కొనసాగిన ఫండ్ల జోరు

మ్యూచువల్ ఫండ్ల జోరు నిరాటంకంగా కొనసాగుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో ఫండ్ ఆస్తుల విలువ మరో రూ.4 లక్షల కోట్ల మేర పెరిగింది. 2019లో భారీ వృద్ధిని నమోదు చేసుకున్న ఈ విభాగం నూతన సంవత్సరంలోనూ మరింత పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. నియంత్రణ మండలి సెబీ తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో పెట్టుబడిదారుల్లో నమ్మకం మరింత పెరుగడంతో డెబిట్ మార్కెట్లో భారీగా నిధులు కుమ్మరించారు. ఈక్విటీ మార్కెట్లు అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకుంటే 2020లో ఫండ్ విభాగం 17-18 శాతం మధ్యలో వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ బాడీ ఆంపీ సీఈవో ఎన్ఎన్ వెంకటేశ్ తెలిపారు. ప్రస్తుత సంవత్సరం నవంబర్ చివరినాటికి అసెట్ అండర్ మేనేజ్‌మెంట్(ఏయూఎం) ఆస్తుల విలువ మరో 18 శాతం(రూ.4.2 లక్షల కోట్లు) పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.27 లక్షల కోట్లకు చేరుకున్నాయి. డిసెంబర్ 2018 వరకు రూ.22.86 లక్షల కోట్లుగా ఉన్నది. ఈ నెల చివరినాటికి ఫండ్ ఆస్తుల విలువ కొంతమేర తగ్గే అవకాశాలున్నాయని పలువురు ఇండస్ట్రీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. పాత పెద్ద నోట్లను రద్దు చేస్తు తీసుకున్న నిర్ణయం తర్వాత ఫండ్లలోకి పెట్టుబడులు వరదలా వచ్చాయన్నారు. ఈ ఏడాది కొత్తగా 62 లక్షల మంది పెట్టుబడిదారులు చేరడంతో మొత్తం సంఖ్య 8.65 కోట్లకు చేరుకున్నారు. 2018లో 7.5 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న ఫండ్ ఇండస్ట్రీ ఆ తర్వాతి ఏడాదిలో 18 శాతం వృద్ధి కనబరిచింది.

ఈక్విటీలే కీలకం...

మ్యూచువల్ ఫండ్లు ఆశాజనక పనితీరు కనబరుచాలంటే ఈక్విటీ మార్కెట్లు కూడా వృద్ధిని నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే ఫండ్లు దూసుకుపోనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుండటంతో పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్ మెరుగుపడిందని, దీంతో తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఫండ్లవైపు మళ్లించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా లక్ష డిస్ట్రిబ్యూటర్లు ఉండగా, అలాగే 2.1 కోట్ల మంది పెట్టుబడిదారులు ఉన్నారు. ఈక్విటీలతో పోలిస్తే ఫండ్లలో పెట్టుబడులు అధిక రిటర్నులు పంచుతుండటం కూడా ఇందుకు దోహదం చేస్తున్నది. 2009లో రూ.8.22 లక్షల కోట్లుగా ఉన్నా ఏయూఎం ఇండస్ట్రీ.. నవంబర్ 2019 నాటికి రూ.27 లక్షల కోట్లకు చేరుకున్నది. గడిచిన పదేండ్లకాలంలో ఫండ్ ఆస్తుల విలువ మూడింతలు పెరిగింది.

టెల్కోలకు షాక్

టెలికం సంస్థలకు పెను సవాళ్లు • మనుగడే ప్రశ్నార్థకం

దేశీయ టెలికం రంగానికి 2019 సంవత్సరం చేదు అనుభవాల్నే మిగిల్చింది. ధరల యుద్ధం, నష్టాలు, సుప్రీం కోర్టు తీర్పు భారతీయ టెలికం సంస్థలను అత్యంత ప్రభావితం చేశాయి. ప్రపంచంలోనే అతి చౌక, వేగవంతమైన వృద్ధి కలిగిన భారత టెలికం మార్కెట్ మనుగడే ఈ ఏడాది ప్రశ్నార్థకమైందంటే అతిశయోక్తి కాదు. పెను సవాళ్ల మధ్య సంక్షోభంలోకి జారుకున్న పరిశ్రమ.. ఉద్దీపనల కోసం ప్రభుత్వాన్ని వేడుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని సంచలన 4జీ టెలికం సంస్థ జియో రాకతో దేశీయ టెలికం రంగ ముఖచిత్రమే మారిపోయిన విషయం తెలిసిందే. జియో కారణంగా పుట్టిన ధరల యుద్ధం.. ఈ ఏడాది పరిశ్రమలో నష్టాల రూపంలో మరింతగా ప్రకంపనల్ని సృష్టించింది. ఇవి తారాస్థాయికి చేరడంతో అటు వొడాఫోన్ ఐడియా, ఇటు భారతీ ఎయిర్‌టెల్ తామిక కొనసాగలేమన్న సంకేతాలను ఇచ్చాయి. ఒక అడుగు ముందుకేసి వొడాఫోన్-ఐడియా.. మూసేస్తామని ప్రకటించింది. అసలే ఆర్థిక మంద గమనంతో సతమతమవుతున్న వేళ ఈ ప్రకటన ప్రభుత్వాన్ని కలవరపాటుకు గురిచేయగా, ఉద్దీపనలతో ముందుకొచ్చింది. దీనిపై ఒంటరైన జియో సైతం చివరకు ధరలను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా అపరిమిత వాయిస్ కాల్స్ కాస్తా.. పరిమిత ఉచిత కాల్స్‌గా మారిపోయాయి. డేటా ధరలూ పెరిగిపోగా, అప్పటిదాకా ఉన్న ప్లాన్లన్నీ భారమై సామాన్యులపై ఆ ప్రభావం పడింది.

సుప్రీం తీర్పు

స్థూల వార్షిక ఆదాయం (ఏజీఆర్)పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు.. టెలికం సంస్థలను భారీగా కుదిపేసింది. స్పెక్ట్రం వినియోగ చార్జీలు, టెలికం లైసెన్సులకు సంబంధించి బకాయిలు, జరిమానాలు వడ్డీలతోసహా టెలికం శాఖకు చెల్లించాలన్న ఆదేశం.. భీకర నష్టాలకు దారితీసింది. టెలికం పరిశ్రమపై రూ.1.47 లక్షల కోట్ల భారం పడగా, వొడాఫోన్ ఐడియా మునుపెన్నడూ లేనివిధంగా దేశీయ కార్పొరేట్ చరిత్రలోనే అత్యధిక త్రైమాసిక నష్టాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబర్‌లో ఏకంగా రూ.50,922 కోట్ల నష్టాలను వెల్లడించింది. భారతీ ఎయిర్‌టెల్ సైతం రూ.23,045 కోట్ల నష్టాలను ప్రకటించింది.

బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం

ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ల విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆమోదం తెలిపింది. రూ.69 వేల కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీని ప్రకటించగా, వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా తెచ్చిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని ఇరు సంస్థల నుంచి సుమారు 92,700 మంది ఉపయోగించుకున్నారు. దీనివల్ల ఏటా దాదాపు రూ.8,800 కోట్ల వేతన భారం తగ్గుతుందని అంచనా.

నీరసించిన విలీనాలు-కొనుగోళ్లు

విలీనాలు-కొనుగోళ్లు ఈ ఏడాది నీరసించాయి. ఆర్థిక మందగమనం ఓవైపు.. రుణ భారం మరోవైపు కార్పొరేట్ రంగాన్ని విలీనాలు-కొనుగోళ్లకు దూరం చేశాయి. రుణ చెల్లింపులకే కార్పొరేట్లు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. నిజానికి గతేడాది విలీనాలు-కొనుగోళ్లు జోరుగా సాగాయి. దేశీయంగా కార్పొరేట్ పరిపాలనా వ్యవస్థలోపాలు, భారీ నగదు కొరత, అంతర్జాతీయంగా అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయాలు ఈ ఏడాది మార్కెట్‌ను దెబ్బతీశాయి. 2019 జనవరి-నవంబర్‌లో విలీనాలు-కొనుగోళ్ల విలువ 33 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఈవై తెలిపింది. మొత్తం 812 డీల్స్ జరిగినట్లు చెప్పింది. సగటు డీల్ విలువ 81 మిలియన్ డాలర్లుగా నమోదవగా, మూడేండ్లలోనే ఇది కనిష్ఠమని పేర్కొన్నది. కాగా, వచ్చే ఏడాదిపైనే కార్పొరేట్లు ఆశలు పెట్టుకున్నారు. ఆర్థిక పరిస్థితులు మెరుగైతే మళ్లీ విలీనాలు-కొనుగోళ్లు ఊపందుకోవచ్చన్న అంచనాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. 2021 నుంచి పూర్వ వైభవం వస్తుందన్న విశ్వాసం వెలిబుచ్చుతున్నారు.

బుధవారం ముంబైలోని జియో వండర్‌లాండ్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ సంబురాల్లో పాల్గొన్న రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ, ఆమె కూతురు ఇషా అంబానీ

అన్ని గ్రామాలకు ఉచిత వై-ఫై

మార్చి నాటికి అందిస్తామన్న కేంద్రం

రేవారి(హర్యానా), డిసెంబర్ 25: భారత్‌నెట్ ద్వారా వచ్చే మార్చి నాటికి దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో ఉచిత వై-ఫై సేవలు అందించగలుగుతామని కేంద్ర టెలికం మంత్రి రవి శంకర్ ప్రసాద్ స్పష్టంచేశారు. ఇప్పటికే భారత్‌నెట్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా 1.3 లక్షల గ్రామ పంచాయితీలకు అనుసంధానం చేయగలిగామని, దీనిని 2.5 లక్షల గ్రామ పంచాయితీలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం భారత్‌నెట్ ప్రాజెక్టు ద్వారా 48వేల గ్రామాల్లో ఉచితంగా వై-ఫై సేవలు పొందుతున్నారు. వీటితోపాటు కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీఎస్) ల ద్వారా బ్యాంకింగ్ సేవలు త్వరలో పొందవచ్చునని మంత్రి చెప్పారు. డిజిటల్ సేవలను మరింత విస్తృత పరుచడంలో భాగంగా 2014లో 60 వేల సీఎస్‌సీఎస్ సెంటర్లను ఏర్పాటు చేసిన కేంద్రం.. ప్రస్తుతం వీటిని 3.60 లక్షలకు పెంచుకున్నది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీసెస్‌లకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా గ్రామాల ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు డిజిటల్ విభజనను తగ్గించడానికి వీలు పడుతున్నదని సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సీఈవో దినేశ్ త్యాగీ తెలిపారు. ఈ గ్రామాల స్థితిగతులు పూర్తిగా మారిపోనున్నాయని, ఆయా గ్రామాల్లో ఉన్న చిన్న చితక వ్యాపారవేత్తలను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. వీటితోపాటు విద్యా, ఆరోగ్యం, ఆర్థిక సేవల్లో గ్రామీణులను అనుసంధానం చేయడానికి వీలుపడుతున్నదని చెప

జనగామ జిల్లా పాలకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా బుధవారం మొక్క నాటుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గ్రీన్‌చాలెంజ్‌లో ప్రముఖులు

- పాలకుర్తిలో మొక్కలునాటిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మేడారం సబ్‌స్టేషన్‌లో ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/పాలకుర్తి రూరల్: గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు విశేష స్పందన వస్తున్నది. ఇందులో భాగంగా జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలని అధికారులకు సూచించారు. మొక్కలతోనే భవిష్యత్ తరాలకు మనుగడ అని తెలిపారు. అలాగే మేడారం సబ్‌స్టేషన్‌లో ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ మోహన్‌రావు మొక్కలు నాటారు. అనంతరం మరో ముగ్గురు సీజీఎంలు ఏ నాగేశ్, మధుసూదన్, అశోక్‌కుమార్ మొక్కలను నాటాలని చాలెంజ్‌చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన పుస్తక ప్రియులు

తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం)లో నిర్వహిస్తున్న 33వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియులు పోటెత్తారు. బుధవారం సెలవు దినం కావడంతో ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కొందరు కుటుంబసమేతంగా వచ్చి తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. ఆయా పుస్తక స్టాళ్లు కొనుగోలుదారులతో కిక్కిరిపోయాయి. ఈ పుస్తక ప్రదర్శన జనవరి ఒకటి వరకు జరుగనున్నది.

కౌన్సెలింగ్‌పై విద్యార్థుల ఆసక్తి

- జూనియర్ కాలేజీల్లో విజయవంతంగా సాగుతున్న ప్రక్రియ
- తగిన చర్యలు చేపట్టిన కళాశాలల ప్రిన్సిపాళ్లు
- రెమిడి తరగతులు, స్టడీ అవర్లు
- ప్రతినెల ఇంటర్‌బోర్డు సమీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు కౌన్సెలింగ్ విధానం విజయవంతంగా కొనసాగుతున్నది. మార్చిలో నిర్వహించే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలుగా సిద్ధంచేసే ప్రక్రియ జోరుగా నడుస్తున్నది. కౌన్సెలింగ్ తరగతులకు విద్యార్థులు కూడా ఆసక్తిగా హాజరవుతున్నారు. ఈ విషయంలో ఇంటర్‌బోర్డు ఆదేశాలకు అనుగుణంగా కాలేజీ ప్రిన్సిపాళ్లు, రెగ్యులర్, కాంట్రాక్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. కాలేజీల్లో రెండువిధాలుగా విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టులవారీగా గ్రూపులుగా విభజించి అదనపు తరగతులు తీసుకుంటున్నారు. పరీక్షలంటేవారిలో భయాలను, అనుమానాలను తొలిగిస్తున్నారు. చదువులతోపాటు మానసికంగా బలహీనంగా ఉన్న విద్యార్థులను తరగతులవారీగా గుర్తిస్తున్నారు. శిక్షణ పొందిన కౌన్సెలర్లతో నిరంతరం పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నారు. పరీక్షల్లో ఫెయిల్, పాస్ అనే వాటిని సీరియస్‌గా తీసుకోవద్దని, ఫలితాలు ఎలా ఉన్నా తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని ఉద్బోధిస్తున్నారు. తల్లిదండ్రులతో కూడా సంప్రదింపులు జరుపుతూ విద్యార్థి మానసిక పరిస్థితిని వివరిస్తున్నారు. విద్యార్థులతో తల్లిదండ్రులు ఎలా నడుచుకోవాలో సూచిస్తున్నారు.

కొనసాగుతున్న రెమిడియల్ తరగతులు

విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దడంతో పాటు మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ల సంఘం నేత కృష్ణకుమార్ తెలిపారు. లెక్చరర్లు ఏ నెలలో ఏ పాఠాలు చెప్పారు? ఆ పాఠాలు విద్యార్థులకు ఎంతవరకు అర్థమవుతున్నాయి? చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ తరగతులు తీసుకుంటున్నారా? లేదా? వంటి అంశాలపై జిల్లా ఇంటర్ విద్యాధికారులు, ప్రిన్సిపాళ్లు, సబ్జెక్టు లెక్చరర్లతో నెలకోసారి సమీక్ష నిర్వహిస్తున్నారు.

ప్రతి రోజు స్టడీ అవర్

ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాణ్యమైన విద్యాబోధన అందుబాటులోకి తీసుకొచ్చారు. రోజువారీ పాఠాలు, రెమిడియల్ తరగతులతోపాటు చదువు గంటలు (స్టడీ అవర్) కొనసాగిస్తున్నారు. కౌన్సెలింగ్, స్టడీ అవర్, రెమిడియల్ తరగతుల విధానం ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో ప్రైవేటు కాలేజీల కంటే.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ఉత్తీర్ణత శాతం మెరుగుపడుతుందన్న ఆశాభావం ఇంటర్ బోర్డు అధికారులు వ్యక్తంచేశారు.

బుధవారం ఖైరతాబాద్‌లో 34వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ సెంటర్ చైర్మన్ రామేశ్వరరావు తదితరులు

రేపట్నుంచి ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్

- హెచ్ఐసీసీలో మూడ్రోజులపాటు నిర్వహణ
- ముఖ్యఅతిథులుగా గవర్నర్లు తమిళిసై, దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రులు
- దేశ, విదేశాల నుంచి హాజరుకానున్న 1,200 మంది ప్రతినిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఖైరతాబాద్: మరో ప్రతిష్ఠాత్మక జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కానున్నది. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్‌సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా 34వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ సదస్సు జరుగనున్నది. 'దేశ నిర్మాణంలో ఇంజినీర్ల సామాజిక పాత్ర' అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సు బ్రోచర్‌ను బుధవారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ సెంటర్ చైర్మన్ జీ రామేశ్వరరావు, వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం చైర్మన్ శ్యాం ప్రసాద్‌రెడ్డి, ఐఈఐ కార్యదర్శి టీ అంజయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రావు మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్‌ను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రారంభిస్తారని.. గౌరవ అతిథులుగా మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ నెల 29న జరిగే ముగింపు సదస్సులో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ గాంగ్ కీ, ఐఈఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీఎం గుణరాజా, ప్రెసిడెంట్ (ఎలెక్ట్) నరేంద్రసింగ్ కూడా సదస్సులో పాల్గొంటారన్నారు. సదస్సులోభాగంగా సాంకేతిక అంశాలపై విస్తృతమైన చర్చలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ స్టేట్‌సెంటర్ దేశంలోనే ఉత్తమ కేంద్రంగా అవార్డు సైతం అందుకున్నదని రామేశ్వరరావు గుర్తుచేశారు. సదస్సు సందర్భంగా ప్రత్యేకఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని, తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కాళేశ్వరం, మిషన్ భగీరథ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టులు, హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు విశేషాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. దేశ, విదేశాల నుంచి 1200 మంది ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ భద్రత

- 2020లో అధునాతన టెక్నాలజీలకు డిమాండ్
- సాంకేతికతలో నైపుణ్యాభివృద్ధి అవసరమంటున్న నిపుణులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'నైపుణ్య లేమి కారణంగానే సంస్థల్లోని ఉద్యోగులను తొలగిస్తున్నాం' అంటూ ఇటీవల పలు ఐటీ కంపెనీలు చెప్తున్నాయని.. నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటేనే ఉద్యోగానికి భద్రత ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నా, సాధించిన ఉద్యోగాన్ని కాపాడుకోవాలన్నా మెరుగైన నైపుణ్యాన్ని కలిగి ఉండటం ముఖ్యమని, ఐటీరంగంలో ఇది మరింత అవసరమని చెప్తున్నారు. మారుతున్న, అభివృద్ధి చెందుతున్న అధునాతన టెక్నాలజీపై పట్టు సాధిస్తేనే ఐటీరంగంలో ఉద్యోగ భద్రత ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం ప్రతి రంగంలోనూ డిజిటల్ టెక్నాలజీ ప్రభావం అధికమవుతున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వస్తున్నాయి. అందుకు అనుగుణంగా అన్ని సంస్థలు సంప్రదాయ టెక్నాలజీల నుంచి అధునాతన టెక్నాలజీలను వినియోగించే దిశగా పయనిస్తున్నాయి.

డాటా సైన్స్, ఏఐ, ఐవోటీకి డిమాండ్

2020లో డాటా సైన్స్, ఆండ్రాయిడ్, ఏఐ, ఐవోటీ, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ మార్కెటింగ్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి సాంకేతికతలకు మంచి డిమాండ్ ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త టెక్నాలజీల ద్వారా ఉద్యోగావకాశాలతోపాటు వేతనాలు కూడా అధికంగా ఉంటాయని చెప్తున్నారు. ఆర్థికమాంద్యం కారణంగా పలురంగాల్లో ఉద్యోగావకాశాలు తగ్గిపోయే అవకాశం ఉన్నప్పటికీ ఐటీ రంగంలోని ఉద్యోగాలకు పెద్దగా ప్రమాదమేమీలేదని నిపుణులు చెప్తున్నారు. అన్నిరంగాల్లోనూ ఏఐ వినియోగం పెరుగుతున్నదని, సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచిస్తున్నారు.

టెక్నాలజీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

అధునాతన సాంకేతికతను వినియోగించడంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఏఐ వంటి సాంకేతికతను ఆయా ప్రభుత్వరంగాల్లో వినియోగిస్తున్నది. అందులోభాగంగా 2020ని కృత్రిమ మేధ సంవత్సరంగా ప్రకటించనున్నది. నూతన టెక్నాలజీని వినియోగించడంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ రాష్ట్రం.. ఏఐ, బిగ్ డాటా ఎనలిటిక్స్ ద్వారా లక్షలమంది యువతకు ఉపాధి అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నది. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై దృష్టిసారించి కళాశాల స్థాయినుంచే ఆ దిశగా శిక్షణ అందిస్తున్నది.

నైపుణ్యముంటే ఉద్యోగాలకు కొదవలేదు

ఐటీరంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోనివారే ఉద్యోగాలను కోల్పోతున్నారు. ఆటోమేషన్ రంగంపై ఉద్యోగులు దృష్టిసారించాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, క్రిప్టోకరెన్సీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చ్యువల్ రియాలిటీ, బిగ్ డాటా ఎనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్ వంటి అధునాతన టెక్నాలజీలపై నైపు ణ్యం పెంచుకుంటే ఐటీరంగంలో ఉద్యోగాలకు కొదవలేదు. నైపుణ్యం కలిగినవారికి 2020లో ఉద్యోగాలు పొందేందుకు మంచి అవకాశాలున్నాయి.

- సందీప్ మక్తాలా, టీటా గ్లోబల్ ప్రెసిడెంట్

బుధవారం నర్సింహులపేటలో అలీ, అన్వర్ కుటుంబ సమ్మేళనానికి హాజరైన బంధువులు

ఆత్మీయ అనురాగబంధం

- ఒకేచోట కలిసిన 1,500 మంది బంధువులు

నర్సింహులపేట, నమస్తే తెలంగాణ: ఎన్నో ఏండ్ల క్రితం బతుకుదెరువు కోసం సొంత ఊరిని వదిలి వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారు తమ బంధువులను, పూర్వికులను కలుసుకోవడానికి స్వస్థలానికి చేరుకొన్నారు. తమ బంధువులను అందరిని కలుసుకొని ఉత్సాహంగా గడిపారు. సుమారు 1500 మంది ఒక్కచోటికి చేరి తమ వారిని చూసి బరువెక్కిన గుండెతో ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటకు చెందిన కాజం అలీ, ఎండీ అన్వర్ తమ పూర్వీకులను, బంధువులను ఒకచోటికి చేర్చాలని అనుకున్నారు. హైదరాబాద్, ముంబై, బీదర్, మహారాష్ట్ర ఇలా దేశంలోని వివిధ నగరాల్లో స్థిరపడిన తమ వారిని స్వగ్రామానికి రప్పించారు. నర్సింహులపేటలోని వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కుటుంబ సమ్మేళనంలో వీరంతా కలుసుకున్నారు.

రాజధాని ఒకేచోట ఉండాలి

- అభివృద్ధిని వికేంద్రీకరించాలి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏ రాష్ట్రానికైనా, దేశానికైనా రాజధాని మొత్తం ఒకేచోట ఉండాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. రాజధానికి బదులు అభివృద్ధిని వికేంద్రీకరించాలని అభిప్రాయపడ్డారు. బుధవారం ఏపీలోని ఆత్కూరు స్వర్ణభారతి ట్రస్ట్ కార్యాలయంలో కొందరు రైతులు వెంకయ్యనాయుడును కలిసి రాజధానిని అమరావతి నుంచి తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధానిలో శాసనసభ, సచివాలయం, హైకోర్టు ఇలా అన్ని భవనాలు, కార్యాలయాలు ఒకేచోట ఉంటేనే పరిపాలన సవ్యంగా ఉంటుందన్నది తన నిశ్చితాభిప్రాయమని, తన 42 ఏండ్ల రాజకీయ అనుభవంతో చెప్తున్నానని వెంకయ్యనాయుడు అన్నారు. అభివృద్ధిని అన్ని ప్రాంతాల్లో వికేంద్రీకరించాలన్న సూత్రాన్ని తాను మొదటి నుంచి పాటిస్తానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో ప్రాంతాలవారీగా చాలా రకాలుగా అభివృద్ధి పనులను కేటాయించినట్టు వివరించారు. తనను కేంద్ర ప్రభుత్వం అడిగితే ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తానని చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

తూర్పుగోదావరి: ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అనపర్తి మండలం పేర రామచంద్రాపురంలోని శ్రీచక్ర ఆయిల్ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీలోని ఆయిల్ మొత్తం అగ్నికి ఆహుతైంది. ఇతర దేశాల నుంచి ఆయిల్‌ను దిగుమతి చేసుకొని ఇక్కడ శుద్ధిచేస్తారు. బుధవారం ఉదయం ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వ్యాపించాయి. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం, కాకినాడ, మండపేట సహా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి అగ్నిమాపక శకటాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పేందుకు శ్రమించాయి. ఇటీవల ఈ ప్లాంట్‌లో ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. నాలుగురోజుల కిందటే తిరిగి నూనె శుద్ధి పనులు ప్రారంభించారు. ఇంతలోనే భారీ అగ్నిప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

కోడ్‌ను ఉల్లంఘించిన కాంగ్రెస్ నాయకులు

- ఇందిరాగాంధీ విగ్రహం ముసుగు తొలిగింపు

ఇందిరాగాంధీ విగ్రహానికి వేసిన ముసుగును తొలిగిస్తున్న ఓ కాంగ్రెస్ నాయకుడు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎన్నికల కోడ్) ఉల్లంఘించారు. ఈ నెల 29న సాయంత్రం మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. కరీంనగర్ నగర మున్సిపల్ అధికారులు నగరంలో ఉన్న రాజకీయ, జాతీయ, ఉద్యమనాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కాగా బుధవారం కరీంనగర్‌లో డీసీసీ ఆధ్వర్యంలో సీఏఏకు వ్యతిరేకంగా శాంతియుత ర్యాలీ, ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో స్థానిక తెలంగాణ చౌక్ వద్ద ఉన్న దివంగత ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి వేసిన ముసుగును కాంగ్రెస్ నాయకులు తొలిగించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహం ముసుగు తొలిగించడంపై పలువురు విస్మయం వ్యక్తంచేశారు.

ఘటనా స్థలి వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు. (ఇన్‌సెట్) మృతులు శంకరయ్య, జ్యోతి, నరేశ్ (ఫైల్)

ఆటోను ఢీకొట్టిన లారీ

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం ▪ మరొకరి పరిస్థితి విషమం

జడ్చర్ల:

ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ససరుల్లాబాద్ సమీపంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ససరుల్లాబాద్‌కు చెందిన మాసయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు. ఏడేండ్ల కిందట పెద్ద కూతురు జ్యోతికి భూత్పూరు మండలం మద్దిగట్లకు చెందిన శంకరయ్యతో వివాహం కాగా వీరికి ఇద్దరు కుమార్తెలు.

మృతుల్లో ఏడాది చిన్నారి

బుధవారం ఉదయం భర్త శంకరయ్య, ఇద్దరు కుమార్తెలు హయతీ, మేఘవర్షిణి(5)తో కలిసి జ్యోతి తన పుట్టినింటికి ఆమె తమ్ముడు నరేశ్ ఆటోలో బయలుదేరారు. ఆటో ససరుల్లాబాద్ సమీపంలోకి చేరుకునే క్రమంలో ఎదురుగా బియ్యం లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో శంకరయ్య(35), హయాతి (1) అక్కడిక్కడే చనిపోయారు. జ్యోతి (30) నరేశ్ (20) జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. మేఘవర్షిణి (5) తీవ్రంగా గాయపడింది. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ దవాఖానకు తరలించారు. జడ్చర్ల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యు వాత పడటంతో ససరుల్లాబాద్‌తోపాటు మద్దిగట్లలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

నమస్తే తెలంగాణ WWW. NTNEWS.COM

జిందగీ

గురువారం 26 డిసెంబర్ 2019 /nt.zindagi

రిచ్ ప్లమ్ కేక్

కావాల్సినవి :

మార్గరిన్ : 100 గ్రా., **చక్కెర :** 100 గ్రా., **మైదా పిండి :** 100 గ్రా., **కోడిగుడ్లు :** 2, **చక్కెరపాకం :** 20 గ్రా., **ఎండుద్రాక్ష :** 100 గ్రా., **బాదం :** 25 గ్రా., **నిల్లా ఫ్లేవర్ :** 2 గ్రా., **ఆరెంజ్ ఫ్లేవర్ :** 2 గ్రా., **జాజికాయ పొడి :** 2 గ్రా., **వెన్న :** సరిపడా, **బేకింగ్‌సోడా :** చిటికెడు, **మజ్జిగ :** 3 టేబుల్‌స్పూన్లు, **ఉప్పు :** తగినంత

తయారీ :

శుభ్రమైన గిన్నె తీసుకొని గుడ్లు, మార్గరిన్ వేసి బాగా కలుపాలి. మరొక గిన్నెలో మైదాపిండి, ఉప్పు, బేకింగ్‌సోడా వేసి కలుపుకోవాలి. ఇందులో డ్రైఫ్రూట్స్, బాదంముక్కలు జోడించాలి. మూడో బౌల్‌లో చక్కెర, కరిగిన వెన్న, వనిల్లా ఎసెన్స్, మజ్జిగ వేసి బాగా కలపాలి. దీన్ని డ్రైఫ్రూట్స్ మిశ్రమంలో వేసి కలుపుకోవాలి. ఆపై గంటపాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో పెట్టాలి. దీంతోపాటు ఒక టూత్‌పిక్ కూడా పెట్టాలి. ఎందుకంటే కేక్ తయారైందో లేదో చూసేందుకు. బయటకు తీసాక చల్లారనిస్తే రిచ్ ప్లమ్ కేక్ సిద్ధమయినట్లే.

వేడుక వేళ.. కేకుల హోళ

క్రిస్మస్ అయిపోయింది. ఇక మన సందడి న్యూఇయర్. గ్రీటింగ్‌కార్డుల జమానా పోయింది . చిన్నా,పెద్దా అంతా కలిసి డిసెంబర్ 31న రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసే ట్రెండ్ వచ్చింది. ఇల్లు, ఆఫీస్, ఫ్రెండ్స్, బంధువులతో ఇలా అన్నిచోట్ల వేడుక చేసుకోవాలంటే కేక్ ఉండాల్సిందే ఇక. అదేదో.. ఇంట్లోనే తయారు చేసుకుంటే కొంచెం ఖర్చు మిగిలినట్లు ఉంటుంది కదా.. అందుకే.. కొన్ని రకాల కేకులు మీ కోసం.

వనిల్లా పేస్ట్రీ

కావాల్సినవి :

మార్గరిన్ : 100 గ్రా., **చక్కెర :** 100 గ్రా., **గుడ్లు :** 2, **మైదాపిండి :** 100 గ్రా., **వనిల్లా ఫ్లేవర్ :** 2 గ్రా.

క్రీమ్‌కోసం

పొడి చక్కెర : 50 గ్రా., **మార్గరిన్ :** 50 గ్రా. **వనిల్లా ఫ్లేవర్ :** 2 గ్రా.

తయారీ :

ముందుగా ఒక గిన్నెలో గుడ్లు పగలకొట్టి అందులో చక్కెర, మార్గరిన్ వేసి బాగా కలుపాలి. ఇందులో వనిల్లా ఫ్లేవర్, మైదాపిండి జోడించాలి. ఈ మిశ్రమాన్ని 45 నిమిషాలపాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో పెట్టాలి. బయటకు తీసిన తర్వాత చల్లారనివ్వాలి. తర్వాత మరో గిన్నెలో క్రీమ్‌కోసం ఇచ్చిన పదార్థాలన్నింటినీ కలుపుకోవాలి. ఈ క్రీమ్‌తో చల్లారిన కేక్‌పై అలంకరించాలి. నచ్చిన ఫుడ్‌కలర్లు జోడించి నచ్చినట్లుగా తయారు చేసుకుంటే వనిల్లా పేస్ట్రి రెడీ

వనిల్లా స్పాంజ్ కేక్‌బార్

కావాల్సినవి :

చక్కెర : 100 గ్రా., **మైదాపిండి :** 100 గ్రా. **గుడ్లు :** 3, **నూనె :** 20 గ్రా., **వనిల్లా ఫ్లేవర్ :** 4 గ్రా.

తయారీ :

శుభ్రమైన గిన్నెలో గుడ్లు, చక్కెర వేసి బాగా కలుపాలి. దీనికి మైదాపిండి, వనిల్లా ఫ్లేవర్ జోడించాలి. దీనితోపాటు నూనె వేసి మెత్తగా కలుపుకోవాలి. సిద్ధంగా ఉన్న మిశ్రమాన్ని దీర్ఘచతురస్రాకార టిన్‌లో 180 డిగ్రీల వద్ద 45 నిమిషాలపాటు ఒవెన్‌లో పెట్టాలి. టూత్‌పిక్‌తో ఉడికిందో లేదో చూసుకోవాలి. కేక్ చల్లారిన తర్వాత ముక్కలుగా కట్ చేసుకంటే సరిపోతుంది.

స్ట్రాబెర్రీ పేస్ట్రీ

కావాల్సినవి :

చక్కెర : 100 గ్రా. **మైదాపిండి :** 100 గ్రా. **కోడిగుడ్లు :** 3 **నూనె :** 20 గ్రా. **స్ట్రాబెర్రీ ఫ్లేవర్ :** 4 గ్రా.

ఐసింగ్ కోసం

విప్ క్రీమ్ : 100 గ్రా. **చక్కెర :** 20 గ్రా. **స్ట్రాబెర్రీ ఫ్లేవర్ :** సరిపడా **స్ట్రాబెర్రీ రెడ్‌కలర్ :** సరిపడా

స్ట్రాబెర్రీ సిరప్ కోసం

నీరు : 100 గ్రా. **పొడి చక్కెర :** 30 గ్రా. **స్ట్రాబెర్రీ ఫ్లేవర్, కలర్ :** సరిపడా

తయారీ :

ఒక గిన్నెలో స్ట్రాబెర్రీ సిరప్‌కి కావాల్సిన పదార్థాలన్నింటినీ వేసి కలుపండి. అలాగే ఐసింగ్ కోసం కూడా మరొక గిన్నెలో పదార్థాలు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి. తర్వాత కేక్ తయారీకి బౌల్‌లో గుడ్లు, చక్కెర, స్ట్రాబెర్రీ ఫ్లేవర్, మైదాపిండి వేసి బాగా కలుపాలి. దీనికి కొంచెం నూనె కూడా వేసి కలుపాలి. ఈ మిశ్రమాన్ని 45 నిమిషాలపాటు 180 డిగ్రాల వద్ద ఒవెన్‌లో పెట్టాలి. బయటకు తీసాక చల్లారనివ్వాలి. తయారు చేసుకున్న స్ట్రాబెర్రీ షుగర్ సిరప్, ఐసింగ్‌తో కేక్‌ను అలంకరించుకోవాలి.

మ్యాంగో పేస్ట్రీ

కావాల్సినవి :

చక్కెర : 100 గ్రా. **మైదాపిండి :** 100 గ్రా. **కోడిగుడ్లు :** 3 **నూనె :** 20 గ్రా. **మ్యాంగో ఫ్లేవర్ :** 4 గ్రా.

ఐసింగ్‌కోసం

విప్ క్రీమ్ : 100 గ్రా. **చక్కెర :** 20 గ్రా. **మ్యాంగో ఫ్లేవర్, ఎల్లోకలర్ :** సరిపడా

మ్యాంగో షుగర్ సిరప్ :

నీరు : 100 గ్రా. **పొడి చక్కెర :** 30 గ్రా. **మ్యాంగో ఫ్లేవర్, ఎల్లోకలర్ :** సరిపడా

తయారీ :

ముందుగా సిరప్‌కోసం పదార్థాలను బాగా కలుపాలి. అలాగే ఐసింగ్ కోసం కూడా పదార్థాలను కలిపి పెట్టుకోవాలి. తర్వాత ఒక గిన్నె తీసుకొని గుడ్లు, చక్కెర వేసి బాగా కలుపాలి. దీనిలో మైదాపిండిని, మ్యాంగో ఫ్లేవర్, నూనె జోడించాలి. ఈ మిశ్రమాన్ని 180 డిగ్రీల వద్ద 45 నిమిషాలపాటు ఒవెన్‌లో పెట్టాలి. తర్వాత చల్లారనివ్వాలి. కేక్‌మీద స్పూన్‌తో సిరప్ పోయాలి. ఐసింగ్‌తో కావాల్సిన విధంగా కేక్ అలంకరించుకోండి.

సయ్యద్ ఇర్ఫాన్
సుభాన్ బేకరీ
నాంపల్లి

ఆకాంక్ష ఆశయం

ఆ సంఘటన ఆమెను కదిలించింది. పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వామిని చేసింది. ఆమె ఆలోచనే నాలుగు గ్రామాల మహిళలకు ఉపాధిగా మారింది. వారందరినీ ప్రకృతికి మేలు చేసే బాటవైపు మళ్లించగలిగింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆకాంక్షతమర్కర్ ప్రకృతికి మేలు చేసే ఉత్పత్తులను రూపొందించాలనుకున్నది. ఉద్యోగం చేసి ఆదర్శంగా నిలువాలనుకున్నది ఆకాంక్ష. కానీ ఓ సంఘటన ఆమె జీవితాశయాన్ని మార్చేసింది. పదేండ్ల క్రితం ప్లాస్టిక్ కాగితాలు తిని పది మేకలు చనిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఆకాంక్ష ఎంతో చలించిపోయింది. మూగజీవులను బలికొంటున్న ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలనుకున్నది. వాటివల్ల పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లుతున్నదో తన గ్రామస్తులకు వివరించింది. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాలను గురించి అన్వేషించింది. పాతపేపర్లతో సరికొత్త ఉత్పత్తులను తయారు చేసే పద్ధతులను అనుసరించింది. ప్లాస్టిక్ ఉత్పత్తులకు బదులు పాతకాగితాలతో తయారు చేసిన వస్తువులను రూపొందించింది. ఆమె తయారు చేసిన వస్తువుల్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఇంట్లో అలంకరణ వస్తువులతోపాటు నిత్యం ఉపయోగించే చేతి సంచులు సైతం తయారుచేయడం మొదలు పెట్టింది. ఆకాంక్ష రూపొందించిన ఉత్పత్తులు కొనుగోలు చేసేవారి సంఖ్య వేలకు చేరుకున్నది. తన గ్రామంలోని స్వయం సహాయక మహిళలకు కాగితాలతో నూతన ఉత్పత్తులు ఎలా తయారు చేయాలో శిక్షణ ఇవ్వాలనుకున్నది. మొదట 10మంది మహిళలకు తర్ఫీదు ఇచ్చింది. ఆ తర్వాత మరికొన్ని స్వయం సహాయక మహిళా బృందాలు శిక్షణ పొందడానికి ఆమె ఇంటి వద్ద క్యూ కట్టాయి. ఆకాంక్ష ఇతర గ్రామాలకు చెందిన మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టింది. గతంలో అక్కడి గ్రామస్తులు రోజంతా కష్టపడితే గానీ కడుపు నిండేది కాదు. ఇప్పుడు వారంతా ఆమె వద్ద శిక్షణ పొందారు. పాతపేపర్లతో పలురకాల ఉత్పత్తులు తయారు చేస్తూ రోజుకు రూ.300లకుపైగా సంపాదించగలుగుతున్నారు. ప్రకృతికి మేలు చేయాలన్న ఆకాంక్ష ఆశయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

పాలకూరలో పోషకాలు మెండు

- అనీమియా ఉన్న వారికి పాలకూర బాగా పనిచేస్తుంది.
- ఈ కూరలో విటమిన్-ఏ పాళ్లు చాలా ఎక్కువ. కళ్లకు మేలు చేసి, చూపును పదిలంగా ఉంచుతుంది.
- పాలకూరలో విటమిన్-సి కూడా ఉంటుంది. క్రమం తప్పకుండా పాలకూర తినేవారికి మంచి వ్యాధినిరోధక శక్తిని సమకూర్చుతుంది.
- పాలకూర క్రమం తప్పక తినేవారికి గుండెజబ్బులు, హైబీపీ వంటి అనారోగ్య సమస్యలు అంత తేలిగ్గా రావు.
- పాలకూరలో పొటాషియం, మాంగనీస్, మెగ్నీషియమ్, కాపర్ జింక్ వంటి ఖనిజ లవణాలు, ఇతర పోషకాలు ఎక్కువ.
- మేనిని నిగారింపజేస్తూ చర్మాన్ని చాలాకాలం యవ్వనంగా ఉంచడానికి ఈ ఖనిజ లవణాలు దోహదం చేస్తాయి.

సిరిముగ్గు

23 చుక్కలు
3 వరసలు
3 వచ్చేవరకు

ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:

సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

పి. సరిత,
వినోభానగర్, షేక్‌పేట్,
హైదరాబాద్.

కోపతాపాలు తగ్గించుకోండిలా!

- భార్య లేదా భర్త కోపంగా ఉంటూ మాట్లాడకుండా ఉంటే సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వొచ్చు. అలా సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వడం వల్ల వాళ్లు చాలా సంతోషిస్తారు. అంతవరకు ఉన్న కోపం తగ్గిపోతుందని పరిశోధకులు వెల్లడిస్తున్నారు.
- వివాహమైన కొన్నేండ్లకు భార్య ఆశయాలను, ఇష్టాలను భర్త పట్టించుకోడు. కానీ కెరీర్‌లో ఎంత బిజీగా ఉన్నా.. తన కోరికలను ఎప్పుడూ విస్మరించవద్దని మానసిక నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న కోరికలు, ఇష్టాలకు విలువ ఇచ్చినప్పుడే తనపై బాగా కేరింగ్ ఉందని భార్య అనిపిస్తుందని
- తాను కోపంలో ఉన్నప్పుడు భర్త బతిమాలాలని భార్య కోరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎంత కోపం ఉన్నా.. బతిమాలితే చాలు కోపం పూర్తిగా తగ్గిపోతుందంటున్నారు.
- కోపంలో చెరో మాట పెరుగుతుంది. గత ప్రస్తావనలన్నీ గుర్తుకొస్తాయి. దీంతో ఉన్న గొడవ కాస్త పెద్దదవుతుంది. వీలైనంత వరకు పాత విషయాల్ని కోపంలో ఉన్నప్పుడు ప్రస్తావించకపోవడమే మంచిది.
- గొడవ జరిగే సమయంలో చేతిలో ఏది ఉంటే దాన్ని విసిరేస్తూ ఉంటారు. మరి కొందరు పంతానికి వెళ్లి రోజుల తరబడి మాట్లాడుకోరు. కానీ భార్య భర్తలిద్దరిలో ఎవరో ఒకరు రాజీ పడితే సమస్య అక్కడి కక్కడే పరిష్కారమవుతుంది.

వంటింటి చిట్కాలు

- పచ్చళ్లు, నూనె, వెన్న, పాలు రాగి పాత్రల్లో నిల్వ ఉంచితే మంచిదికాదు. వాటిని రాగిపాత్రల్లో నిల్వ ఉంచినప్పుడు నెగటివ్ రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంది.
- పచ్చడిని జాడిలో వేసే ముందు కొద్దిగా వేడి చేసిన నూనెను పొడిగుడ్డలో ముంచి జాడి లోపల తుడిస్తే పచ్చడి బూజు పట్టదు.
- సాల్ట్ నిల్వ చేసుకునే డబ్బాలకు ఎప్పుడూ మూత పెట్టి ఉండాలి. లేదంటే దానిలో ఉండే అయోడిన్ గాల్లో కలిసిపోయి అయోడిన్ లోపం వస్తుంది.
- వంటగదిలో చీమలు ఎక్కువగా తిరుగుతుంటే ఒక దోసకాయను ముక్కలుగా కట్ చేసి చీమలు తిరిగే చోట ఉంచాలి.

చర్మసౌందర్యానికి కొబ్బరిపాలు!

చర్మ సౌందర్యం కోసం తాపత్రయపడని వారుండరు. అందుకోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. మార్కెట్లో దొరికే రసాయనిక క్రీమ్స్ వాడుతుంటారు. ఫలితంగా ఉన్న అందాన్ని కాస్తా పోగొట్టుకుంటారు. ఈ చిట్కాలు పాటిస్తే చర్మ సౌందర్యాన్ని పొందవచ్చు.

- గోరువెచ్చని నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్, కొబ్బరి పాలు కలలుపాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల బాగా నిర్జీవమైన చర్మం తిరిగి తాజాదనాన్ని సంతరించుకుంటుంది. కొబ్బరిపాలను నేరుగా చర్మానికి అప్లై చేసుకొని సాఫ్ట్‌గా మర్దనా చేసుకోవచ్చు. ఇలా చేస్తే చర్మానికి తేమ అందుతుంది.
- గులాబీ రేకులు, చెంచా తేనె, అరకప్పు కొబ్బరి పాలను బకెట్ గోరువెచ్చని నీటిలో వేసుకొని స్నానం చేయాలి. దాని వల్ల శరీరానికి తగిన తేమ అంది మేని కాంతివంతంగా తయారవుతుంది.
- కొబ్బరి పాలల్లో రెండు చుక్కల నిమ్మరసం కలిపి పది నిమిషాల తర్వాత అందులో దూదిని ముంచి ముఖమంతా అద్దుకోవాలి. కాసేపయ్యాక కడిగేస్తే ముఖంపై పేరుకున్న మురికి తొలిగి తాజాగా మారుతుంది.
- కప్పు కొబ్బరి పాలల్లో చెంచా చొప్పున బాదం, తులసి పొడులు, రెండు చుక్కల తేనె చేర్చాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత నీటితో తడిపి నలుగులా రుద్దాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే మృతకణాలు తొలగి చర్మం మృదువుగా తయారవుతుంది.

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 26 డిసెంబర్ 2019
raithubadi@ntnews.com

వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు సమయానుకూలంగా తగిన పద్ధతులు ఆచరించాలి. తద్వారా సాగు చేసే పంటలలో ఆశించిన దిగుబడులను సాధించవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నెలలో వివిధ పంటలలో చేపట్టాల్సిన చర్యలను గురించి గడ్డిపల్లి కేవీకే మృత్తికా శాస్త్రవేత్త అరికెల కిరణ్ వివరించారు. దీనిపై మరింత సమాచారం కోసం 7893989055 నెంబర్‌లో వారిని సంప్రదించవచ్చు. వారు తెలిపిన వివరాలు..

వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన చర్యలు

తగిన పద్ధతుల ద్వారానే ఆశించిన దిగుబడులు.. సిఫార్సు చేసిన మోతాదులోనే మందులు పిచికారీ చేసుకోవాలి

అరికెల కిరణ్

వరి: నవంబర్ మాసంలో పోసిన వరి నారును ఈ నెలలో నాటు వేయాలి. రసాయనాలతో కలుపు నివారణకు గాను ఏకవార్షిక గడ్డి, తుంగజాతి కలుపు సమస్య అయినట్లైతే బ్యూటాక్లోర్‌ను హెక్టారుకు 2.5 లీటర్ల నుంచి 3 లీటర్లు లేదా అనిలోగార్డ్ 1.25 లీటర్లు 10 కిలోల ఇసుకలో కలిపి నాటిన 3- 5 రోజులలో ఎకరా పొలంలో ఒక అంగుళం వరకు నీరు ఉంచి సమానంగా చల్లాలి. ఊద సమస్య అధికంగా ఉంటే బెంథియోకార్బ్ హెక్టారుకు 3 లీటర్లు 100 కిలోల ఇసుకలో కలిపి సమానంగా చల్లాలి. ఎరువులైతే హెక్టారుకు 120 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 40 పొటాష్‌ను ఇచ్చే ఎరువులు వేయాలి. నత్రజని మూడు సమభాగాలుగా నాట్లు వేసేటప్పుడు. నాటు వేసిన 10-12 రోజులలో, మిగిలిన మూడవభాగాన్ని అంకురార్పణ దశలో వేయాలి.

మక్కజొన్న: యాసంగి పంటగా నవంబర్ 15లోగా విత్తిన మక్కజొన్న పైరు వయస్సు 30-35 రోజుల లోపు ఉన్నప్పుడు

అంతరకృషి చేసి హెక్టారుకు 75 కిలోల నత్రజనిని ఇచ్చే ఎరువు వేయాలి. పైపాటు ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగిన తేమ ఉండేలా చూసుకోవాలి. 30-40 రోజులున్న పంటకు అధిక నీరు హానికరం. కాండం తొలుచుపురుగు ఎక్కువగా యాసంగిలో మక్కజొన్నను ఆశిస్తుంది. పంట మొలకెత్తిన 10- 20 రోజుల నుంచి ఆశిస్తుంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ ఎకరాకు 320 మి. లీ.లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్నిబట్టి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున పంట మొలకెత్తిన 25-30 రోజులకు ఆకు సుడులలో వేయాలి.

కంది: వానకాలం పంటగా వేసిన దీర్ఘకాలిక కంది రకాలు పూత, కాయ దశలో ఉన్నందున శనగ పచ్చ పురుగు, మారుకా మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తాయి. కాబట్టి శనగపచ్చ పురుగు నివారణకు తొలిదశలో క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లు, క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లు లేదా ఎసిఫేట్‌ను 1.5 గ్రాములతో పాటు 5 మి.లీ.ల వేపనూనెను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన తర్వాత కూడా శనగపచ్చ పురుగు ప్రభావం తగ్గనట్లైతే ఇమిడాక్సాకార్బ్ 1 మి.లీ. లేదా 0.3 మి. లీ. స్పైనోసాడ్ లేదా 0.3 మి.లీ.ల క్లోరోంట్రానిలిప్రోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మారుకామచ్చల పురుగు: ఈ పురుగు ఆకులను, పూతనంతా ఒక దగ్గరకు చేర్చి గూడుగా మార్చి నష్టపరుస్తుంది. దీని నివారణకు క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీలు+ 1 మి.లీ. డైక్లోరోవాస్ లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పురుగు తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నట్లైతే థయోడికార్బ్ 1 గ్రాము లేదా స్పైనోసాడ్/ ఫ్లూ బెండమైడ్ 0.3 మి.లీ.ల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పల్లి: అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు వేసిన పల్లి పంట ప్రస్తుతం పూతదశలో ఉన్నది. కాబట్టి చివరిసారిగా అంతరకృషి చేసి హెక్టారుకు 500 కిలోల జిప్సాన్ని 5 సెం.మీల లోతులో మొక్క దగ్గర వేసి మట్టితో ఎగదోసి నీరుపెట్టాలి.

శనగ: యాసంగిలో సాగు చేసిన శనగ పంటకు ఈ నెలలో సాధారణంగా పచ్చపురుగు లేదా రబ్బరు పురుగు ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది. వీటి నివారణకు తొలిదశలో 2.5 మి.లీ.ల క్లోరోపైరిఫాస్ లేదా 2 మి.లీల క్వినాల్‌ఫాస్ లీటరు

నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరమైతే స్పైనోసాడ్ 0.3 మి.లీలు లేదా డై ఫ్యూ బెంజురాన్ 1 మి.లీ.లు లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో 1 లేదా 2 సార్లు పిచికారీ చేయాలి.

పొద్దుతిరుగుడు: ఆరుతడి పంటగా నవంబర్‌లో వేయడానికి వీలుగానీ పరిస్థితులలో ఈ నెలలో విత్తుకోవచ్చు. హైబ్రిడ్ రకాలను సాగు చేసుకోవడం మంచిది. హైబ్రిడ్ రకాలలో కెబిఎస్ హెచ్-44, ఎన్‌డీఎస్‌హెచ్-1, డీఆర్‌ఎస్‌హెచ్-1, ఎపిఎస్

హెచ్-66 రకాలు అనువైనవి. నవంబర్ మాసంలో విత్తిన పంటకు విత్తిన తేదీని బట్టి 30-35 రోజులలో హెక్టారుకు 40 కిలోలను ఇచ్చే నత్రజని ఎరువులు వేయాలి.

కుసుమ: కుసుమ పంటకు విత్తిన 40-45 రోజుల వరకు పేను తాకిడి చాలా ప్రమాదకరమైంది. దీని నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ.లు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ.లు లేదా క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ.లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు పంట వేసిన 20 రోజుల నుంచి పూత దశ వరకు ఆశిస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

నట్టె కోటేశ్వర్‌రావు, 9989944945
గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా

గులాబీరంగు కాయతొలుచు పురుగు

నివారణ పద్ధతులు

ప్రస్తుతం పత్తి 160-180 రోజుల్లో కాయ పగిలే దశలో ఉన్నది. చాలాచోట్ల పత్తిని 1-2 సార్లు తీశారు. గత నవంబర్ మాసం నుంచి నెలకొన్న చల్లని వాతావరణం వలన పత్తిని గులాబీరంగు కాయతొలుచు పురుగు ఆశించి చాలాచోట్ల నష్టపరుస్తున్నది. అట్లనే చేన్లలో అమర్చిన లింగాకర్షక బుట్టలలో కూడా మగ రెక్కల పురుగులు పడటం గమనించడం జరుగుతున్నది. కొన్నిచోట్ల కాయలలో ఈ పురుగు ఆర్థిక నష్టపరిమితిని దాటి నష్టపరిచింది. ఈ పురుగు లార్వాలు కంటికి లేదా

బయటకు కనిపించకుండా పెరిగే కాయలలో ఉండి గింజలను తింటూ దూదిని నష్టపరుస్తాయి. ఈ పురుగు ద్వారా జరిగే ఆర్థిక నష్టం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ పరిస్థితులలో ఈ పురుగు ఉధృతి మరింత పెరుగకుండా సరైన యాజమాన్య పద్ధతులను పాటించి ప్రస్తుత పంటను, రాబోయే పంటను కాపాడుకునే ప్రయత్నం చేయాలి.

ఈ పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు

- ప్రస్తుత దశలో పురుగు ఉధృతిని బట్టి 1 లేదా 2 సార్లు సింథటిక్ పైరిత్రాయిడ్, ఇతర కీటక నాశని కలిసిన మిశ్రమ మందులైన క్లోరోపైరిఫాస్+ సైపర్‌మెత్రిన్ 2 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్+సైపర్‌మెత్రిన్ 2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ + లామ్డాసెహలోత్రిన్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.
- ఒకవేళ పురుగు తాకిడి నష్టపరిమితి (10 కాయలలో 1 పురుగు) కన్నా తక్కువగా ఉంటే స్పైనోసాడ్ 0.35 మి,లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా లేదా స్పైనెటోరామ్ 0.9 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 1-2 సార్లు పిచికారీ చేయాలి.
- పత్తి పంట కాలాన్ని పొడిగించకుండా 180-200 రోజుల్లో పంటను పూర్తి చేసి, జనవరి రెండవ పక్షం నుంచి నీరు ఉన్నట్లయితే ఆరు తడి పంటలైన తెల్ల నువ్వులు, పెసర, జొన్న, మక్కజొన్న లాంటి పంటలను సాగు చేసుకోవాలి.
- పత్తి తీసిన తర్వాత, చేన్లను పశువులు లేదా గొర్రెలతో మేపాలి. దీనిద్వారా పురుగు అవశేషాలు కూడా నాశనం చేయబడుతాయి.
- అటు తర్వాత పత్తి మోళ్ళను ట్రాక్టర్ డ్రెడ్డర్ లేదా రోటావేటర్ సహాయంతో భూమిలో కలియదున్నాలి. దీనిద్వారా భూమి సారవంతమవడమే కాకుండా గులాబీరంగు కాయతొలుచు పురుగు అవశేషాలు కూడా పూర్తిగా నశించబడుతాయి. ఫలితంగా రాబోయే వానకాలంపంటలో పురుగు ఉధృతిని చాలావరకు తగ్గించుకునే అవకాశముంటుంది.
- పత్తి చేన్లను శుభ్రం చేయడంతో పాటుగా, పురుగు ఆశించిన పత్తిని ఎక్కువరోజులు నిల్వ ఉంచకుండా త్వరగా మార్కెట్లో అమ్మివేయాలి.
- పత్తి మోళ్ళను నిల్వచేసి వంట చెరుకుగా ఉపయోగించరాదు. మోళ్ళను చేనులోనే కలియదున్నాలి లేదా నిర్మూలించాలి.
- జిన్నింగు మిల్లులలో పత్తి తీయగా వచ్చిన వ్యర్థ పదార్థాలను మిల్లు ఆవరణలో, బయట ఎక్కువరోజులు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు తీసివేయాలి.
- జిన్నింగు మిల్లుల్లో లైట్‌ట్రాప్స్ (దీపపు ఎరలను), లింగాకర్షక బుట్టలను అమర్చి వాటిద్వారా పడిన రెక్కల పురుగులను ఎప్పటికప్పుడు నిర్మూలించాలి.
- పత్తి జిన్నింగు పూర్తికాగానే, మిల్లు ఆవరణంతా శుభ్రంచేసి ఉంచితే వచ్చే పత్తి పంటలో గులాబీరంగు కాయ తొలుచు పురుగు ఉధృతి బాగా తగ్గుతుంది.

-ఎ. సుదర్శనమ్
ప్రధాన శాస్త్రవేత్త (పత్తి)
-డాక్టర్ బి. రాంప్రసాద్
సీనియర్ శాస్త్రవేత్త (పత్తి కీటక విభాగం)

సేంద్రియ ఎరువుల తయారీ విధానం

పంటల్లో అధిక దిగుబడులు సాధించడానికి రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూసారం దెబ్బ తింటున్నది. పర్యావరణ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. కాబట్టి రైతులు సేంద్రియ ఎరువులును తమస్థాయిలోనే తయారు చేసుకోవచ్చు. వాటిద్వారా పండించే పంటలకు మార్కెట్లో కూడా మంచి డిమాండు ఉన్నది. సేంద్రియ ఎరువులు తయారు చేసుకునే విధానాల గురించి తెలుసుకుందాం.



కంపోస్టు ఎరువు

మిగిలిపోయిన వ్యవసాయ వ్యర్థాలతో ఈ ఎరువు తయారుచేసుకోవచ్చు. ఎత్తయిన ప్రదేశంలో 1 మీ. లోతు, 2 మీ. వెడల్పు, అవసరమైనంత పొడవు గొయ్యి తవ్వాలి. వ్యర్థాలను 30 సెం.మీ. మందం పొరలుగా పేరుస్తూ, మధ్య మధ్యలో పేడ కలిపిన నీళ్లను, 8-10 కి. సూపర్ ఫాస్ఫేట్ చొప్పున ఒక్కొక్క పొరలో వేస్తూ నేల మట్టానికి అరమీటరు ఎత్తువరకు నింపాలి. పైన పేడ మట్టితో అలకాలి. 3-4 నెలల్లో వ్యర్థాలు చివికి కంపోస్టు తయారవుతుంది. పట్టణ వ్యర్థాలతోనూ కంపోస్టు చేయవచ్చు. గ్రామీణ కంపోస్టులో కన్నా పట్టణ కంపోస్టులో అధిక పోషకాలుంటాయి.

బయోగ్యాస్

చిక్కగా తయారుచేసిన పేడ ద్రావణాన్ని కొన్ని రోజులపాటు ట్యాంకుల్లో గాలి తగులకుండా మురగబెట్టి నప్పుడు సూక్ష్మజీవుల చర్య ఫలితంగా వెలువడే ఇంధన వాయువును బయోగ్యాస్ (గోబర్ గ్యాస్) అంటారు. దీనిలో 50-60 శాతం మీథేన్ 30-40 శాతం, బొగ్గుపులుసు వాయువు, 10 శాతం హైడ్రోజన్ ఉంటాయి. ఇంధనంగా వాడుకోగా మిగిలిపోయిన పేడ సారవంతమైన సేంద్రియ ఎరువుగా తోడ్పడుతుంది.

పశువుల పేడ ఎరువు

పశువుల సంఖ్యను బట్టి కొట్టాల వద్ద అవసరమైనంత పొడవు, వెడల్పుతో 3 అడుగుల లోతు గుంతను తవ్వుకోవాలి. పశువుల పేడ, మూత్రంతో తడిసిన చెత్త, పశువులు తినగా మిగిలిన గడ్డిని గోతిలో 6 అంగుళాల ఎత్తు వరకు నింపి దాని పైన నీటిని చిలకరించి, 2-3 కి. సూపర్‌ఫాస్ఫేట్ వేసి మట్టితోగాని, బురదతో

గాని కప్పాలి. ఇలాగే భూమట్టానికి 1-1.5 అడుగుల ఎత్తువరకు గోతినంతా నింపుతూ మట్టితో/ బురదతో కప్పాలి. 3-4 నెలల్లో బాగా కుళ్లి నేలలో వేయటానికి తయారవుతుంది.

జీవాల ఎరువు

పశువుల ఎరువు మాదిరి మేకలు/గొర్రెల దొడ్లో వచ్చే ఎరువును భద్రపరిచి వాడుకోవచ్చు. ఎండాకాలంలో రాత్రిపూట వీటిని నేరుగా పొలాల్లో మంద కట్టడంవల్ల వీటి మల, మూత్రాలు నేరుగా పొలంలో పడి మంచి ఎరువుగా ఉపయోగపడుతాయి.

కోళ్ల ఎరువు

40 కోళ్ల నుంచి ఒక సంవత్సరంలో టన్ను ఎరువు తయారవుతుంది. కేజెస్ కన్నా డీప్‌లిట్టర్ ఎరువులో పోషకాలు ఎక్కువ. కేజెస్ ఎరువులో తేమ తగ్గేకొద్దీ పోషక శాతం పెరుగుతుంది. షెడ్ నుంచి తీసిన తర్వాత టన్ను కోడి ఎరువుకు 5-10 కి. సూపర్ ఫాస్ఫేట్ కలిపి కొన్నిరోజుల పాటు గొయ్యిలో/ కుప్పలుగా పోసి వాడటంవల్ల పోషకాలు పెరుగుతాయి. ఎకరాకు సాధారణ పంటలన్నింటికి 2 టన్నులు, చెరకుకు 3 టన్నుల చొప్పున కోళ్ళ ఎరువు వేయవచ్చు. నీటి వసతిగల పొలాల్లో ఈ ఎరువు బాగా పనిచేస్తుంది. దీనిలో సూక్ష్మపోషకాలు కూడా ఉంటాయి.

పచ్చిరొట్ట ఎరువులు

జీలుగ, జనుము, అలసంద, పిల్లి పెసర, పెసర, మినుము, అవిసె వగైరా పచ్చిరొట్ట పైర్లను పెంచి పూత దశలో నేలలో కలి

యదున్నాలి. ఇవి నేలలో సేంద్రియ పదార్థాన్ని చేరుస్తాయి. వేర్ల బుడిపెల్లోని సూక్ష్మజీవులు నత్రజనిని అందిస్తాయి. ఎకరానికి జనుము 20-25 కిలోలు, జీలుగ 12-15 కిలోలు, పిల్లి పెసర 5-6 కిలోలు, అలసంద 14-15 కిలోలు, పెసర, మినుము 6-7 కిలోలు. విత్తనం వాడాలి.

కావేటి పావని
ఎమ్మెస్సీ అగ్రానమి
హైదరాబాద్

మిరపలో నాణ్యతను పెంచడానికి సూచనలు

మిరప పంటలో అధిక దిగుబడి పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఉద్యానవన అధికారులు అందించిన వివరాలు. మిరప పంటలో అధిక దిగుబడి పొందడానికి చెట్లపై పండిన కాయలను ఎప్పటికప్పుడు కోయాలి. వాటిని పట్టాలపై కాని, సిమెంట్ కళ్లాలపైన గాని ఆరబెట్టడం ఉత్తమమైన మార్గం. నీటి ఆధార పంటకు 6-8 కోతలు కోయవచ్చని తెలిపారు.

నాణ్యత పెంచడానికి

- మొక్కల మీద మిరపకాయలను పండనివ్వరాదు. ఎక్కువగా పండితే మిరప నాణ్యత తగ్గుతుంది. ఎప్పటికప్పుడు పండిన కాయలను కోయాలి. దీనివల్ల దిగుబడులు పెరుగుతాయి.
- కాయకోసే ముందు సస్యరక్షణ మందులు పిచికారీ చేయరాదు. పిచికారీ చేస్తే కాయలమీద మందుల అవశేషాలు ఉండే ప్రమాదం ఉంటుంది.
- అఫ్లోటాక్సిన్ వృద్ధి కాకుండా మిరప కాయలను పాలిథీన్ పట్టాల మీద లేదా సిమెంటు గచ్చుమీద ఎండబెట్టాలి.
- రాత్రిపూట మంచుబారిన పడకుండా కాయలను కప్పి ఉంచాలి.
- మిరపలో 10 శాతానికి మించి ఎక్కువ తేమ ఉండకుండా ఎండబెట్టాలి.
- ఎండబెట్టేటప్పుడు దుమ్ము, ధూళి, చెత్త, చెదారం చేరకుండా కాయలు శుభ్రంగా ఉండేలా చూడాలి.
- కాయలు ఎండబెట్టే దరిదాపుల్లో కుక్కలు, పిల్లులు, కోళ్లు, ఎలుకలు, పందికొక్కులు రాకుండా చూసుకోవాలి.
- తాలు కాయలను, మచ్చకాయలను గ్రేడింగ్ చేసి వేరుచేయాలి.
- నిల్వచేయడానికి తేమ లేనటువంటి శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నింపాలి.
- తేమ తగులకుండా వరిగడ్డి లేదా చెక్కబల్లల మీద గోడలకు 50-60 సెం.మీ. దూరంలో నిల్వ ఉంచాలి.
- అవకాశం ఉన్నచోట శీతల గిడ్డంగుల్లో నిల్వచేయాలి. తద్వారా రంగు, నాణ్యత తగ్గిపోకుండా లాభదాయకంగా ఉంటుంది.
- కాయలు మంచి రంగు రావడం కోసం ఎలాంటి రసాయనాలను, రంగులను వాడవద్దు. వాటివల్ల ప్రమాదకరమని నిషేధించబడినాయి.
- అకాల వానలకు గురికాకుండా, మంచుబారిన పడకుండా, రంగు కోల్పోకుండా ఆధునిక డ్రయ్యర్లలోగాని లేదా టబాకో బారన్‌లలో గాని ఎండబెట్టాలి. ఫలితంగా మంచి మిరప కాయలను పొందవచ్చు.

ఆసరి రాజు

epaper.ntnews.com

అమరచింతలో ఓంకారనాదం

- 508 మంది మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో పడిపూజ
- హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సొంతం

ఆత్మకూరు, నమస్తే తెలంగాణ: ఓంకార నాదంతో వనపర్తి జిల్లా అమరచింత మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాల మైదానం మార్మోగింది. శ్రీ ఫౌండేషన్ అధినేత కాడిగి శ్రీనివాసులు (గణేశ్) నేతృత్వంలో 508 మంది అయ్యప్పమాలధారులు బుధవారం ఓంకార రూపంలో రెండుగంటల పాటు అయ్యప్ప శరణుఘోష వినిపించి హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సాధించారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు రాజ్ దేశ్‌పాండె ముఖ్యఅతిథిగా హాజరైన పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వామి గోపాలకృష్ణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధులు సుమన్ పల్లె, శ్రీధర్ పురస్కారం అందజేశారు.

వనపర్తి జిల్లా అమరచింతలో ఓంకార రూపంలో పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు, హైరేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పురస్కారాన్ని అందుకుంటున్న కాడిగి శ్రీనివాసులు

కొండగట్టులో అంజన్న భక్తుల రద్దీ

మల్యాల: జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొన్నది. ఆలయ ప్రాకార మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అష్టోత్తర శతనామావళి పూజ, స్వామివారికి అభిషేకం, భజన, హారతి తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి అప్పారావు, జగిత్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ బేతి రాజేశం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయఅధికారులు స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేకపూజలు చేయించి ఆలయ ప్రాకార మండపంలో శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు అంజయ్య, శ్రీనివాస్ శర్మ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

అన్నివర్గాలకు అండగా ప్రభుత్వం

- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- గోపాల్‌పేట, రేవల్లిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గోపాల్‌పేట/రేవల్లి: తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలను ఆదుకుంటున్నదని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో, రేవల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచుల పెండ్లికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి ద్వారా సాయం అందజేస్తున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని పేర్కొన్నారు. అనంతరం రేవల్లిలో లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మహిళలు, నాయకులతో మాట్లాడి సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించారు.

ప్రజల హృదయాల్లో వాజపేయి

- మాజీ ప్రధాని 95వ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- దేశాన్ని వాజపేయి అజేయమైన శక్తిగా మార్చారన్న అమిత్ షా
- విద్యావేత్త మదన్‌మోహన్ మాలవీయకు కూడా నివాళి

న్యూఢిల్లీ, డిసెంబర్ 25:

దేశ ప్రగతికి ఎనలేని కృషి చేసిన అటల్ బిహారీ వాజపేయి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి 95వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ కురువృద్ధుడు ఎల్ కే అద్వానీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, వాజపేయి కుటుంబ సభ్యులు ఆయనకు బుధవారం నివాళులు అర్పించారు. ఢిల్లీలోని వాజపేయి స్మారకం 'సదైవ అటల్' వద్దకు చేరుకుని పుష్పాంజలి ఘటించారు. 'దేశప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అటల్ బిహారీ వాజపేయికి నివాళులు' అని మోదీ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తున్న ఓ వీడియోను మోదీ పోస్ట్ చేశారు. విద్యావేత్త, రాజకీయవేత్త మదన్ మోహన్ మాలవీయ 158వ జయంతి సందర్భంగా ఆయనకు కూడా మోదీ నివాళులు అర్పించారు. 'పండిత్ మదన్ మోహన్ మాలవీయజీకి ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నా. మాతృ దేశ సేవల కోసం ఆయన జీవితాన్ని ధారపోశారు' అని మోదీ ట్విట్టర్‌లో కీర్తించారు. విద్యారంగంలో మాలవీయ నిరుపమాన సేవల్ని అందిస్తూనే మరోవైపు స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని ప్రధాని ప్రశంసించారు. ఆయన ఆదర్శ భావాలు దేశ ప్రజలకు ఎప్పుడూ ప్రేరణగా ఉంటాయన్నారు. మరోవైపు, బీజేపీ అధ్యక్షుడు, హోంమంత్రి అమిత్ షా కూడా దేశానికి వాజపేయి చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు. దేశవ్యాప్తంగా బీజేపీని ఒకవైపు బలోపేతం చేస్తూనే, మరోవైపు వాజపేయి దేశాన్ని ముందుకు నడిపారని అమిత్ షా పేర్కొన్నారు. ఆయన హయాంలో చేపట్టిన పోఖ్రాన్ అణు పరీక్ష, కార్గిల్ యుద్ధంతో ప్రపంచ పటంలో భారత్ అజేయమైన శక్తిగా మారిందని చెప్పారు. మదన్ మోహన్ మాలవీయకు కూడా అమిత్ షా నివాళులు అర్పించారు. స్వతంత్ర భారతంలోని గొప్ప రాజకీయ నాయకుల్లో వాజపేయి ఒకరని, దేశ రాజకీయాలకు ఆయన కొత్త దిశ, గొప్పస్థాయిని చేకూర్చారని రాజ్‌నాథ్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఢిల్లీలోని వాజపేయి స్మారకం 'సదైవ అటల్' వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ

మదన్‌మోహన్ మాలవీయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

రోహ్‌తాంగ్ పాస్ సొరంగానికి వాజ్‌పేయి పేరు

హిమాచల్ ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ పాస్ కింద నిర్మిస్తోన్న 8.8 కిలోమీటర్ల పొడవైన వ్యూహాత్మక సొరంగానికి మాజీ ప్రధాని వాజపేయి పేరును పెట్టినట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. వాజపేయి 95వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 2000లో వాజపేయి ప్రధానిగా ఉండగా ఈ సొరంగ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. రూ. 4వేల కోట్ల వ్యయంతో నిర్మించే ఈ సొరంగం పనులు 2020లో పూర్తి కానున్నాయి.

దుఃఖంలోనూ అవయవాలు దానం

- రోడ్డుప్రమాదంలో గాయపడి మృతిచెందిన మహిళ
- అవయవాలను భద్రపర్చిన యశోద వైద్యులు

లింగాలఘనపురం: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన ఓ మహిళ అవయవాలను ఆమె భర్త దానం చేశారు. ఆయన తీసుకున్న నిర్ణయాన్ని పలువురు హర్షిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నవాబుపేటకు చెందిన పయ్యావుల వెంకన్న ఈ నెల 23న తన భార్య మల్లమ్మ (43)తోకలిసి బైక్‌పై వెళ్తుండగా జనగామ మండలం పెంబర్తి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దంపతులిద్దరూ గాయపడ్డారు. మల్లమ్మ అపస్మారకస్థితికి చేరుకోగా ఆమెను హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు, వెంకన్నను వరంగల్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. మల్లమ్మ బతికే అవకాశాలు లేవని యశోద వైద్యులు చెప్పడంతో ఆమె అవయవాలను దానం చేయాలనుకుంటున్నట్టు భర్త వెంకన్న వైద్యులకు తెలిపారు. మల్లమ్మ బుధవారం ఉదయం మృతి చెందడంతో ఆమె భర్త వెంకన్న కోరిక మేరకు నేత్రాలు, లివర్, కిడ్నీలను దవాఖాన సిబ్బంది భద్రపరిచారు. నవాబ్‌పేటలో బుధవారం సాయంత్రం మల్లమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. లేవలేని స్థితిలోనూ అంత్యక్రియల్లో పాల్గొన్న వెంకన్నను చూసి గ్రామస్థులు కంటతడి పెట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

మల్లమ్మ (ఫైల్)

ఎస్సారార్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం!

- రేపురాత్రికల్లా 25.05 టీఎంసీలు నింపేందుకు చర్యలు
- దిగువమానేరుకు నీటి విడుదల నిలిపివేత
- గాయత్రి పంపుహౌస్ నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన శ్రీరాజరాజేశ్వర (ఎస్సారార్) జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులోభాగంగా దిగువమానేరు జలాశయానికి విడుదల చేస్తున్న నీటిని బుధవారం ఉదయం నుంచి నిలిపివేశారు. గాయత్రి పంపుహౌస్ నుంచి ప్రస్తుతం 9వేల పైచిలుకు క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎస్సారార్ నీటిమట్టం క్రమేపీ పెరుగుతున్నది. శుక్రవారం (ఈ నెల 27) రాత్రికల్లా ఎస్సారార్‌లో పూర్తిస్థాయి నీటి మట్టం 25.05 టీఎంసీలను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మానేరు వాగుపై నిర్మించిన మధ్యమానేరు (ఎస్సారార్).. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన జలాశయం. కాళేశ్వరం జలాలను ఎక్కడకు పంపించాలన్నా ఈ దీని ద్వారానే తరలించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో 25.875 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు సాంకేతిక ప్రొటోకాల్‌ను పరిగణనలోకి తీసుకొని 2017లో ముందుగా 5 టీఎంసీలు నింపారు. 2018లో 9 టీఎంసీలు, ఈ ఏడాదిలో ముందుగా 15 టీఎంసీలు నింపిన తదుపరి క్రమేపీ పెంచుకుంటూ వస్తున్నారు. బుధవారం ఉదయం పదిగంటల వరకు ప్రాజెక్టులో 23 టీఎంసీల నీరు ఉన్నది. లక్ష్మీపంపుహౌస్ నుంచి సరస్వతికి, అక్కడి నుంచి పార్వతి పంపుహౌస్ ద్వారా ఎల్లంపల్లికి ఎత్తిపోతలు కొనసాగుతుండగా.. నంది పంపుహౌస్ నుంచి గాయత్రి పంపుహౌస్‌కు అక్కడి నుంచి 9 వేల పైచిలుకు క్యూసెక్కుల నీటిని ఎస్సారార్‌కు ఎత్తిపోస్తున్నారు. ఈ ప్రక్రియ కొద్దిరోజులుగా నిరంతరాయంగా కొనసాగుతుండగా.. ఎస్సారార్ నుంచి ఎల్ఎండీకి రోజుకు రివర్స్ స్లూయిస్ (తూముల) ద్వారా 9,450 క్యూసెక్కులు వదులుతున్నారు. గాయత్రి పంప్‌హౌస్ నుంచి వచ్చిన నీరు వచ్చినట్టే ఎల్ఎండీకి వెళుతుండటంతో ఎస్సారార్‌లో 23.500 టీఎంసీలకు అటుఇటుగా నీటినిల్వ ఉంటూ వచ్చింది. అయితే, బుధవారం ఉదయం పది గంటల నుంచి ఎస్సారార్ రివర్స్ స్లూయిస్‌ను మూసివేసి అధికారులు ఎల్ఎండీకి నీటివిడుదలను నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం ఎస్సారార్‌లో నీటి మట్టం క్రమేపీ పెరుగుతూ వస్తున్నది. ఎస్సారార్ పూర్తిస్థాయి సామర్థ్యం 25.875 టీఎంసీలు కాగా, శుక్రవారం రాత్రికల్లా 25.05 టీఎంసీల వరకు నింపాలని అధికారులు నిర్ణయించారు. ప్రాజెక్టు పూర్తయ్యాక తొలిసారిగా పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఏర్పడింది.

శ్రీరాజరాజేశ్వర జలాశయం

బండారు సాయమ్మ(ఫైల్)

తోపనపల్లిలో శతాధికురాలి మృతి

నెక్కొండ: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలంలోని తోపనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తోపనపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారు సాయమ్మ (103) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. సాయమ్మ భర్త కిషన్‌గౌడ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దళకమాండర్‌గా పని చేసి గుల్‌బర్గా జైలులో 5ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాడు. కిషన్‌గౌడ్ 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలికి మల్లికార్జున్, వెంకటరమణ, వెంకట్‌నారాయణ, రామదాసు కుమారులతోపాటు కుమార్తె భారతమ్మ ఉన్నారు. కాగా, మృతురాలి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ ఫకీర్, టీఆర్ఎస్ నాయకులు బండారు మురళీ కృష్ణ, చక్రపాణి పరామర్శించారు.

భూసమస్య పరిష్కారానికి టవరెక్కిన రైతు

కరీంనగర్ జిల్లాలో ఎస్సై హామీతో దిగి వచ్చిన బాధితుడు

గన్నేరువరం: తన సోదరుడు, అక్కాచెల్లెళ్లు తమ భూమిని దున్నుకోనియడం లేదని, తరచూ తనతో గొడవలు పడుతూ మానసికంగా వేధిస్తున్నారని, తన సమస్యకు పరిష్కారం చూపడం లేదని, ఆత్మహత్యే శరణ్యమంటూ బుధవారం ఓ వ్యక్తి సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరానికి చెందిన తన తండ్రి నర్సయ్య పేరిట ఐదెకరాల భూమి ఉన్నదని, ఇందులో తనకు 2.20 ఎకరాలు, తన అన్న సైండ్ల బాలయ్యకు 2.20 ఎకరాలు రావాల్సి ఉన్నదని బాధితుడు మల్లయ్య తెలిపారు. తన అన్న.. తమ ముగ్గురు అక్కాచెల్లెళ్లను భూమిలో వాటా తీసుకోవాలని రెచ్చగొట్టాడని, ఐదుగురికి ఒక్కో ఎకరం ఇవ్వాలని నిత్యం వేధిస్తూ పెద్ద మనుషుల వద్దకు తిప్పుతున్నారని వాపోయారు. తనను వ్యవసాయం చేసుకోనివ్వడం లేదన్నారు. 2.20 ఎకరాల భూమి తన పేరిట విరాసత్ చేయకుండా అడ్డు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే తాను టవర్ ఎక్కానని, తనకు రావాల్సిన వాటా భూమి ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు. విషయం తెల్సిన వెంటనే ఎస్సై ఆవుల తిరుపతి సిబ్బందితో ఘటనాస్థలానికి వెళ్లారు. మల్లయ్య సమస్య విని తప్పకుండా చట్టపరంగా న్యాయం చేయడానికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంతో బాధితుడు కిందికి దిగి వచ్చారు. అనంతరం బాధితుడు తనను హింసిస్తున్న సోదరుడు సైండ్ల బాలయ్య, అక్కాచెల్లెళ్ల మీద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో సెల్‌టవర్ ఎక్కిన సైండ్ల మల్లయ్య

సచిన్ భద్రత కుదింపు

- ఆదిత్య ఠాక్రేకు 'జడ్ క్యాటగిరీ' భద్రత
- మహారాష్ట్ర సర్కార్ నిర్ణయం

ముంబై, డిసెంబర్ 25: మహారాష్ట్రలోని ప్రముఖులకు కల్పించే భద్రతను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించింది. మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌కు భద్రతను తగ్గించిన ప్రభుత్వం.. సీఎం ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రేకు భద్రతను పెంచింది. ఇప్పటి వరకు సచిన్‌కు 'ఎక్స్ క్యాటగిరీ' భద్రతను కల్పించిన ప్రభుత్వం ఇకపై ఆయన ఇంటి నుంచి బయటికి వెళ్లినప్పుడు మాత్రమే పోలీసు ఎస్కార్టు భద్రతను కల్పించనుంది. ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వర్లీ నియోజకవర్గం నుంచి గెలిచిన ఆదిత్య ఠాక్రేకు మాత్రం 'జడ్ క్యాటగిరీ' భద్రతను సమకూర్చాలని నిర్ణయించింది. అలాగే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్‌పవార్‌కు 'జడ్ ప్లస్ క్యాటగిరీ', ఆయనకు వరుస కుమారుడైన అజిత్ పవార్‌కు 'జడ్ క్యాటగిరీ' భద్రతను కొనసాగించనుంది. సామాజిక కార్యకర్త అన్నా హజారేకు 'వై ప్లస్ క్యాటగిరీ' సెక్యూరిటీని కల్పించింది. బీజేపీకి చెందిన ఇద్దరు మాజీ మంత్రులు ఏక్‌నాథ్ ఖడ్సే, రామ్ షిండే భద్రతను కుదించింది. 1993 ముంబై వరుస బాంబు పేలుళ్లలాంటి అత్యంత కీలకమైన కేసుల్లో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తరపున వాదించిన ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌కు కూడా భద్రతను తగ్గించింది. గతంలో ఆయనకు 'జడ్‌ప్లస్ క్యాటగిరీ' భద్రతను కల్పించిన ప్రభుత్వం దాన్ని 'వై క్యాటగిరీ'కి కుదించింది.

చైనా ఆయుధశక్తిపై 'సత్యం'తో పోరాడతాం

టిబెటన్ ఆధ్యాత్మిక వేత్త దలైలామా.. సంప్రదాయంగా చైనా బౌద్ధదేశమేనని వ్యాఖ్య

గయ, డిసెంబర్ 25: తుపాకీ శక్తి మీద ఆధారపడి మనుగడలో ఉన్న చైనా కమ్యూనిస్టు ప్రభుత్వంపై తాము 'సత్యం అనే శక్తి'తో పోరాటాన్ని కొనసాగిస్తామని టిబెటన్ ఆధ్యాత్మిక వేత్త దలైలామా చెప్పారు. బీహార్‌లోని బుద్ధగయలో గల మహాబోధి దేవాలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఆయన మాట్లాడుతూ 'మూడేండ్ల క్రితం చైనాలో నిర్వహించిన సర్వేలో టిబెటన్ బౌద్ధుల సంఖ్య భారీగా పెరిగిందని తేలింది. మా వెంట సత్యం అనే శక్తి ఉంది. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఆయుధ (తుపాకీ) శక్తి ఉంది' అని అన్నారు. భారతీయ పురాతన విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని, అహింస, కరుణ, ప్రజాస్వామ్య విలువలను అది బోధిస్తుందన్నారు. 'మానవులుగా మనం కరుణ చూపకుండా ఉండలేం. మనశ్శాంతి సాధనకు ధర్మాన్ని పాటించడం తప్పనిసరి. మతం పేరిట హింసాత్మక ఘటనలకు నిలయంగా మారిన ప్రపంచంలో మానవత్వ విలువలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది' అని దలైలామా చెప్పారు. చైనాలో బౌద్ధుల సంఖ్య పెరుగడంపై ఆయన స్పందిస్తూ.. అధికారికంగా నాస్తికత్వాన్ని ప్రోత్సహిస్తున్న చైనాలో కమ్యూనిస్టు విప్లవం రాకముందు సంప్రదాయంగా ఆ దేశం బౌద్ధ దేశమేనన్నారు. 'చైనాలోని చాలామంది పౌరులు టిబెటన్ బౌద్ధాన్ని అనుసరిస్తున్నారు. చైనాలోని యూనివర్సిటీలలో భారీ సంఖ్యలో బౌద్ధ పండితులు ఉన్నారు' అని వెల్లడించారు. కాలచక్ర దీక్ష ఉత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం రాత్రి దలైలామా బుద్ధ గయకు చేరుకున్నారు. ఆయన 15 రోజుల పాటు బుద్ధ గయలోనే బస చేయనున్నారు. గతేడాది జనవరిలో ఆయన బుద్ధ గయ పర్యటనకు వచ్చినప్పుడు బాంబు పేలుడు సంభవించిన నేపథ్యంలో ఈ దఫా భద్రత కట్టుదిట్టం చేశారు.

ఖమ్మంలో పట్టుబడ్డ గుట్కాలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ గంటా వెంకట్రావు

ఖమ్మంలో భారీగా గుట్కాప్యాకెట్లు పట్టివేత

రూ.75 లక్షల విలువైన సరుకు సాధ్వీనం

ఖమ్మం క్రైం: ఖమ్మం జిల్లా కేంద్రంలో టాస్క్ ఫోర్స్ అధికారులు బుధవారం భారీగా గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పసుమర్తి భాస్కర్ అనే వ్యాపారి మహారాష్ట్ర, బీదర్ ప్రాంతాల్లో నుంచి అక్రమంగా గుట్కాప్యాకెట్లను తెచ్చి ఖమ్మం నగరంలోని ప్రకాశ్ నగర్ వద్ద గోదాములో నిల్వ ఉంచారు. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ గంటా వెంకట్రావు, త్రీటౌన్ పోలీసులు గోదాములో ఆకస్మిక తనిఖీలు జరిపి సుమారు 150 బస్తాలలో నిల్వవుంచిన గుట్కా, తంబాకు ప్యాకెట్లను స్వాధీనం చేస్తుకున్నారు. వీటి విలువ రూ. 75 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్న భాస్కర్‌పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు ఛేదనలో కీలకమైన సమాచారం సేకరించిన టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాము, కానిస్టేబుల్ హమీద్‌లను ఏసీపీ అభినందించారు.

బుర్కినాఫాసోపై ఉగ్రపంజా

- ఏకకాలంలో రెండు ఉగ్రదాడులు
- 35 మంది మృతి.. వారిలో 31 మంది మహిళలు
- 80 మంది ముష్కరులను హతమార్చిన సైన్యం

వాగడొగూ, డిసెంబర్ 25: పశ్చిమ ఆఫ్రికాలోని బుర్కినాఫాసో దేశంపై మంగళవారం ఉగ్రవాదులు పంజా విసిరారు. ఏకకాలంలో రెండు చోట్ల దాడులకు పాల్పడ్డారు. 35 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్నారు. వీరిలో 31 మంది మహిళలే. మరో ఏడుగురు సైనికులు కూడా మృతిచెందారు. ఆ దేశ సైన్యం.. ఉగ్రవాదులను ధీటుగా ఎదుర్కొని 80 మంది ముష్కరులను మట్టుబెట్టింది. పెద్దసంఖ్యలో ఉగ్రవాదులు మంగళవారం సౌం ప్రాంతంలోని అర్బిందాలో ప్రజలు, సైనికులపై కొన్ని గంటల పాటు దాడులకు పాల్పడ్డారని సైన్యం తెలిపింది. 'క్రూరమైన ఈ దాడిలో 35 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో 31 మంది మహిళలు ఉన్నారు' అని బుర్కినా ఫాసో అధ్యక్షుడు రోచ్ మార్క్ క్రిస్టియన్ కబోర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. ఉగ్రవాదులను రక్షణ, భద్రతాదళాలు ధైర్యసాహసాలతో ఎదుర్కొన్నాయని తెలిపారు. రెండ్రోజులు జాతీయ సంతాప దినాలుగా ప్రకటించారు. దాడిలో 20 మంది సైనికులు, మరో ఆరుగురు పౌరులు గాయపడ్డారని ప్రభుత్వ అధికార ప్రతినిధి తెలిపారు. అర్బిందాలో పదుల సంఖ్యలో ఉగ్రవాదులు ద్విచక్రవాహనాలపై వచ్చి కొన్ని గంటల పాటు కాల్పులకు తెగబడ్డారని, సైనికులు అక్కడకు చేరుకోగానే వెనుదిరిగారని సైన్యం తెలిపింది. దాడులకు పాల్పడింది తామేనని ఇప్పటివరకు ఎవరూ ప్రకటించలేదు. అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ సంస్థలే ఈ దారుణానికి పాల్పడ్డాయని అనుమానిస్తున్నారు. ఇస్లామిస్ట్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంతో సహకరించాలని జీ5 సాహెల్ దేశాల సదస్సులో ఈ నెల మొదటివారంలోనే చర్చించగా, తాజాగా దాడులకు పాల్పడటం కలకలం రేపింది. ఉగ్ర నిర్మూలనకు బుర్కిన ఫాసో.. ఫ్రాన్స్ సైన్యం సహకారం తీసుకుంటున్నది. ఉగ్రవాదులు దాదాపు ఐదేండ్లుగా ఆ దేశంలో జరుపుతున్న హింసలో తాజా ఘటన అత్యంత తీవ్రమైంది. మాలి, నైజర్ దేశాలకు సరిహద్దున ఉన్న బుర్కినా ఫాసోలోని సాహెల్ ప్రాంతంలో 2015 నుంచి ఉగ్రవాదులు తరచూ దాడులకు పాల్పడి వందలమంది ప్రాణాలను తీశారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
గురువారం 26 డిసెంబర్ 2019

పోలీస్ విక్రమ్ రుద్రరాజు


విశ్వక్‌సేన్

'అ!' సినిమాతో నిర్మాతగా తొలి ప్రయత్నంలోనే పెద్ద విజయాన్ని అందుకున్నారు హీరో నాని. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో రూపొందుతున్న తాజా చిత్రం 'హిట్'. 'ది ఫస్ట్ కేస్' ఉపశీర్షిక. విశ్వక్‌సేన్, రుహానీశర్మ జంటగా నటిస్తున్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ప్రశాంతి తిపిరినేని నిర్మిస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని బుధవారం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో తీక్షణమైన చూపులతో స్టైలిష్‌గా విశ్వక్‌సేన్ కనిపిస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ 'విక్రమ్ రుద్రరాజు అనే సూపరెండెంట్ ఆఫ్ పోలీస్‌గా విశ్వక్‌సేన్ పాత్ర శక్తివంతంగా ఉంటుంది. ఓ కేసు మిస్టరీని అతడు ఎలా ఛేదించాడన్నది ఆకట్టుకుంటుంది. జనవరి 1న ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదలచేస్తాం. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ జరుగుతున్నది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, సినిమాటోగ్రఫీ: మణికందన్, సమర్పణ: నాని.

జాన్వీకపూర్

విజయ్ నా ఆల్‌టైమ్ క్రష్

విజయ్ దేవరకొండ తన ఆల్‌టైమ్ క్రష్ అని పేర్కొన్నది శ్రీదేవి తనయ జాన్వీకపూర్. 'అర్జున్‌రెడ్డి' సినిమాతో భాషాభేదాలకు అతీతంగా చక్కటి అభిమానగణాన్ని సొంతం చేసుకున్నారు టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ. విజయ్‌కి ఉన్న పెద్ద అభిమానుల్లో బాలీవుడ్ కథానాయిక జాన్వీ కపూర్ ఒకరు. ఇదివరకు పలు వేడుకల్లో విజయ్ దేవరకొండపై ప్రశంసల్ని కురిపించింది ఈ సొగసరి. తాజాగా ఓ రియాలిటీ టాక్‌షోలో విజయ్ పట్ల తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నది. జాన్వీ కపూర్ మాట్లాడుతూ 'విజయ్‌పై నాకున్న ఇష్టం గురించి చాలా సార్లు చెప్పాను. కానీ అతడి నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు' అంటూ సరదాగా వ్యాఖ్యానించింది. ఆమె మాట్లాడుతూ 'అతడిపై నాకున్నది కేవలం ఆరాధనభావమే. అది పూర్తిగా వన్‌సైడ్ మాత్రమే. విజయ్ కెరీర్‌లో స్థిరంగా రాణిస్తున్నారు. అతడిపై నా అభిమానం స్థిరంగా ఉంది. విజయ్ పట్ల నాకున్న ఇష్టం సురక్షితమైన జోన్‌లో ఉంది. అందుకే దాని గురించి పబ్లిక్‌గా మాట్లాడుతున్నాను' అని చెప్పింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా తెరకెక్కనున్న 'ఫైటర్' సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

త్యాగానికి మారుపేరు

మహేష్‌బాబు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. దిల్‌రాజు సమర్పణలో జి.ఎం.బి ఎంటర్‌టైన్‌మెంట్, ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకుడు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నది. ఇటీవల ఈ చిత్రంలోని 'సరిలేరు నీకెవ్వరు నువ్వెళ్లే రహదారికి జోహారు..ఎనలేని త్యాగానికి నువ్వే మారుపేరు' అనే గీతాన్ని చిత్రబృందం విడుదలచేసింది. యూరప్‌లోని మెసెడోనియన్ సింఫనీ ఆర్కెస్ట్రాతో సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఈ పాటను రికార్డ్ చేశారు. శంకర్ మహదేవన్ ఆలపించారు. ఈ పాటకు చక్కటి స్పందన లభిస్తున్నదని చిత్రబృందం పేర్కొన్నది. సమాజంలోని అవినీతిపై పోరాడే ఓ సైనికుడి కథతో అనిల్‌రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జనవరి 5న ప్రీరిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. జనవరి 11న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. విజయశాంతి, రాజేంద్రప్రసాద్, ప్రకాష్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు.


సత్యదేవ్

ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య

'బాహుబలి' సినిమాతో అద్వితీయ విజయాన్ని అందుకున్నారు నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని. ఈ సినిమా తర్వాత వారు విజయ ప్రవీణ పరుచూరితో కలిసి నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య'. 'కేరాఫ్ కంచెరపాలెం' ఫేం వెంకటేష్ మహా దర్శకత్వం వహిస్తున్నారు. సత్యదేవ్ కథానాయకుడు. టైటిల్‌ను బుధవారం చిత్రబృందం ప్రకటించింది. నిర్మాతలు మాట్లాడుతూ 'మలయాళ చిత్రం 'మహేశింతే ప్రతీకారమ్' ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. ఓ ఫొటోస్టూడియో ఓనర్ ఎవరిపై ప్రతీకారం తీర్చుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది. అరకువ్యాలీలో 36 రోజుల్లో సినిమాను పూర్తిచేశాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నాం. ఏప్రిల్ 17, 2020లో సినిమాను విడుదలచేస్తాం. జాతీయ పురస్కార గ్రహీతలు బిజ్‌బల్ సంగీతం, అప్పు ప్రభాకర్ సినిమాటోగ్రఫీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి' అని తెలిపారు. నరేష్, సుహాస్, జబర్దస్త్ రాంప్రసాద్, కరుణాకరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: శోభుయార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, విజయ ప్రవీణ పరుచూరి.

గురురాజ్

కథ సినిమాకు హీరో

'కథ బాగుంటే చిన్న సినిమా, పెద్ద సినిమా అనే భేదాలు లేకుండా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకముంది' అని అన్నారు గురురాజ్. సుఖీభవ మూవీస్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నటరాజ్, నూరిన్, అంకిత నాయకానాయికలుగా నటించారు. నటుడు సత్యప్రకాష్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. జనవరి 1న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో గురురాజ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'సత్యప్రకాష్ చెప్పిన పాయింట్ నచ్చి ఈ సినిమాను నిర్మించాను. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా సరికొత్త కథ, కథనాలతో ప్రతి ఒక్కరిని ఎంటర్‌టైన్ చేస్తుంది. గ్లామర్ హంగులతో ముడిపడిన కథ కావడంతో సెన్సార్ వారు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. రొమాంటిక్ సన్నివేశాలన్నీ కథానుగుణంగానే ఉంటాయి. యాక్షన్, భావోద్వేగాల సమాహారంగా సాగుతూ నవ్విస్తూనే థ్రిల్‌ను పంచుతుంది. నటుడిగా తనకున్న అనుభవంతో సత్యప్రకాష్ సినిమాను అద్భుతంగా రూపొందించారు.

రామ్‌గోపాల్‌వర్మతో సినిమా..

ఈ సినిమాలో నేను కథను ముందుకు నడిపించే కీలక పాత్రలో నటించాను. నటుడిగా ఈ సినిమా నాకు మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందనే నమ్మకం ఉంది. కథే ఈ సినిమాకు హీరో. మేము ఏదైతే అనుకున్నామో ఆ పాయింట్‌ను తెరపై పరిపూర్ణంగా ఆవిష్కరించడానికి కొబ్బరికాయ కొట్టిన రోజు నుంచి గుమ్మడికాయ కొట్టే రోజువరకు పూర్తిగా ఈ సినిమా నిర్మాణంలో ఇన్‌వాల్వ్ అయ్యాను. నిర్మాతగా చక్కటి సంతృప్తిని మిగిల్చింది. రామ్‌గోపాల్‌వర్మతో మా సంస్థలో ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నాను.

పరాజయాన్ని అందంగా స్వీకరిస్తా


నైనా గంగూలీ, రామ్‌గోపాల్‌వర్మ, సూరి, అగస్త్య మంజు

' ప్రేమకథతో నేను సినిమా చేసి చాలా ఏళ్లు అవుతోంది. నాలో స్ఫూర్తిని రేకెత్తించే కథతో పాటు నటీనటులు లభించకపోవడమే అందుకు కారణం' అని అన్నారు రామ్‌గోపాల్‌వర్మ. టైగర్ కంపెనీ ప్రొడక్షన్స్ పతాకంపై ఆయన రూపొందించిన తాజా చిత్రం 'బ్యూటిఫుల్' 'ట్రిబ్యూట్ టు రంగీలా' ఉపశీర్షిక. సూరి, నైనా గంగూలీ జంటగా నటించారు. అగస్త్య మంజు దర్శకుడు. టి.నరేష్‌కుమార్, టి శ్రీధర్ నిర్మించారు. జనవరి 1న విడుదలకానుంది. ఇటీవల ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే ఏ ఎమోషన్ అయినా అందంగానే ఉంటుంది. హిట్ సినిమాను నేను ఎంత బ్యూటిఫుల్‌గా తీసుకుంటానో పరాజయాన్ని అంతే అందంగా స్వీకరిస్తాను. ఈ సినిమాలో దర్శకుడు అగస్త్య మంజు ప్రేమకథను కొత్త కోణంలో ఆవిష్కరించారు' అని తెలిపారు. ముంబాయిలోని ధారావి అనే ప్రాంతంలో జరిగే ప్రేమకథ ఇదని దర్శకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాష్‌పూరి, సి.కల్యాణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలో కథానాయిక నైనా గంగూలీతో కలిసి వేదికపై డ్యాన్స్ చేసి అభిమానుల్ని ఆకట్టుకున్నారు రామ్‌గోపాల్‌వర్మ.